
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 7-10-2023
సంపుటి : 9 | సంచిక : 229 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

హాకీలో ఇండియాకు గోల్డ్ మెడల్



వివరాలు 12లో..



మోగనున్న నగారా..!

8 లేదా 10న ఐదు అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్

న్యూఢిల్లీ : దేశంలోని ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల తేదీలను 8 నుంచి 10వ తేదీ మధ్య ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం ఉన్నట్టు జాతీయ మీడియా కథనాలు వెలువడుతున్నాయి. ఈ ఏడాది తెలంగాణ, రాజస్థాన్, మిజోరం, మధ్యప్రదేశ్ , ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ రాష్ట్రాల్లో పోలింగ్ నవంబర్ మధ్య నుంచి డిసెంబర్ తొలి వారంలోపు జరపవచ్చుని ఈసీ వర్గాలను ఉటంకిస్తూ ఈ కథనాలు పేర్కొన్నాయి. తెలంగాణ, రాజస్థాన్, మిజోరం, మధ్యప్రదేశ్‌లో ఒకే విడతలో ఎన్నికలు జరిగే అవకాశాలుండగా.. ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. మిజోరం అసెంబ్లీ గడువు డిసెంబర్ 17నే ముగియనుండగా.. తెలంగాణ, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీల గడువులు 2024 జనవరిలో వివిధ తేదీల్లో ముగుస్తాయి.అయిదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వ్యూహాన్ని ఖరారు చేయడానికి కేంద్ర ఎన్నికల ...11లో

ప్రలోభాలకు పన్ను చెల్లింపు సొమ్ము



కేంద్రానికి 'సుప్రీం' నోటీసులు

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తాయిలాలు పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తూ సుప్రీం కోర్టు లో ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఉచితాల విషయంలో పన్ను చెల్లింపుదారుల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని, దీన్ని నిరోధించేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషన్‌దారు అభ్యర్థించారు. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్ధీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే పిల్‌పై సమాధానం ...11లో

బిడ్డల ఆకలి తీర్చేందుకే..

మానవీయ కోణంలో సీఎం ఆలోచనే అల్పాహార పథకం

- 27,147 ప్రభుత్వ పాఠశాలల్లో 23 లక్షల మంది విద్యార్థులకు లబ్ది
- ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించిన మంత్రులు హరీశ్ రావు, సబిత ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి


ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మానవీయతా కోణంలో ఆలోచించి 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'ను ప్రారంభించారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో 27,147 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 23 లక్షల మంది విద్యార్థులకు కడుపు నిండా భోజనం లభిస్తుందని, బడి ప్రారంభానికి ఓ అరగంట ముందు అల్పాహారం అందించనున్నారని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. అనంతరం చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ హరీశ్‌తో పాటు విద్యార్థులతో కలిసి మంత్రులు సహపంక్తిలో కూర్చుని అల్పాహారం తిన్నారు. వండిన పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పని దినాల్లో ప్రతి రోజూ మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన బ్రేక్ ఫాస్ట్ అందించాలని, శుచి శుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. చిన్నారులను ఎమ్మెల్యే, కలెక్టర్ ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రతి రోజూ క్రమం తప్పకుండా బడికి వస్తూ చక్కగా చదువుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం ఏ సంక్షేమ పథకాన్ని తీసుకున్నా ఎంతో ఆలోచించి ప్రారంభిస్తారన్నారు. ఆడ పిల్లల పెండ్లికి కల్యాణలక్ష్మి అందించడం ద్వారా ...11లో

కులగణనే తొలి అడుగు..

బీజేపీకి చెక్ పెట్టే ఎత్తుగడ

హిందీ బెల్ట్‌లో పాగాకు ఇండియా వ్యూహం

ఇప్పుడు దేశంలో రాజకీయ వాతావరణం క్రమేపీ మారుతోంది. హిందీ రాష్ట్రాలలో బీజేపీ ఆధిపత్యానికి గండి కొట్టేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి వ్యూహాలు రూపొందిస్తోంది. మతం పేరుతో భావోద్వేగాలను రగిలించి హిందూ ఓట్లను కొల్లగొడుతున్న బీజేపీ కుటిలత్వానికి చెక్ పెడుతోంది. మతం ముసుగులో హిందువుల్లోని అసమానతలను దాచిపెడుతున్న కమలనాథుల గుట్టు విప్పుతోంది. ఇందులో భాగంగానే బీహార్‌లో అధికారంలో ఉన్న ఐక్య జనతాదళ్, ఆర్జేడీ కూటమి కులగణనను విజయవంతంగా నిర్వహించి దేశ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టించింది.





న్యూఢిల్లీ : బీజేపీ హిందూ ఓటు బ్యాంకును బద్దలు కొట్టేందుకు ఇండియా కూటమి ప్రయత్నిస్తోంది. హిందీ రాష్ట్రాలలో ముస్లింలతో పాటు వెనుకబడిన తరగతులు, దళిత హిందువులతో కూడిన బహుజనుల మద్దతు కూడగట్టేందుకు కృషి చేస్తోంది. ఇప్పుడు ఇదే ఇండియా కూటమి గెలుపు వ్యూహమని చెప్పవచ్చు. 1990వ దశకంలో హిందీ ప్రాంతంలో వెనుకబడిన తరగతులు, దళితులు ఏకమయ్యారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత హిందూత్వ వాదం ప్రబలిన కాలం అది. అప్పుడు హిందీ ప్రాంతంలో 'మండల్-కమండల్' రగడ నడిచింది. ఓబీసీ కోటాపై మొట్టమొదటిసారిగా మండల్ కమిషన్ సిఫార్సు చేసింది. దీనిని వెనుకబడిన తరగతుల రాజకీయాలకు ఓ చిహ్నంగా భావించారు. అయితే బీజేపీ తెలివిగా 'మండల్-కమండల్' వాదాన్ని సృష్టించి వెనుకబడిన తరగతుల వారు హిందూత్వ వైపు ఆకర్షితులయ్యేలా చేసింది.

కుల కోటాల విస్తరణే పరిష్కారం

కానీ రోజులన్నీ ఒకేలా ఉండవు. దేశంలో ఉద్యోగాలు, ఉపాధి దొరకడం కష్టమైంది. ప్రజలను వ్యవసాయం నుండి పరిశ్రమల వైపు మరల్చడంలో మోడీ విఫలమయ్యారు. వెనుకబడిన హిందీ ప్రాంతంలో ఇది ప్రతికూల ప్రభావం చూపింది. జీవనోపాధి కోసం అనేక మంది కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలసబాట పట్టారు. ఈ సమస్యకు కుల కోటాల విస్తరణే పరిష్కారమని ఇండియా కూటమి భావించింది. ఇది హిందూత్వ ముసుగులో ఉన్న బీజేపీ అసలు ...11లో

కులగణనకు కేంద్రంపై ఒత్తిడి



- ఎన్డీయే మిత్రపక్షాల నుంచీ అదే మాట
- ఓబీసీలపై 'రోహిణి ప్యానెల్' సిఫారసుల అమలుకు అవకాశం 11లో..

బీహార్‌లో కులగణనపై జోక్యానికి నో

- నివేదిక వెల్లడించకుండా నిరోధించడమా... కుదరదు : సుప్రీంకోర్టు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్ లో కులగణనపై 'స్టే' ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఇటీవల ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణనకు సంబంధించి తదుపరి సమాచారాన్ని వెల్లడించకుండా నిరోధించడం కుదరదని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొనే విధానపరమైన నిర్ణయాన్ని అడ్డుకోలేమని స్పష్టం చేసింది. ఈ కుల ఆధారిత సర్వేను సమర్థిస్తూ ...11లో

పింఛన్ల పెంపుపై త్వరలో శుభవార్త

ఢిల్లీలోనే కాంగ్రెస్, బీజేపీల టికెట్ల పంచాయితీ

కరెంటు తీగలు పట్టుకుంటే కరెంటు ఇస్తున్నమో లేదో తేలుద్ది..

- వరంగల్, హన్మకొండ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్, బీజేపీ పార్టీల టికెట్ల పంచాయితీ ఢిల్లీలోనే జరుగుతున్నదని, ఈ రెండు పార్టీలు ఎన్నికలొస్తున్నా యంటే సంక్రాంతికి గంగిరెద్దులోళ్లు వచ్చినట్టు ప్రజల వద్దకు వస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే.. అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్లు పెంచనున్నామని, అది ఎంత పెంచబోతున్నామనే విషయాన్ని స్వయంగా సీఎం కేసీఆరే ప్రకటిస్తారని తెలిపారు. తొందరలోనే శుభవార్త వింటారని అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్‌లో పర్యటించిన మంత్రి కేటీఆర్.. వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో రూ.900 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ...11లో



సమస్యలు పరిష్కరించరు.. సమ్మెలు వద్దంటారు..!!

కార్మిక హక్కులు కాలరాస్తున్న మోడీ, కేసీఆర్

- ఎన్నికల్లో కార్మికవర్గ సత్తా చూపాలి..
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి : కార్మిక మహాసభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ వివరాలు 2లో..

లోక్‌సభ ఎన్నికలే లక్ష్యం

బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం జత కట్టాయి

- అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 25, బీజేపి 5,ఎంఐఎం ఒక స్థానానికే పరిమితం
- కేసీఆర్‌తోనే తెలంగాణకు అన్యాయం : రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన కసిరెడ్డి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపి, బీఆర్ఎస్, ఎంఐఎంల మధ్య కూటమి ఏర్పడిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఓడించేందుకు బీజేపీ తన ఓటు బ్యాంక్ ను బీఆర్ఎస్ కు బదిలీచేస్తోందన్నారు. తన దోస్త్ ...2లో

నర్గీస్ మొహమ్మదికి నోబెల్

- ఇరాన్‌లో మహిళల అణచివేతపై పోరాట యోధురాలికి శాంతి బహుమతి వివరాలు 2లో..

19 నుంచి జూనియర్ కాలేజీలకు దసరా సెలవులు

- పాఠశాలలకు 13 నుంచే... వివరాలు 11లో..


టీచర్ల బదిలీలపై 19 వరకు స్టే

హైకోర్టు ఆదేశాలు జారీ

వివరాలు 2లో..

అరెస్టుకు బలమైన కారణమే లేదు

ఎఫ్ఐఆర్ పై సందేహం : ఢిల్లీ హైకోర్టు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

న్యూస్‌క్లిక్ చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థా, హెచ్ఆర్ మేనేజర్ అమిత్ చక్రవర్తిలపై ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన యూఏపీఏ కేసుపై ఢిల్లీ హైకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. అరెస్టు, ఎఫ్ఐఆర్‌ను ప్రశ్నిస్తూ ప్రబీర్, అమిత్‌లు దాఖలు చేసిన పిటిషన్‌లను పరిగణనలోకి తీసుకున్న కోర్టు ఢిల్లీ పోలీసులతో సందేహాలు లేవనెత్తింది. ఈ పిటిషన్లపై ఢిల్లీ పోలీసుల స్పందనను విచారించేందుకు హైకోర్టు సింగిల్ బెంచ్ కేసును సోమవారానికి వాయిదా వేసింది.

ప్రబీర్, అమిత్‌లను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ రిమాండ్ దరఖాస్తులో అరెస్టుకు గల కారణాలను ఎందుకు వెల్లడించలేదని జస్టిస్ తుషార్‌రావు గేదెల ఢిల్లీ పోలీసులను ప్రశ్నించారు. అరెస్టుకు గల బలమైన కారణాలను వెల్లడించకపోవడం సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధమని, ఈ విషయం మీకు తెలుసా? అని ఢిల్లీ పోలీసుల తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోర్టు ప్రశ్నించింది. రిమాండ్ ఆర్డర్‌లో కొన్ని సమస్యలు ఉన్నాయని కూడా కోర్టు గమనించింది. ఉదయం ఆరు గంటలకు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. డిఫెన్స్ లాయర్ల వాదన వినలేదని కోర్టు తెలిపింది.న్యాయవాదుల వాదన వినకుండానే రిమాండ్ ఉత్తర్వులు జారీ చేశారని ప్రబీర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. "ఇద్దరి అరెస్టు చట్ట విరుద్ధం. అరెస్టుకు గల కారణాలను వెల్లడించలేదు. రిమాండ్‌కు ముందు న్యాయవాది వాదనలు వినలేదు. ఇది ఢిల్లీ హైకోర్టు నిబంధనలకే విరుద్ధం. ఈ కేసులో ప్రతివాదులు తప్పనిసరిగా లాయర్‌ను కలిగి ఉండాలని చట్టం పేర్కొంది. న్యాయవాది ...11లో

ఎఫ్ఐఆర్‌లో నిరాధారమైన, తప్పుడు ఆరోపణలు

- ఆధారాలు చూపని ఢిల్లీ పోలీసులు 2లో..

మీడియా స్వేచ్ఛను హరిస్తే ఖబడ్దార్

- పాలకుల బెదిరింపులకు భయపడేది లేదు
- హైదరాబాద్‌లో జర్నలిస్టుల నిరసన ర్యాలీలో వక్తలు వివరాలు 10లో..

మోడీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

తెలంగాణలో గెలవాలి.. కేంద్రంలో మళ్లీ రావాలి..కష్టపడండి

- కుటుంబ కేంద్రీకృతంగా ప్రాంతీయపార్టీలు వివరాలు 2లో..
- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు జేపీ నడ్డా దిశానిర్దేశం



లోక్‌సభ ఎన్నికలే లక్ష్యం..

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్‌ను గెలిపించేందుకే ప్రధాని మోడీ పదే పదే తెలంగాణకు వస్తున్నారని ఆరోపించారు. అయితే రానున్న అసెంబ్లీ స్థానాల్లో ఈ కూటమి పార్టీలు వేరు వేరుగా పోటీచేస్తాయని, లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కలిసి బరిలో ఉంటాయన్నారు. మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో ... బీజేపీ 7, బీఆర్ఎస్ 9, ఒక సీట్‌లో ఎంఐఎం పోటి చేయ నుందన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలపై వస్తోన్న అన్ని సర్వేలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయ న్నారు. బీఆర్ఎస్ 25 సీట్ల లోపు, బీజేపీ 5 సీట్ల లోపు, ఎంఐఎం 6 సీట్లకు పరిమితం అవుతుంద న్నారు. మొత్తం కూటమికి కలిసి 36 సీట్లు వస్తే... మిగిలినవి కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. బీజేపీ స్టీరింగ్ ఆదాని చేతిలో, బీఆర్ఎస్ స్టీరింగ్ ఎంఐఎం నేతల హ్యాండ్‌లో ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు కేవలం నిషానీలు అని విమర్శించారు. శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు.

ఆయన వెంట నాగర్ కర్నూల్ జిల్లా వైస్ చైర్మన్ బాలా సింగ్, కల్వకుర్తికి చెందిన ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రాజాజీ మార్గ్ 10 లో జరిగిన ఈ జాయినింగ్ ప్రొగ్రాంలో కాంగ్రెస్ అగ్రనేత కేసీ వేణుగోపాల్, టీపీసీసీ చీఫ్ రేవంత్, సీడబ్ల్యూసీ మెంబర్ వంశీ చందర్ రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ అవసరాల దష్ట్యా వంశీచందర్ రెడ్డి తన కల్వకుర్తి సీటును కసిరెడ్డి నారాయణ రెడ్డికి ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో బిల్లా, రంగాలు తిరుగుతున్నారంటూ హరీష్‌రావు, కేటీఆర్‌లపై విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం, ధరణి పేరుతో లక్ష కోట్లు, వేల ఎకరాల భూమిని దోచుకున్నారని ఆరోపించారు. దీనిపై ఎం చెప్పాలో తెలియక కేసీఆర్ ఫాం హౌజ్‌లో పడుకుంటే ఈ ఇద్దరు కుక్కల్లా ఊర్లపై తిరుగుతూ, కనిపించిన వాళ్లను కరుస్తున్నా రని ఫైర్ అయ్యారు. 'పదేండ్ల పాలనలో ఏమి చేయ కుండా. కిరాయి మనుషులను తెచ్చి, సార పోసి, బీరు ఇచ్చి, పైసలు పంచి... వాళ్ల ముందు కేసీఆర్ శివతాండం చేస్తే, బిల్లా రంగాలిద్దరు సన్నాయి నొక్కు లు నొక్కుతున్నారు' అని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ నేతల్ని మరుగుజ్జులని విమర్శిస్తోన్న కేటీఆర్... కేసీఆర్ ఏమైనా బాహుబలి నా " అని ప్రశ్నించారు.

ప్రజల సెంటిమెంట్ నిర్మాణాల్లోనూ దోపిడీయే...

తెలంగాణ ప్రజల సెంటిమెంట్ నిర్మాణాలలో కూడా బీఆర్ఎస్ సర్కార్ దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. అమర వీరుల స్థూపం నుంచి సెక్రెటేరియట్ వరకు అవినీతి జరిగిందన్నారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణంలో రూ. 100 కోట్ల టెండర్లు పిలిచి రూ. 200 కోట్లు చేశారన్నారు. రూ. 64 కోట్లతో టెండర్లు పిలిచిన అమరవీరుల స్థూపం రూ. 200 కోట్లు అయిందన్నారు. రూ. 4 వందల కోట్లతో నిర్మిస్తామన్న సచివాలయం బడ్జెట్ రూ. 1400 కోట్లకు చేశారన్నారు. కేసీఆర్ లాంటి నీచులు తెలంగాణ సమాజంలోనే లేరని విమర్శించారు. అందుకే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ప్రజల సంక్షేమం, అభివద్ధే కాంగ్రెస్ ప్రాధాన్యత లు అన్నారు. హైదరాబాద్ వేదికగా పార్టీ మూడు రోజులు సమీక్షలు జరిపి... ఆరు గ్యారెంటీలు ప్రకటించిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఇతర రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడంలేదని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారన్నారు. మరి సిద్దిపేట, సిరిసిల్ల , గజ్వేల్ లో బీఆర్ఎస్ సర్కార్ అమలు చేస్తోన్న స్కీంలను తెలంగాణ అంతటా ఎందుకు అమలు చెయ్యడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలోనే సమానమైన అభివద్ధి చేయని సన్యాసులు, దేశమంతా కాంగ్రెస్ అమలు చేసే పథకాలపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి ఏపీలో 2004 లో తొలిసారి ఉచిత విద్యుత్, ఫీజు రియంబర్స్ మెంట్, ఆరోగ్య శ్రీ, రైతు రుణ మాఫీ, మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు, జలయజ్ఞం పేరుతో భారీ స్థాయిలో సాగునీటి ప్రాజెక్ట్ లను చేపట్టింది కాంగ్రెస్ అని గుర్తుచేశారు. జర్నలిస్ట్‌లకు సైతం ఇండ్ల పట్టాలు, బస్ పాస్‌లు ఇచ్చింది కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో... అక్కడి ఆదాయం, ప్రజల అవసరాలను బట్టి వివిధ స్కీంలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు తప్పక నెరవేరుస్తామని చెప్పారు.

కేసీఆర్ తోనే తెలంగాణకు అన్యాయం...

ఉమ్మడి పాలనలో జరిగిన పాలనతో తమకు సంబంధం లేదన్నారు. అప్పుడు జరిగిన లోపాలను దృష్టిలో పెట్టుకొనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం తెలంగాణకు ఏదైనా అన్యాయం జరిగిందంటే అందుకు కేసీఆరే కారణమన్నారు. 60 ఏండ్లలో తాము చేసిన అప్పు రూ. 69 వేల కోట్లు అయితే, 9 ఏండ్లలో కేసీఆర్ చేసిన అప్పు రూ. 5.50 లక్షల కోట్లు అన్నారు. రూ. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో రాష్ట్రాన్ని అప్పగిస్తే.. లక్షల కోట్ల లోటు బడ్జెట్ తో తెలంగాణ మునిగిపోయిందన్నారు.

తెలంగాణలో యూపీఏ1, యూపీఏ 2 (2004-14) వరకు కాంగ్రెస్ పాలన, బీఆర్ఎస్ పదేండ్ల పాలన(2014-24) తీరుపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ కంటే, బీఆర్ఎస్ పాలన భేష్ అని తేలితే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. బీఆర్ఎస్ సర్కార్‌కు కౌంట్ డౌన్ మొదలైందని హెచ్చరించారు. పదేండ్లలో ఏర్పాటు చేయని పసుపు బోర్డు... పది రోజుల్లో సాధ్యామా ? అని ప్రశ్నించారు. దీనిపైన బాండ్ పేపర్ ఇచ్చిన వారే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎఫ్ఐఆర్‌లో నిరాధారమైన, తప్పుడు ఆరోపణలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నిరాధారమైన, తప్పుడు ఆరోపణలతో నింపారు. ఇందులో ఆయన గత లోక్‌సభ ఎన్నికలను విధ్వంసం చేయడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. ప్రబీర్ పుర్కాయస్తా, అమెరికాకు చెందిన వ్యాపారవేత్త నెవిల్లే రాయ్ సింఘమ్, గౌతమ్ నవ్‌లాఖా విదేశాల నుంచి అక్రమంగా నిధులు పొంది దేశానికి చేరుకున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులు దేశ సార్వభౌమాధికారం, భౌగోళిక సమగ్రతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందుకోసం చైనా మొబైల్ కంపెనీలైన షియోమీ, వివోల నుంచి అక్రమంగా నిధులు పొందినట్లు కూడా ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. కాశ్మీర్, అరుణాచల్‌ను చైనాలో భాగాలుగా చేసి మ్యాప్‌ను మార్చే కుట్ర కూడా జరిగిందని ఆరోపించారు. కానీ ఎఫ్ఐఆర్‌లో ఈ తీవ్రమైన ఆరోపణలకు మద్దతుగా ఎలాంటి ఆధారాలను ఢిల్లీ పోలీసులు చేర్చలేకపోయారు. షియోమీ, వివో వంటి చైనా కంపెనీలు ఫెమా, పీఎంఎల్‌ఏ నిబంధనలను ఉల్లంఘించి వేల సంఖ్యలో షెల్ కంపెనీలను దేశంలోకి అక్రమంగా తరలించే కుట్రలో భాగంగా భారత్‌లో ఏర్పాటు చేశాయని పేర్కొన్నారు. ప్రబీర్, నెవిల్లే, గీతా హరిహరన్, గౌతమ్ భాటియా (ఒక కీలక వ్యక్తి) చైనా కంపెనీలపై కేసులను వాదించడానికి, ప్రచారం చేయడానికి న్యాయవాదులు ఏర్పాటు చేయడానికి కుట్ర పన్నారు. చైనా కంపెనీల నుంచి అందిన సహాయానికి ప్రతిఫలంగా ఇటువంటి చర్య జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ, చైనా విధానాలను ప్రశంసిస్తూ 'పెయిడ్ న్యూస్' రూపొందించేందుకు చైనా నుంచి నిధులు వచ్చాయని ఆరోపించారు. 2019 లోక్‌సభ ఎన్నికలను విధ్వంసం చేసేందుకు ప్రబీర్ వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించారని, ఆ గుంపు ఇప్పుడు లేదని పేర్కొన్నారు. పీపుల్స్ అలయన్స్ ఫర్ డెమోక్రసీ అండ్ సెక్యులరిజం ఎన్నికల విధ్వంసక చర్యను చేపట్టిందని, బథినీ రావ్, దిలీప్ సిమియోన్, దీపక్ ఢోలాకియా, హర్ష్ కపూర్, జమాల్ కిద్వాయ్, అసిత దాస్ కూడా కుట్రల్లో పాల్గొన్నారని ఆరోపించారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వ ప్రయత్నాలను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నించారు. అంతేకాదు దేశీయ ఔషధ కంపెనీలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించింది. నిందితుడు నిషేధిత ఉగ్రవాద సంస్థ పట్ల సానుభూతి చూపాడు. కాశ్మీర్, అరుణాచల్‌లను భారతదేశంలో భాగం చేయకూడదనే వారి కోరిక వారు ఒకరికొకరు పంపిన ఇమెయిల్‌లను బట్టి స్పష్టంగా కనిపిస్తుందని ఎఫ్ఐఆర్ ఆరోపించింది.

పీఎం కేర్స్ కు చైనా కంపెనీల నిధులు

2020లో పూర్తిగా మోడీ నియంత్రణలో ఉన్న పీఎం కేర్స్ ఫండ్‌కి రూ.10 కోట్లను విరాళంగా వివో, ఎక్స్‌ఓమి కంపెనీలు ఇచ్చాయి. ఈ కంపెనీలకు తరపున హాజరయ్యారని ఢిల్లీ పోలీసులు ఆరోపిస్తున్న గౌతమ్ భాటియా ఎవరో న్యాయ రంగంలోని వారికి కూడా స్పష్టంగా తెలియదు. బెంగళూరు, ఢిల్లీ కోర్టుల్లో ఈ కంపెనీల తరపున గౌతం భాటియా హాజరుకాలేదు.

వేల సంఖ్యలో నకిలీ చైనా కంపెనీలు భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్నాయని, అక్రమంగా నిధులు తరలిస్తున్నాయని ఢిల్లీ పోలీసులు పేర్కొంటున్నప్పుడు, మోడీ పాలనలో అంతర్గత భద్రత అంతగా దిగజారిపోయిందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎన్నికల విధ్వంసక ప్రయత్నాలు వంటి ఆరోపణలకు ఢిల్లీ పోలీసులు ఎలాంటి ఆధారాలు అందించలేకపోయారు. నిందితులకు నిషేధిత ఉగ్రవాద సంస్థతో సానుభూతి ఉందని చెప్పినప్పుడు, ఏ సంస్థ అనేది పేర్కొనబడలేదు.

సమస్యలు పరిష్కరించరు.. సమ్మెలు వద్దంటారు..!!

కార్మిక హక్కులు కాలరాస్తున్న మోడీ, కేసీఆర్

- ఎన్నికల్లో కార్మికవర్గ సత్తా చూపాలి..
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సిందే..! :కార్మిక మహాసభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- ఖమ్మం నగర వీధుల్లో స్కీమ్ వర్కర్ల మహా ప్రదర్శన



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కార్మికుల కష్టంతో నడుస్తున్న ప్రభుత్వాలు వారి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని, కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. 'సమస్యలు పరిష్కరించం.. సమ్మెలు చేయొద్దని' ప్రభుత్వాలు హుకుం జారీ చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల రెక్కల కష్టంతో తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, అదే వర్కర్లకు కనీస వేతనం కూడా ఇవ్వడం లేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్ల సమస్యలపై ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనం ఎదుట నున్న ఎస్ఆర్బీ గ్రౌండ్‌లో కార్మిక మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పెవిలియన్ గ్రౌండ్ నుంచి ఎస్ఆర్బీ గ్రౌండ్ వరకు మహాప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రౌండ్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు తుమ్మా విష్ణు అధ్యక్షతన నిర్వహించిన సభలో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. ఒక డిమాండ్ పరిష్కారం కోసం నాలుగు సమ్మెలు చేయాల్సి వస్తుందని తెలిపారు. చర్చలతో పరిష్కరిస్తాం, సమ్మెలు చేయొద్దంటున్న ప్రభుత్వం.. పోరాటాలు చేస్తే తప్ప సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కార్మిక హక్కులపై మోడీ, కేసీఆర్ దాడులు చేస్తున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు నెలకు రూ. 21 వేల వేతనం ఇస్తున్నారని, తెలంగాణలో మాత్రం రూ.15000 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఒకే పనికి రెండు రాష్ట్రాల్లో వేర్వేరు వేతనాలు ఏంటని ప్రశ్నించారు. పాఠశాలల్లో శుక్రవారం నుంచి అల్పాహారం ఏర్పాటు చేసిన ప్రభుత్వం మధ్యాహ్నం భోజన కార్మికులపై అదనపు భారం మోపింది తప్ప ఆ మేరకు వేతనం పెంచడం లేదని అన్నారు. పోరాటంతోనే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం అని అనుభవపూర్వకంగా తెలిసిందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో సత్తా చూపాలని పిలుపునిచ్చారు.

మొండిగా రాష్ట్ర ప్రభుత్వం: నున్నా నాగేశ్వరరావు

కార్మిక సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ కుటుంబానికి పదవులు వచ్చాయి కానీ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని తెలిపారు. సీఐటీయూ పోరాటాలకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందని స్పష్టంచేశారు. పోరాటాలు చేస్తే తప్ప ఏ సమస్యకూ పరిష్కారం లభించలేదని, ఏ ప్రభుత్వం కూడా దయతో సమస్యలు పరిష్కరించలేదన్నారు. డిమాండ్లు నెరవేర్చుకునేందుకు సీఐటీయూ సమ్మె చేస్తే అవి నెరవేరడంతోనే కేసీఆర్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసి బీఆర్ఎస్ అనుకూల కార్మిక సంఘాల నేతలు పదవులు పొందుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు యర్రా శ్రీకాంత్, వై. విక్రమ్, రమ్య, నాయకులు నరసింహారావు, మంగమ్మ, జల్లా ఉపేందర్, బందారు యాకయ్య, బాణోత్ కమల, భూక్యా శ్రీను, పద్మా, దుగ్గి కృష్ణ, ప్రసాద్, గోపాల్, వేణు, ఏడుకొండలు, రాంబాబు, వెంకయ్య, నరేందర్, రాములు, కళ్యాణి, మురళి, యర్ర మల్లికార్జున్, పాపారాణి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌వి అహంకార పూరిత మాటలు..

- సుమోటోగా కేసు నమోదు చేయాలి :కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం చైర్మెన్ ముత్తినేని వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మరగుజ్జు వికలాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన మంత్రి కేటీఆర్ వారికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం చైర్మెన్ ముత్తినేని వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేటీఆర్ మరుగుజ్జు అనే పదాన్ని వాడకూడదన్న ఇంగితాన్ని మరిచారని తెలిపారు. వారి మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడిన కేటీఆర్ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

టీచర్ల బదిలీలపై 19 వరకు స్టే

- హైకోర్టు ఆదేశాలు జారీ

హైదరాబాద్: స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల బదిలీలను ఈ నెల 19 వరకు నిలిపివేస్తూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా టీచర్ల లంచ్‌మోషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతుల తర్వాత బదిలీలు చేయాలని న్యాయవాది బాలకిషన్ రావు వాదనలు వినిపించారు.

మోడీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో తెలంగాణ ప్రజల కోసం చేసిన అభివృద్ధి పనులను, రాష్ట్రానికి కేటాయించిన నిధుల అంశాలను గ్రామగ్రామాన ప్రచారం చేసి బీజేపీ గెలుపు కోసం శ్రేణులంతా కష్టపడాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జయప్రకాశ్ నడ్డా పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ గెలిచేలా..కేంద్రంలో మళ్లీ అధికారంలో మోడీ సర్కారు వచ్చేలా శ్రమించాలన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని వీబీఐటీ కళాశాలలో శుక్రవారం జరిగిన స్టేట్ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతిప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మోడీ నేతృత్వంలో ప్రపంచవ్యాప్తంగా దేశకీర్తి పెరిగిందన్నారు. 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నామనీ, తెలంగాణలో రెండు కోట్ల మంది లబ్దిదారులున్నారని చెప్పారు. ఐఎమ్ఎఫ్ నివేదికల ప్రకారం తొమ్మిదేండ్ల కాలంలో దేశంలోని 13 కోట్ల మంది పేదరికాన్ని జయించారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా తెలంగాణ ప్రజలకు జరిగిన లబ్దిని ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తీర్ణాన్ని పెంచిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనన్నారు. తొమ్మిదేండ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.9 లక్షల కోట్లను కేటాయించిందని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునికంగా అభివృద్ధి చేశామని తెలిపారు. తెలంగాణ కోసం కేసీఆర్ కంటే ముందే బీజేపీ తీర్మానం చేసిందనీ, పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టే సమయంలో సుష్మాస్వరాజ్ కీలకంగా వ్యవహరించారని వివరించారు. తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ అంటే (భ్రష్టాచార్ రిశ్వత్ సమితి) అవినీతి, లంచగొండి సమితి అని విమర్శించారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నీ ఫ్యామిలీస్ పార్టీలుగా మారాయని చెబుతూ..కాశ్మీర్‌లో ఫరూఖ్ అబ్దుల్లా, బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్, ఉత్తరప్రదేశ్‌లో ములాయంసింగ్ యాదవ్, ఏపీలో జగన్, తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పార్టీలుగా మారాయనీ, అందులో వారి అభివృద్ధి తప్ప వేరేవారిది ఉండదని చెప్పారు. పదో తరగతి, టీఎస్‌పీఎస్‌సీ పేపర్లను లీకేజీ చేసి యువత జీవితాలతో ఆటలాడుకుంటున్న బీఆర్ఎస్‌ని గద్దె దింపాల్సిన అవసరం ఉందన్నారు. రజాకార్లతో చేతులు కలపడానికి కేసీఆర్ నీకు సిగ్గుందా? అని ప్రశ్నించారు. రజాకార్లను తలపించే పాలన చేస్తున్న కేసీఆర్‌ను గద్దె దింపేందుకు బీజేపీ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

60 రోజులే ఉంది.. కష్టపడండి : జి.కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో ఎన్నికలు పూర్తి కావడానికి కేవలం 60 రోజులు మాత్రమే ఉందనీ, శనివారం నుంచి ప్రతి ఒక్క కార్యకర్త కూడా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి కోరారు. ఓవైసీ అడుగులకు మడుగులొత్తుతున్న కేసీఆర్ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి పార్టీలనే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ముందుకెళ్తే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిస్తే మళ్లీ బీఆర్ఎస్‌కు అమ్ముడుపోతారనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగతం) బీఎల్ సంతోశ్, జాతీయ ప్రధాన కార్యదర్శులు బండి సంజయ్, అర్వింద్ మీనన్, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్‌జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి, రవీందర్‌రెడ్డి గైర్హాజరు

బీజేపీ స్టేట్ కౌన్సిల్ సమావేశానికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి, మరోనేత ఏనుగు రవీందర్‌రెడ్డి గైర్హాజర య్యారు. తాను పార్టీ మారబోవటం లేదంటూ రాజగోపాల్‌రెడ్డి గురువారం మీడియా ముఖంగా చెప్పిన విషయం విదితమే. కానీ, మరుసటి రోజే కీలక మైన సమావేశం జరుగుతున్న సమయంలో ఆయన హాజరుకాకపోవడం పార్టీ మారుతారనే ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రధాని రెండు బహిరంగ సభలకూ ఆయన హాజరు కాని విషయం తెలిసిందే. ఆయన త్వరలో కాంగ్రెస్ కండువా కప్పుకుంటారనే ప్రచారం జరుగుతున్నది.

నర్గీస్ మొహమ్మదికి నోబెల్

ఓస్లో (నార్వే): ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి.. ఇరాన్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త నర్గిస్ మొహమ్మది ని వరించింది. ఇరాన్‌లో మహిళల అణచివేతకు వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటానికి గానూ ఈ అవార్డు ను అందజేస్తున్నట్టు నార్వే నోబెల్ కమిటీ ప్రకటించింది. మానవ హక్కులు, ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ కోసం గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్న నర్గిస్.. ప్రస్తుతం జైల్లో ఉన్నారు. సంప్రదాయం పేరుతో మహిళలకు అనేక ఆంక్షలు విధించే ఇరాన్ లాంటి దేశంలో పుట్టిన నర్గిస్.. చదువుకునే రోజుల నుంచే మహిళా హక్కులపై గళమెత్తారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత కొంతకాలం పలు వార్తాపత్రికలకు కాలమిస్ట్‌గా పనిచేశారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత షిరిన్ ఇబాది స్థాపించిన డిఫెండర్స్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (డీహెచ్ఆర్‌సీ) సెంటర్‌లో 2003లో చేరి ఆ తర్వాత అదే సంస్థకు ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు.

13 సార్లు అరెస్టయి..

హక్కుల కోసం ఆమె చేస్తున్న పోరాటంలో ఎన్నోసార్లు కఠిన సవాళ్లు ఎదురైనా వెనకడుగు వేయలేదు. ఈ క్రమంలోనే 13 సార్లు అరెస్టయ్యారు. ఐదుసార్లు జైలు శిక్షలను ఎదుర్కొన్నారు. 1998లో ఇరాన్ ప్రభుత్వాన్ని విమర్శి ంచినందుకు గానూ తొలిసారి అరెస్టయి ఏడాదిపాటు జైలుశిక్షను అనుభవిం చారు. ఆ తర్వాత డీహెచ్ఆర్‌సీలో చేరినందుకు గానూ మరోసారి అరెస్ట య్యారు.2011లో జాతి విద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో మరోసారి ఆమెను అరెస్టు చేసి 11 ఏండ్లపాటు జైలు శిక్ష విధించారు. అయి నప్పటికీ ఆమె బెదరలేదు. రెండేండ్ల తర్వాత బెయిల్‌పై బయటికొచ్చిన ఆమె.. ఇరాన్‌లో విచ్చలవిడిగా అమలు చేస్తున్న మరణశిక్షలకు వ్యతిరేకంగా గళమెత్తారు. ప్రపంచంలోనే ఏటా అత్యంత ఎక్కువగా మరణ శిక్షలను అమలు చేస్తున్న దేశాల్లో ఇరాన్ ఒకటి. దీనికి వ్యతిరేకంగా ఆమె పోరాటం చేపట్టారు. దీంతో 2015 లో మరోసారి అరెస్టు చేసి జైలుకు పంపించారు.

జైల్లోనూ ఉద్యమం..

ఇరాన్‌లో రాజకీయ ఖైదీలు, ముఖ్యంగా మహిళల పట్ల జరుగుతున్న లైంగిక హింసకు వ్యతిరేకంగా నర్గిస్ జైల్లోనే ఉద్యమం ప్రారంభించారు. అక్కడ కూడా ఆమెకు మద్దతుదారులు పెరగడంతో జైలు అధికారులు ఆమెకు కఠిన ఆంక్షలు విధించారు. ఆమె ఎవరితోనూ ఫోన్లో మాట్లాడకుండా, కలవకుండా నిషేధం విధించారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఆమె తన పోరాటాన్ని కొనసాగించారు.2022 సెప్టెంబరులో హిజాబ్ ధరించనందుకు మాసా అనే యువతిని ఇరాన్ పోలీసులు అరెస్టు చేయగా కస్టడీలో ఆమె తీవ్రంగా గాయపడి మరణించింది. దీంతో అక్కడ పెద్ద ఎత్తున ఆందోళనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలోనూ నర్గిస్ తన గళాన్ని వినిపించారు. అంతేకాదు.. జైల్లో ఎన్ని ఆంక్షలు ఉన్నా.. అక్కడి నుంచే సంచలన నివేదికలు రాసి పలు అంతర్జాతీయ పత్రికలకు పంపించారు. అలా ఆమె రాసిన కథనాలు న్యూయార్క్ టైమ్స్, బీబీసీ వంటి పత్రికల్లో వచ్చాయి.నోబెల్ ఇతర బహుమతుల మాదిరిగా కాకుండా.. శాంతి బహుమతిని నార్వే నోబెల్ కమిటీ ఓస్లోలో ప్రకటిస్తుంది.

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుండి మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టిందని, ప్రజా సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలువనుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న "ముఖ్యమంత్రి అల్పాహారం" పథకాన్ని మంత్రి శుక్రవారం ఖమ్మంలోని రోటరీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించారు.



మారేడపల్లి ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకాన్ని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.




మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్


నిజామాబాద్ జిల్లా వేల్పూరులో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి


కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్...


మెదక్ జిల్లా శివంపేట మండల పరిధిలోని చిన్న గొట్టిముక్కుల పాఠశాలలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి


వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక ప్రాక్టీసింగ్ పాఠశాలలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, చీఫ్ విప్ వినయభాస్కర్

ఉద్యమ కేంద్రంగా కిషన్‌రావు భవనం

- భవనాన్ని ప్రారంభించిన జూలకంటి
- భారీ బైక్ ర్యాలీ



నవతెలంగాణ-మిర్యాలగూడ

మైనం కిషన్‌రావు భవనాన్ని ఉద్యమ కేంద్రంగా ఉపయోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని తక్కెలపాడు గ్రామంలో మైనం కిషన్‌రావు స్మారక భవనాన్ని ప్రారంభించారు. అంతకుముందు సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని తాళ్లగడ్డ వద్ద జెండా ఆవిష్కరించారు. నర్సింగ్ చంద్రయ్యగౌడ్ 39వ వర్ధంతి సందర్భంగా గ్రామ శివారులో నిర్మించిన స్థూపాన్ని ఆవిష్కరించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభలో జూలకంటి మాట్లాడుతూ.. యాద్గారిపల్లి, ఉట్లపల్లి, తక్కెలపాడు, తడకమళ్ల, దొండవారి గూడెం గ్రామాల్లో ప్రజా చైతన్యం ఎక్కువగా ఉండేదన్నారు. ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఈ గ్రామ ప్రజలు వీరోచితంగా పోరాడారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలు చేశారని తెలిపారు. ఎర్రజెండా పక్షాన ఎంతోమంది నాయకులు పోరాటాలు సాగించి దుండగుల చేతిలో హత్యకు గురయ్యారని, వారి ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర ఉద్యమాలు సాగించాలన్నారు. ప్రజలకు పోరాటాలు నేర్పింది కమ్యూనిస్టు పార్టీ అని, ప్రజా సమస్యల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందేలా భవిష్యత్‌లో ఉద్యమాలు చేపడతామన్నారు. ఎన్నికల సందర్భంగా తాత్కాలిక ప్రయోజనాలకు లొంగి.. బంగారు భవిష్యత్‌ని నాశనం చేసుకోవద్దని ప్రజల కోసం పనిచేసే నాయకులకు ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎర్ర జెండాకు అండగా నిలిచి సీపీఐ(ఎం) నాయకులను గెలిపించాలని కోరారు. చట్టసభల్లో వామపక్షాల నాయకులు ఉంటేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. జిల్లా కమిటీ సభ్యులు చౌగాని సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి మూడవత్ రవి నాయక్, జిల్లా నాయకులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగా రెడ్డి, రెమిడీల పరుశురాములు, పాల్గొన్నారు.

పెంచిన వేతనం, బిల్లులు
తక్షణమే చెల్లించాలి

- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ
- మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా.. కొనసాగిన సమ్మె



నవతెలంగాణ-సిటీబ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనం, పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె 10వ రోజు శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, అవరమైన గ్యాస్‌ను ప్రభుత్వమే పూర్తి సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దన్నారు. కార్మికులకు ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కారం చేయకపోతే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని, ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వంటలు చేసిన ఈ చేతులతోనే రానున్న ఎన్నికల్లో పాలకులను గరిటెలతో తిరగబడి తరిమి కొడతామన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా.. ఉదయం అల్పాహారం పథకం ప్రారంభించడం మధ్యాహ్న భోజన కార్మికులకు అదనపు భారమే అవుతుందన్నారు. ప్రతి విద్యార్థికీ రూ.15 చొప్పున బడ్జెట్ కేటాయించాలని, కోడి గుడ్లకు అదనపు బడ్జెట్ ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల మాదిరిగా ప్రభుత్వమే గుడ్లను సరఫరా చేయాలని కోరారు. కార్మికులకు డ్రెస్ కోడ్, వంట షెడ్లు, పాత్రలు, తదితర మౌలిక వసతులు కల్పించాలని, ప్రతి నెలా కార్మికులతో డీఈఓ జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, ఎలాంటి షరతులూ లేకుండా బ్యాంక్ ద్వారా మధ్యాహ్న భోజన కార్మికులకు రుణాలు ఇవ్వాలని, పెరిగిన వేతనాల చెల్లింపునకు బడ్జెట్ విడుదల చేయాలని అన్నారు. యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కె.ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. తక్షణమే పెరిగిన వేతనాల చెల్లింపునకు బడ్జెట్ విడుదల చేయాలలన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, కొత్త మెనూకి అదనపు బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మల్కాజిగిరి మండల కన్వీనర్ బి.నరసింగరావు, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లా నాయకులు సబిత, మండల నాయకులు పద్మా లక్ష్మీ, కమల, భాగ్య, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, మునగాల మండల కేంద్రాల్లో మధ్యాహ్నభోజన వర్కర్లు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా డీఈఓ కార్యాలయం ఎదుట భారీ ర్యాలీ నిర్వహించారు. హాలియాలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు.

బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యే రేఖానాయక్ గుడ్‌బై..!

- పార్టీలో మహిళలకు స్థానం లేదని వ్యాఖ్య
- ఆ పార్టీ అభ్యర్థిని ఓడించి తీరుతా..: రేఖానాయక్



నవతెలంగాణ- ఖానాపూర్

అధికార బీఆర్ఎస్ పార్టీకి నిర్మల్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ రాజీనామా చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ ఆమెకు టికెట్ నిరాకరించిన సంగతి తెలిసిందే. దీంతో అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చిన ఆమె శుక్రవారం రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఖానాపూర్‌లో విలేకరుల సమావేశంలో రాజీనామాకు గల కారణాలు వెల్లడించారు. పార్టీలో మహిళలకు ప్రాధాన్యం లేదని స్పష్టం చేశారు. ఎస్టీ నియోజకవర్గంలో ఎస్టీ కాని జాన్సన్‌నాయక్‌కు టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. పారాచూట్ ఫ్రెండ్‌కు టికెట్ ఇచ్చి తన గొంతు కోశారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని చిత్తుగా ఓడిస్తానన్నారు. రెండేండ్లుగా నియోజకవర్గానికి రావాల్సిన నిధులు నిలిపివేశారని ఆరోపించారు. ఢిల్లీలో మహిళా బిల్లుపై జరిగిన నిరసనలో ఎమ్మెల్సీ కవితక్క తనతో మాట్లాడించారని, ఇప్పుడు నన్నెందుకు పక్కన పెట్టారని కన్నీటి పర్యంతమయ్యారు. నియోజకవర్గంలో ఓటు హక్కు కూడా లేని జాన్సన్ నాయక్‌కు కేవలం కేటీఆర్ స్నేహితుడనే కారణంగానే టికెట్ ఇచ్చారని అన్నారు. ఎన్నికల్లో తాను పోటీలో ఉంటానని, జాన్సన్‌ను ఓడించి తీరుతానని స్పష్టం చేశారు. నిర్మల్‌లో జరిగిన సభలో ఖానాపూర్ అభివృద్ధి జరగలేదని కేటీఆర్ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. నిధులు రాకుండా ఆపేసి అభివృద్ధి జరగలేదని ఆయనే ఒప్పుకున్నారన్నారు. బీఆర్ఎస్‌లో మహిళలు, ఎస్టీలకు ప్రాధాన్యం లేదని ప్రజలతోనే ఉండి వచ్చే ఎన్నికల్లో సత్తా చాటుతానని చెప్పారు.

'మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న రెగ్యులరైజ్ కాకుండా మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులను ఎన్నికల కోడ్ వచ్చేలోపు క్రమబద్ధీకరించాలని సయ్యద్ జబీ డిమాండ్ చేశారు. ఒకేషనల్ అధ్యాపకులతోపాటు పది మంది ఉర్దూ మీడియం అధ్యాపకులను మానవతా దృక్పథంతో ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సీఎం కేసీఆర్ సార్.. మా ఆకలి గోస వినండి

- పనికి తగ్గ పారితోషికం ఇవ్వండి..
- ఫిక్స్‌డ్ వేతనంగా రూ.18 వేలు నిర్ణయించాలి
- సమ్మెలో భాగంగా ధర్నా, రాస్తారోకోలు చేసిన ఆశాలు
- ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం



నవతెలంగాణ- విలేకరులు

"సీఎం కేసీఆర్ సారూ.. మా ఆకలి గోస వినండి.. మాతో అనేక పనులు చేయించుకుంటూ పైసా ఇవ్వడం లేదు.. పనికి తగ్గ పారితోషికాలు ఇవ్వండి.. పారితోషికాలు లేని పనులు మాతో చేయించొద్దు.. రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనంగా నిర్ణయించండి.. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.." అని ఆశాలు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సమ్మెలో భాగంగా శుక్రవారం ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలిచ్చి నిరసన వ్యక్తం చేశారు.

వికారాబాద్ జిల్లా తాండూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో ఆశావర్కర్లు ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారితో పాటు ఆమనగల్ పట్టణంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ తీశారు. ఆశావర్కర్లపై లాఠీచార్జికి నిరసనగా చేవెళ్లలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహానికి ఆశాలు తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో ఆశావర్కర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ సెంటర్‌లో, నేరేడుచర్ల, కోదాడ పట్టణంలో ఆశాలు రాస్తారోకో నిర్వహించారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టిన రాస్తారోకో స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరం నుంచి కుమురం భీమ్ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అక్కడ రోడ్డుపై బైటాయించారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆశాలను, నాయకులను అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు యత్నించారు. వారు వినకపోవడంతో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్‌ను పోలీసులు వాహనంలో ఎక్కించి టూటౌన్‌కు తరలించారు. అయినప్పటికీ ఆశాలు వెనక్కి తగ్గకుండా అక్కడే నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు నిరసకారులను అరెస్టు చేయడానికి ప్రయత్నించగా తోపులాట జరిగింది. అనంతరం ఆశాలు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపి కిరణ్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేయడంతో.. అతన్ని వదిలేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కుభీర్ మండలంలో ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆశా కార్యకర్తలు బస్ స్టేషన్ ఎదుట పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం రూరల్‌లో ఆశా వర్కర్లు దీక్షల శిబిరాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అశ్వారావుపేటలో రాస్తారోకో చేశారు. ఇల్లందులో నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, జిల్లా అధ్యక్షురాలు ఎదలపల్లి సావిత్రి సంఘీభావం తెలిపారు. ఆళ్లపల్లిలో ప్రధాన రహదారిపై బైటాయించారు. ములకలపల్లి, దమ్మపేటలో రాస్తారోకో నిర్వహించారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడు హల్‌చల్

- కబ్జా చేసిన తన భూమిని ఇప్పించాలని డిమాండ్

నవతెలంగాణ-మట్టెవాడ

మంత్రి కేటీఆర్ వరంగల్ పర్యటన సందర్భంగా వరంగల్ తూర్పుకు చెందిన యువకుడు సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. కేటీఆర్ తన వద్దకు వచ్చి న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని ఫేస్‌బుక్‌లో లైవ్ వీడియో ద్వారా పోస్ట్ పెట్టడంతో వార్త ఒక్కసారిగా వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కేటీఆర్ సంక్షేమ పథకాల సభా స్థలికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న సెల్‌టవర్‌పై తూర్పు నియోజకవర్గంలోని 37 డివిజన్‌కి చెందిన కనికుంట్ల తిలక్ తేజ.. పెట్రోల్ బాటిల్‌తో సెల్‌టవర్ ఎక్కి తనకు జరిగిన అన్యాయాన్ని తెలియచేశాడు. తన పేరు మీద రిజిస్టర్ అయి ఉన్న భూమిని తూర్పుకు చెందిన కొందరు బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేయడమే కాకుండా పోలీస్ కేసులుపెట్టి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ తన వద్దకు 30 నిమిషాల్లో రానిపక్షంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని వీడియో ద్వారా తెలియజేశాడు. విషయం తెలుసుకున్న మిల్స్ కాలనీ పోలీసులు టవర్ వద్దకు చేరుకొని న్యాయం జరిగేలా చూస్తామని యువకునికి హామీ ఇవ్వడంతో.. అతను టవర్ దిగి కిందికి వచ్చాడు. దాంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

సంపాదకీయం

ఆ లెక్కలు తేల్చరా..?

కులగణన అంశం తెరపైకి వచ్చిన ప్రతిసారి కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఇది అమలైతే గనుక 'హిందూత్వ' ప్రాజెక్టుకు బ్రేకులు పడతాయి. ఇప్పటివరకు చెప్పుకుంటూ వస్తున్న 'మనమంతా హిందువులం.. పవిత్ర గంగా, సింధు బిందువులం' అనే నినాదం కూడా బహిర్గతమవుతుంది. అందుకే కులగణనకు ససేమిరా

> సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఎన్నో వ్యత్యాసాలున్నాయని తాజా నివేదికలో తేటతెల్లమైంది. ఇప్పుడు అమలు చేస్తున్న విధానాలను మెరుగుపరిచి, పథకాలలో లోపాలను సరిదిద్ది...సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందరికీ అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలది. గణాంకాల ఆధారంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలని అక్కడి మహా కూటమి ప్రభుత్వం నడుం బిగిస్తే... వివరాలు సేకరించొద్దని, వెల్లడించొద్దని, కేంద్రం సేకరించాల్సిన వివరాలు రాష్ట్ర ప్రభుత్వం ఎలా సేకరిస్తుందని, వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని పిటిషనర్లు, కేంద్రం వాదనలు వినిపించడం విడ్డూరం.

అంటోంది. వాస్తవానికి ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం వారి సంక్షేమం చూడటం, సామాజిక న్యాయం అందించడం, అభివృద్ధి సాధించడం బాధ్యత. ఆ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలంటే వాస్తవ పరిస్థితులపై సంపూర్ణమైన అధీకృత సమాచారం కావాలి. కొన్ని వేల యేండ్లుగా మన దేశంలో నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో దిగువ కులాలకూ, ఎగువ కులాలకూ మధ్య తీవ్ర అంతరాలున్నాయి. అవి సమసిపోతే తప్ప అభివృద్ధి అసాధ్యం. కనుక కులగణన ఒక తప్పనిసరి అవసరం. 1931లో బ్రిటీష్ పాలనలో చివరిసారి కులగణన నిర్వహించారు. దేశంలో 1881లో ప్రారంభించారు. రెండు ప్రపంచ యుద్ధ కాలాల్లోనూ కులగణన ఆగలేదు. 2011లో అప్పటి యుపిఎ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కులగణన పేరిట సమాచారం సేకరిం చింది. దాని నిర్దిష్టతలపై సందేహాలున్నాయంటూ ఆ వివరాలను అటకెక్కించింది. దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని కోరుతూ బీహార్ రాష్ట్రానికి చెందిన అఖిలపక్షం ప్రధాని మోడీని 2021లో కోరింది. ఆ రాష్ట్ర బీజేపీ ప్రతినిధి కూడా ఆ బృందంలో ఉన్నా, కేంద్ర సర్కారు మౌనముద్రలోనే ఉండిపోయింది. అనేక సార్లు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలు కావడంతో తామే చొరవ చూపాలని బీహార్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. గత జనవరి, ఏప్రిల్‌లో కులగణనతో పాటు ఆర్థిక స్థితిగతులపై సర్వే నిర్వహించింది. బీహార్‌లో కులగణనను రద్దు చేయాలని కేంద్రంలోని పెద్దల అండదండలతో పాట్నా హైకోర్టు, సుప్రీం కోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలను పాట్నా హైకోర్టు కొట్టివేయగా, సుప్రీంకోర్టు వాటిని ప్రచురించవచ్చని పేర్కొనడంతో వివరాల వెల్లడికి మార్గం సుగమమైంది.



గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేసిన కులగణన వివరాలు అనేక వాస్తవాలను సాక్షాత్కరింపజేశాయి. 13.07 కోట్ల బీహార్ జనాభాలో 63 శాతానికి పైగా ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి), అత్యంత వెనుకబడిన తరగతులు (ఇబిసి) ఉన్నారు. ఒబిసిలు మూడున్నర కోట్లు (27.13 శాతం), ఇబిసిలు 4.70 కోట్లు (36.01 శాతం), 2.6 కోట్ల మంది ఎస్‌సిలు (19.65 శాతం), 22 లక్షల మంది ఎస్‌టిలు (1.68 శాతం) ఉన్నారని గణాంకాలు ధ్రువీకరించాయి. జనరల్ కేటగిరీలో ఉన్న ఇతర కులాలు 15.5 శాతం అని, హిందువులు 81.99 శాతం, ముస్లిములు 17.7 శాతం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, ఇతర మతాల వారు ఒక శాతం లోపేనని నివేదిక తెలిపింది. జనాభాకు సంబంధించిన పూరిస్థాయి గణాంకాలు అందుబాటులో లేకపోవడంతో 1979లో అప్పటి జనతాపార్టీ ప్రభుత్వం నియమించిన మండల్ కమిషన్ నివేదికే ప్రభుత్వాలకు ఆధారంగా ఉంది. ఆ నివేదిక ఒబిసిలు 52 శాతం ఉంటారని అంచనా వేసింది. ఆ శాతం మరింత ఎక్కువగా ఉంటుందన్న పలువురు సామాజిక అధ్యయనవేత్తల అంచనాలు నిజమని తాజా గణాంకాలు నిర్ధారించాయి.

సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఎన్నో వ్యత్యాసాలున్నాయని తాజా నివేదికలో తేటతెల్లమైంది. ఇప్పుడు అమలు చేస్తున్న విధానాలను మెరుగుపరిచి, పథకాలలో లోపాలను సరిదిద్ది... సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందరికీ అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలది. గణాంకాల ఆధారంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలని అక్కడి మహా కూటమి ప్రభుత్వం నడుం బిగిస్తే... వివరాలు సేకరించొద్దని, వెల్లడించొద్దని, కేంద్రం సేకరించాల్సిన వివరాలు రాష్ట్ర ప్రభుత్వం ఎలా సేకరిస్తుందని, వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని పిటిషనర్లు, కేంద్రం వాదనలు వినిపించడం విడ్డూరం. తమ వద్ద వివరాలు లేవని, సేకరించడం తమ బాధ్యతని బీహార్ ప్రభుత్వం చేసిన వాదనలను కోర్టులు సమర్థించడం ముదావహం. కులాల వారీగా జనాభా లెక్కలుంటేనే చిక్కులు, అపోహలు తొలగుతాయి. తాజా గణాంకాలు రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న నిబంధనలను అత్యున్నత న్యాయస్థానం పున:సమీక్షించేందుకు దారితీయవచ్చు. వామపక్షాలు, పలు లౌకిక పార్టీలు కులగణనను స్వాగతిస్తుండగా, బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. జనాభా ఆధారంగా అణగారిన వర్గాలకు సంక్షేమంలో, అభివృద్ధిలో భాగస్వామ్యం లభిస్తే... రాజకీయ సమీకరణాలు మారిపోతాయని, కుల, మత వైషమ్యాలను తిప్పికొడతారని అభివృద్ధి నిరోధకుల భయం. ఇప్పటికైనా జనహితం దృష్ట్యా జనగణనతో పాటు కులగణనను కేంద్రమే చేపట్టాలి. గతంలో కులాల వారీగా జనగణనకు ప్రయత్నించిన తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు ప్రభుత్వాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ కులగణనకు బీహార్ చూపిన మార్గం స్ఫూర్తి కావాలి.

సైన్స్, సమాజాలకు స్వామినాథన్ జీవితం అంకితం

ఇటీవలి కాలంలో, తొంభై ఎనిమిదేండ్ల ఎం.ఎస్.స్వామినాథన్ (ఎం.ఎస్.ఎస్) మరణం వేలాదిమంది సాధారణ ప్రజల దు:ఖానికి దారి తీసింది. వారిలో ఎక్కువ మంది గ్రామీణ భారతదేశంలో వ్యవసాయ పంటలు, పశుపోషణ, మత్స్య సంపద, అటవీ సంపదలో నిమగ్నమై ఉన్న పేదలే. శోకసంద్రంలో మునిగిన పేదలలో మహిళలే అధిక శాతంగా ఉన్నారు. శాస్త్ర, విజ్ఞాన రంగాలకు చెందిన అనేక మంది, విజ్ఞానవంతులైన మధ్యతరగతి వర్గాల ప్రజలు, విధాన నిర్ణేతలు, గ్రామీణాభివృద్ధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, ఇంజనీర్లు లాంటి ఉన్నత విద్యావంతులు, వృత్తి నైపుణ్యం గల వారంతా ఆయన లేని లోటును పూడ్చలేని నష్టంగా భావిస్తున్నారు.

ప్రింట్, టెలివిజన్, డిజిటల్ మీడియాలో ఆయన గురించి చేస్తున్న వ్యాఖ్యానాలు, ఇస్తున్న సమాచారం తక్కువైనప్పటికీ, వ్యవసాయ రంగానికి, ఆహార భద్రతకు ప్రొ.స్వామినాథన్ చేసిన విశేష సేవలను దాదాపు అందరూ ఏకరీతిన ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, పర్యావరణ సుస్థిరత పట్ల ఆయన నిబద్ధత గురించి సరిగ్గా తెలియని కొంతమంది పర్యావరణ ఛాందసవాదుల నుండి సామరస్యత లోటు గురించి కొన్ని సూచనలు ఉన్నాయి, కానీ అవి సాపేక్షంగా చాలా తక్కువగానే ఉన్నాయి.

అనేక క్షేత్రాలలో ఎంఎస్ స్వామినాథన్ విశేషమైన సామర్థ్యాలకు వాస్తవంగా ఇదొక సాక్ష్యం. వాటిలో కొన్నింటిని నేను ఇక్కడ ప్రస్తావిస్తాను. ఆయన తన జ్ఞానానికి మించి గణనీయంగా శాస్త్రీయమైన రచనలు చేయడమే కాకుండా, అలాంటి పనిని విధానాలతో పాటు సాంకేతికతకు కూడా అనుసంధానం చేశాడు. ఆయన శాస్త్ర ఆధారిత వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధిలో అద్భుతమైన కృషి చేసిన సంస్థలను నిర్మించడంలో లేదా నిర్మించడానికి సహాయం చేయడమే కాక, శాస్త్రవేత్తలు, రైతులు ఒక్కచోట చేరి, ఒకరినుంచి ఒకరు నేర్చుకొనడానికి స్థలాన్ని కూడా సమకూర్చినాడు. ఆయన, విధాన నిర్ణేతలు, సామాజిక కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వేతర అట్టడుగు అభివృద్ధి కార్యకర్తలతో ఏం జరుగుతుందో తెలుసుకునే విధంగా నిత్యం సంబంధాలు కలిగి ఉన్నాడు.

> సుస్థిర వ్యవసాయంలో తలెత్తుతున్న సవాళ్ళను సంగ్రహిస్తూ, స్వామినాథన్ 2005లో చేసిన ప్రసంగంలో ఇలా అన్నారు: "హరిత విప్లవం నుండి సతత హరిత విప్లవ మార్పుకు అవసరమైన నమూనా సూత్రాన్ని సాధించడంలోని మన సామర్థ్యం, భూగోళ కవోష్ణత (గ్లోబల్ వార్మింగ్), సముద్ర మట్టం పెరుగుదల సవాళ్ళను ఎదుర్కోవడంలోని మన సామర్థ్యాలు, సేంద్రియ వ్యవసాయం, నూతన జన్యు శాస్త్రాల మధ్య సామరస్యత ఏర్పరచే మన సామర్థ్యంపై ఆధారపడి ఉంటాయి. సరిహద్దు సాంకేతికతలలో నాణ్యమైన వాటిని ఉపయోగించడం ద్వారా, వాటిని పర్యావరణ విజ్ఞానం గల మన ఉన్నతమైన వారసత్వంతో కలపడం ద్వారానే అలాంటి సవాల్‌ను ఎదుర్కొనవచ్చు. సతత హరిత విప్లవం కోసం అవసరమైన పర్యావరణ సాంకేతికతలు, మన భవిష్యత్ వ్యవసాయాన్ని రూపొందించడానికి అవసరమైన మన వ్యూహానికి దిగువ రేఖగా ఉండాలి."

ఒక ప్రపంచ శాస్త్రవేత్త

ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ శాస్త్రాలకు అందించిన సేవలు అనేకం, మీడియాలో ప్రసారమైన నివాళుల ద్వారా బయటకు వచ్చాయి. నేను వాటి లోతుల్లోకి వెళ్ళను. ఆయన పనిలో మరింత విస్తృతంగా తెలుసుకోవాల్సిన అంశాలను నొక్కి వక్కాణించి చెప్తాను. ఆయన సేవలకు భారతదేశంలో వచ్చిన ప్రశంసలను నేను ఇంతకుముందే ప్రస్తావించాను. కానీ ఎం.ఎస్.స్వామినాథన్‌ను ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసించారు.



అంతర్జాతీయ స్థాయిలో హరిత విప్లవంలో ఎంఎస్ స్వామినాథన్‌తో పాటు అత్యంత కీలకమైన వ్యక్తి, శాంతి నోబెల్ బహుమతి విజేత, అమెరికన్ వ్యవసాయ శాస్త్రవేత్త అయిన నార్మన్ బోర్లాగ్ (1914-2009) ఇలా పేర్కొన్నాడు: "హరిత విప్లవం అనేది ఒక జట్టు చేసిన కృషి. దాని అద్భుతమైన అభివృద్ధి ఘనత భారతీయ అధికార్లకు, సంస్థలకు, శాస్త్రవేత్తలకు, రైతులకు దక్కాలి. కానీ మెక్సికన్ మరుగుజ్జుల సంభావ్యత విలువ ముందుగా గుర్తించినందుకు ఆ ఘనత డాక్టర్ స్వామినాథన్‌కే దక్కాలి. ఇదే జరిగి ఉండి ఉండకపోతే, ఆసియాలో హరిత విప్లవం సాధ్యపడి ఉండేడిది కాదు." స్వామినాథన్ ప్రపంచ శాస్త్రవేత్తల సమాజానికి చెందిన వారు అనే విషయాన్ని గుర్తు చేయడానికే ఈ నా వ్యాఖ్యానాన్ని ఉదహరించాను.

ఎం.ఎస్.స్వామినాథన్, భారతదేశంలో, ప్రపంచంలో ఆకలిని నిర్మూలించాలన్న భావావేశానికి కట్టుబడి ఉన్నాడు. ఆయన 2005లో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎం.ఎస్.ఎస్.ఆర్.ఎఫ్)లో చేసిన చక్కటి ప్రసంగంలో పరిశోధనా పరిణామంతో పాటు అందరికీ ఆహారం, అందరికీ పోషకాహార భద్రతా విధానంపై ఒక స్పష్టమైన దృష్టి కోణాన్ని ఏర్పరచాడు. జనాభా పెరుగుదల రేట్లు, ఆహారోత్పత్తి మధ్య సమతుల్యత నిర్వహణలో 1960ల హరిత విప్లవం ఆశాజనకమైన సందేశాన్ని అందించిందని ఆయన అన్నారు. 1960 వ దశాబ్దం మధ్య కాలం నుండి చివరి వరకు శాస్త్ర విజ్ఞానానికి, వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తిస్తూ, భారతదేశంలో శాస్త్రవిజ్ఞానం, సాంకేతికత, ప్రభుత్వ విధానాలకు మధ్య ఉండే సమన్వయానికి హరిత విప్లవం ఒక ఉదాహరణ అని స్వామినాథన్ అన్నాడు. వరిలో హరిత విప్లవానికి చైనా పుట్టినిల్లు అని ఆయన నొక్కి చెప్పాడు. ఆయన, ప్రస్తుత అంతర్జాతీయ క్రమంలో విపరీతమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను గుర్తించినప్పటికీ, ఆయన దఅష్టిలో శాస్త్రవిజ్ఞానం, దాని సామాజిక అన్వయిం పులే ప్రపంచంలో ప్రాథమికమైనవి.



వెంకటేష్ ఆత్రేయ

1968 తొలినాళ్ళలో తక్కువ భూమిలో లేదా తక్కువ ఖర్చుతో, సాధ్యమైనంత ఎక్కువ దిగుబడిని సాధించాలనే లక్ష్యంతో చేసిన వ్యవసాయానికి సంబంధించిన పర్యావరణ ఆందోళనల గురించి స్వామినాథన్ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో తాను చేసిన ప్రసంగంలో హెచ్చరించారు. మూడు దశాబ్దాల క్రితం అంటే 1990లో "సతత హరిత విప్లవం" అనే భావనపై ఆయన ఇలా అన్నాడు: "కొద్దిపాటి సాగు భూమి, వనరులు సరిగాలేని రైతులున్న దేశాలకు, పర్యావరణ లేదా సామాజిక ప్రమాదం లేకుండా శాశ్వతమైన ఉత్పాదక పెరుగుదల అవసరం. హరిత విప్లవం అనేది పర్యావరణ, ఆర్థిక సూత్రాలు మరియు సామాజిక, లింగ సమానత్వ సూత్రాలలో పాతుకుపోయిన సతత హరిత విప్లవంగా మారాలి."

సుస్థిర వ్యవసాయంలో తలెత్తుతున్న సవాళ్ళను సంగ్రహిస్తూ, స్వామినాథన్ 2005లో చేసిన ప్రసంగంలో ఇలా అన్నారు: "హరిత విప్లవం నుండి సతత హరిత విప్లవ మార్పుకు అవసరమైన నమూనా సూత్రాన్ని సాధించడంలోని మన సామర్థ్యం, భూగోళ కవోష్ణత (గ్లోబల్ వార్మింగ్), సముద్ర మట్టం పెరుగుదల సవాళ్ళను ఎదుర్కోవడంలోని మన సామర్థ్యాలు, సేంద్రియ వ్యవసాయం, నూతన జన్యు శాస్త్రాల మధ్య సామరస్యత ఏర్పరచే మన సామర్థ్యంపై ఆధారపడి ఉంటాయి. సరిహద్దు సాంకేతికతల్లో నాణ్యమైన వాటిని ఉపయోగించడం ద్వారా, వాటిని పర్యావరణ విజ్ఞానం గల మన ఉన్నతమైన వారసత్వంతో కలపడం ద్వారానే అలాంటి సవాల్‌ను ఎదుర్కొనవచ్చు. సతత హరిత విప్లవం కోసం అవసరమైన పర్యావరణ సాంకేతికతలు, మన భవిష్యత్ వ్యవసాయాన్ని రూపొందించడానికి అవసరమైన మన వ్యూహానికి దిగువ రేఖగా ఉండాలి."

వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు సంబంధించి, స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటైన 'నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్' చేసిన ముఖ్యమైన సిఫార్సుల చుట్టూ 2005 నుండి ఒక బహిరంగ చర్చ కేంద్రీకృతమై ఉంది. ఐదు వందలకు పైగా వివిధ రైతు సంఘాల భాగస్వామ్యంతో ఏర్పడిన సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వాన నడిచిన చారిత్రాత్మక రైతు ఉద్యమం, స్వామినాథన్ కమిషన్, కనీస మద్దతు ధరపై చేసిన సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేసింది. వారి ప్రధానమైన డిమాండ్లలో కనీస మద్దతు ధర కూడా ఒకటి. నేడు స్వామినాథన్ ఆయన కనీస మద్దతు ధర ఫార్ములాలు, దేశ వ్యాప్తంగా మిలియన్ల రైతుల వద్దకు చేరి, వారి కుటుంబాల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. బలమైన కేంద్ర ప్రభుత్వం మూడు వివాదాస్పద రైతు చట్టాలను రద్దు చేయడం లో రైతుల గొంతులు విజయం సాధించాయి. కానీ ఈ విజయం గొప్పతనం ఇంకా పూర్తిగా ప్రశంసించబడాల్సి ఉంది.

వ్యవసాయ రంగంలో శాస్త్రీయ పురోగతికి, అంతే సమానంగా విధాన నిర్ణయాల్లో స్వామినాథన్ అపారమైన సహాయ సహకారాల్ని అందించాడు. ఆయన ముందుండి నడిపించిన హరిత విప్లవం శాస్త్ర విజ్ఞానంలో పాతుకుపోయింది, అది అలా కొనసాగుతూనేఉండాలి. హరిత విప్లవం, సతత హరిత విప్లవాలకు అవతల, కేవలం ఆహార ధాన్యాల ఉత్పత్తికి మాత్రమే కాక ఆహార భద్రత, పోషకాహార భద్రతకు కూడా స్వామినాథన్ సహకారం అందించాడు. ఓ దశాబ్ద కాలం క్రితం జాతీయ ఆహార భద్రతా చట్టం ఆమోదంలో ఆయన కృషి చాలా కీలకమైనది.

లింగ సమానత్వంపై కేంద్రీకరణ అనేది, స్వామినాథన్ కృషి స్థిరమైన అంశం. ఆయన వ్యక్తిగత లక్షణాలు, విభిన్న సంస్థలు, నిర్మాణాలు, వ్యక్తులతో (కేవలం వ్యవసాయం కోసమే కాక, వ్యవసాయ రంగానికి చెందిన ప్రజల కోసం కూడా) పనిచేసే వీలు కల్పించాయి. చివరగా, రెండు దశాబ్దాల పాటు నేను స్వయంగా పరిశీలించిన స్వామినాథన్ వ్యక్తిగత లక్షణాలు చాలా అసాధారణమైనవి. ఇవి ఆయన విలువైన జీవితానికి ఎంతగానో దోహదపడ్డాయి.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

ఏంటో మరి..!!

ఆరంభం నుంచి అంతం వరకూ
ఒకటే గోల ఒకటే లీల ఒకటే జోల
ఎక్కడెక్కడో చిందరవందరైన
అక్షరాలన్నీ ఏరుకొని
ఒక్కొక్కటి పేర్చడానికే
సరిపోయింది

ఇక శాలవాల తప్పెట్లు
ఊరేగింపుల ఏవగింపులు
అన్నీ మనమే చేయాలి
అన్నీ మనమే రాయాలి
భావాన్ని మనమే మోయాలి
సమస్తం మనమే భరించాలి

ఆహా ఓహోలతోనే
కాలం మొత్తం దొబ్బేసి
ఆకుల్లేని చెట్టుకింద తొంగోవాలి
పదవులన్నీ పద్యాలుగా మలిచి
మన రాగం మనమే తీసుకోవాలి
ఏంటో మరి
అంతా జరిగిపోయినట్టే వుంటది
ఏమీ కదలనట్టే ఆగిపోతాది

గొడవల గొడుగును
మాటిమాటికీ ఎత్తుతూనే
వడగళ్ల దాడిని ఖండించాలి
కడుపు కాలే కథలన్నింటినీ
కంచికి పంపిస్తూనే
కారణం లేని వాక్యాలకు
పురుడు పోసి బ్రతికించాలి
ఏంటో మరి
అంతా వున్నట్టే భ్రమిస్తూ
శూన్యంలో కలిసిపోవాలి

రాజకీయమైనా
ప్రేమాయణమైనా
సవాళ్ల సవారీ చేస్తూనే
చివరి మైలు రాయి వరకు
పరిగెత్తి విశ్రాంతి తీసుకోవాలి
ఏంటో మరి...!!

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

ఎండమావులు

గల్లీలో పెద్ద ఎత్తున టపాకాయలు, డీజే సౌండ్‌లు, బాజాభజంత్రీలు ఇలా అన్ని రకాల హడావుడులు జరుగుతున్నాయి. చాలా సేపటి నుండి ఆ హడావుడిలోకి దూకాలని అన్పిస్తున్నా ఎందుకో ఆగిపోతున్నాడు మోహన్. దానికి కారణం ఉంది. శ్రీమతి ఏమన్నా అంటుందేమోనన్న అనుమానం. కాసేపటికి ఏదైతే అదయిందని హడావుడిలోకి ఎంట్రీ ఇచ్చాడు. కనీసం గంట గడిచింది. అలసిపోయి ఇంట్లోకి వచ్చాడు. శ్రీమతి ఎదురొచ్చి చాయి కప్పు అందించింది.



"కోపగించెకుంటావని అనుకున్నాను కాని కప్పు చాయి తెచ్చిచ్చావు!" అన్నాడు మోహన్ కొద్దిగా ఆశ్చర్యపడుతూ.

కోపమెందుకు? మీరు ఆనందంగా ఉన్నారు కదా! ఇంతకీ ఎందుకా బాజాభజంత్రీలు?' అడిగింది.

"నీ కోసమేనోయ్!" అన్నాడు శోభన్‌బాబులా స్టైల్‌గా

"నా కోసమైతే ఇంట్లోకి రాకుండానే వెళ్ళిపోయారేం?" అన్నది శ్రీమతి.

"నీ కోసం అంటే నీలాంటి ఆడవాళ్ళందరి కోసం!" మా పెద్దాయన పెద్దపని చేశాడు తెలుసా?" అన్నాడు గర్వంగా.

"ఏమిటీ దేశంలోని ఆడవాళ్ళందరికీ మేకిన్ చీర సారే పథకం పెట్టారా?" అన్నది శ్రీమతి ఉత్సాహంగా.

"నీ మొహం! బిచ్చగాడికి వరమిస్తానంటే అడుక్కోవటానికి బంగారు చిప్ప ఇవ్వమన్నాడంట! అట్లా ఉంది నీ వ్యవహారం!" విసుగ్గా అన్నాడు.

"మరి ఏ చిప్ప ఇస్తున్నారో తెలిసేలా చెప్పొచ్చు గదా?" అంది శ్రీమతి.

"నారీ శక్తి వందన్ అధినియం!" అన్నాడు.

"ఏమిటో అది పేరే అర్థం కావటం లేదు!" అన్నది శ్రీమతి గందరగోళంగా.

"అది చట్టం పేరు! మహిళలందరికీ చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కొత్త పార్లమెంటులో చేసిన చారిత్రాత్మక చట్టం!" గర్వంగా చెప్పాడు.

"ఏమండీ! ఈసారి నేను ఎంపీగా పోటీ చేస్తాను. ఆ తర్వాత మంత్రినవుతాను!" అన్నది శ్రీమతి ఉత్సాహంగా.

మోహన్ పగలబడి నవ్వాడు కాసేపటికి నవ్వాపుకుని ఈసారి నీవు ఎంపీ కాలేవు. మంత్రివి అంతకన్నా కాలేవు!" అన్నాడు.

"చూశారా! మీ పెద్దాయన చేసిన చట్టానికి మీరే అడ్డుపడుతున్నారు!" అన్నది శ్రీమతి.

నేను అడ్డుపడటం కాదు! చట్టం 2029లో అమలులోకి వస్తుంది అప్పటి దాకా ఇప్పుడున్నట్లే!" అన్నాడు.

"అలూ లేదు! కొడుకు పేరు సోమలింగం! అన్నమాట" అన్నది శ్రీమతి.

శ్రీమతి వంక అనుమానంగా చూశాడు మోహన్.

"నాకు తెలుసు! మీరు ఏమనుకుంటున్నారో! నేను కాంగ్రెస్‌లోనే, కమ్యూనిస్టు పార్టీలోనో చేరానని అందామనుంటున్నారు! అంతేగా!" అన్నది శ్రీమతి.

"ఖచ్చితంగా అంతే! ఏ మంచి పని చేసినా రంధ్రాన్వేషణ చేయగల సమర్థులు వారే!" అన్నాడు మోహన్ ఏద్దేవాగా.

ఈసారి శ్రీమతి పగలబడి పవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావు?" ఉడుక్కుంటూ అన్నాడు.

మీరు రంధ్రాన్వేషణ గురించి మాట్లాడుతుంటే నవ్వురాక మరేం వస్తుంది! మనకన్నా రెండు తరాల ముందు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న గాంధీ, నెహ్రూలు తప్పులు చేశారంటూ నిరంతరం వల్లెవేసే మీరు రంధ్రాన్వేషణ గురించి మాట్లాడుతారా? అన్నది శ్రీమతి నవ్వుతూనే.

"అంటే వారు తప్పులు చేయలేదా.. చేసిన తప్పులు చెప్పకూడదా?" అడిగాడు.

"ఆ చర్చ ఎందుకు గాని ఈ చట్టం పదేళ్ళ కిందటే మీరు ఎందుకు చేయలేదు" ప్రశ్నించింది శ్రీమతి.

"ఇప్పుడు చేశాము కదా!" అన్నాడు.

"ఇప్పుడు చట్టం చేసి పదిహేనేళ్ళ తర్వాత అమలు చేస్తారా? ఏ ప్రభుత్వ మైనా ఇలాంటి చట్టం చేసిందా? అడిగింది శ్రీమతి.

"దానికి చాలా ఇబ్బందులు ఉన్నాయి! అవన్నీ పరిష్కరించాలి. నియోజకవర్గాల విభ జన చేయాలి. మహిళా నియోజక వర్గాలు గుర్తించాలి. ఇలాంటివి పూర్తి చేయాలంటే సమయం కావాలి!" అన్నాడు గంభీరంగా.

"ఓహో! మీకు నచ్చినవైతే గంటల్లో చట్టాలు చేసి రోజుల్లో అమలులోకి వచ్చేలా చట్టాలు చేస్తారు! కాని మహిళా రిజర్వేషన్లు మాత్రం దశాబ్దాల తర్వాత అమలులోకి వచ్చేలా చేస్తారు! అంతే కదా!" అన్నది శ్రీమతి.

"అంత హడావుడిగా ఏ చట్టము చేయలేదు" అన్నాడు బింకంగా.

"370 ఆర్టికల్ రద్దు, మోటారు వాహనాల చట్ట సవరణ, నూతన విద్యాచట్టం, కార్మిక చట్టాల సవరణ, అటవీ భూముల చట్టం, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ కోసం చట్టాలు ఇలా ఎన్నో చేశారు. అవన్నీ తక్షణమే అమలులోకి వచ్చేలా చేశారు కదా"! అన్నది శ్రీమతి.

"అంటే నీవు చట్టాన్ని వ్యతిరేకిస్తున్నావా? మహిళవై ఉండి, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నావా?" అన్నాడు.

"మీకంతే అర్థం అవుతుంది! ఈ చట్టంలో ఉన్న లోపాల గురించి చెబుతున్నాను!" అన్నది శ్రీమతి.

"చట్టంలో లోపాలా? చేసింది ఎవరనుకున్నావు" అన్నాడు.

"ఎవరు చేశారో తెలుసు గనకే ఈ సమస్యలు వస్తున్నాయి. [illegible] స్వాతంత్ర్యమూర్తి అన్నవారే చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ల గురించి చట్టం చేస్తే ఎలా నమ్మాలి? కొత్త పార్లమెంటు ప్రారంభోత్సవానికి అత్యున్నత స్థాయి అధికారం గల మహిళను పిలవకపోతే ఎలా నమ్మాలి?" ప్రశ్నించింది శ్రీమతి.

"మహిళల పట్ల మా చిత్తశుద్ధిని నమ్మాలి!" అన్నాడు.

"మనుస్మృతిని రద్దు చేసినమని ప్రకటించి, ఆ తర్వాత ఈ చట్టం చేసి ఉంటే మీ చిత్తశుద్ధిని నమ్మేవాళ్ళం! పార్లమెంటులో అన్ని పార్టీల వారు కోరినట్లు ఓబీసీ రిజర్వేషన్లు ఈ చట్టంలో పొందుపర్చి ఉంటే, మీ చిత్తశుద్ధిని నమ్మేవాళ్లం. దేశంలో మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలను గౌరవించి ఉంటే, మత కల్లోహాలు జరుగుతున్నప్పుడు మహిళల గర్భాలు చీల్చకుండా ఉంటే మీ చిత్తశుద్ధి నమ్మేవాళ్ళం. గత పదేళ్ళుగా పసిపిల్లలపై గుళ్ళలో అత్యాచారాలు జరుగుతుంటే నీరెత్తని మీరు చిత్తశుద్ధి గురించి మాట్లాడుతారా?" అన్నది శ్రీమతి.

"అంటే చట్టాన్ని గుర్తించరా?" అడిగారు.

"గుర్తించాం! ఆ చట్టం ఎండమావి!"

- ఉషాకిరణ్

ఆయన ఇల్లే ఓ విప్లవ కేంద్రం



ఎం. రాములు
9490098338

వెలిదండ అంటే విప్లవ ఉద్యమాలకు పూదండ. అది నాటికి, నేటికి వామపక్షాల ఉద్యమాల ఖిల్లా. ఆ దండలో దారంలా ఉద్భవించిన విప్లవయోధుడు కామ్రేడ్ మేదరమెట్ల సీతారామయ్య. ఆయన జీవితం విప్లవ రాజకీయాలతో పెనవేసుకొని కమ్యూనిస్టు ఉద్యమంలో అలుపెరగని పోరాట యోధుడిగానే కాదు, వ్యక్తిగా తనదైన పాత్రను పోషించిన శక్తి. ఉమ్మడి నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకా వెలిదండ గ్రామంలో 1924లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన బాల్యం నుండే పోరాట మార్గాన్ని ఎంచుకున్నాడు. కమ్యూనిస్టు ఉద్యమంలో ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ప్రజలతో మమేకమవుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడిగా, సీపీఐ(ఎం) హుజూర్‌నగర్, కోదాడ ఉమ్మడి తాలూకా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉద్యమానికి ఓ చుక్కానిలా పనిచేశారు. గ్రామ సర్పంచ్‌గా, సింగిల్‌విండో చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఎమ్మెల్యేగానూ పోటీ చేశారు.

తెలంగాణలో ప్రజావ్యతిరేకమైన ఫ్యూడల్ వ్యవస్థను కాపాడటానికి కంకణం కట్టుకున్న నిజాం సైన్యాలను, నెహ్రూ సైన్యాలను ఎదిరించిన నాయకుడు. పీడిత ప్రజల విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన సాయుధ రైతాంగ పోరాటం మహా ఉద్యమంలో పాల్గన్న వేలాదిమంది ఉద్యమకారుల్లో సీతారామయ్య ఒకరు. విప్లవం కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించే సాహసం, ప్రజల కోసం పని చేయడం అత్యున్నత కర్తవ్యమనే విశ్వాసం చాలా గొప్పవి. ఆటుపోట్లు ఎన్ని వచ్చినా వెనుతిరగక ప్రజా ఉద్యమాల్లో ప్రజల పక్షాన కొనసాగే చైతన్యం మొదలైన ఉత్తమ లక్షణాలు కలిగిన వ్యక్తిగా పోరాట రంగం ఆయన్ను తీర్చిదిద్దింది. ఇదే కామ్రేడ్ సీతారామయ్యకు ఉన్న ప్రత్యేకత. 15 ఏండ్ల వయసు నుండే పాటలు పాడడం, నాటికలు వేయడం, రామాయణం, భారతం, భాగవతం చదివేవారు. నాటకాల్లో అనేక పాత్రలు పోషించేవారు. ఈ విధంగా గ్రామాల్లో తన తోటి యువకులను సమీకరించి నాటకాలు, వీధి బాగోతాలు వేస్తూండేవారు. తన 18వ యేటలోనే వెలిదండ గ్రామంలో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా నిలబడ్డాడు.



> అనేక గ్రామాల్లో ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ ప్రభుత్వ, బంచరాయి, పోరంబోకు భూములను పేదలకు పంపిణీ చేశారు. లింగగిరిలో కౌలుదారీ హక్కుల కోసం జరిగిన పోరాటంలో, అగ్రహారంలో జరిగిన భూ పోరాటంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఆయన త్యాగనిరతి, ధైర్య సాహసం, కార్యదీక్ష, వాగ్దాటి నేటికి ప్రజల మదిలో స్ఫురిస్తూనే ఉంది. మార్క్సిస్టు సిద్ధాంత అధ్యయనం, పోరాట అనుభవం, నిర్మాణ దక్షత కలబోసుకున్న విప్లవవీరుడు సీతారామయ్య

నిజాం సంస్థానంలో కొంత భాగం జాగీర్దారీ పాలన కింద ఉండేది. మరి కొంత భాగం పటేల్, పట్వారీ వ్యవస్థ ద్వారా డైరెక్టుగా నిజాం పాలన కింద ఉండేది. గ్రామాలన్నీ భూస్వామ్య పెత్తందారుల ప్రాబల్యం కిందనే ఉండేది. వెలిదండ గ్రామంలో కూడా నాడు పటేలు, పట్వారీ పాలన కొనసాగుతుండేది. వెలిదండ గ్రామానికి పక్కనే బేతవోలు జమీందారీ గ్రామాలు, మరో పక్క బ్రిటీష్ పాలన కింద ఉన్న మునగాల జమీందారీ గ్రామాలు ఉండేవి. జమీందారీ, జాగీర్దారీ గ్రామాల్లో సాధారణంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులతో పాటు వారి సొంత అవసరాల కోసం కూడా నిర్బంధపు పన్నులు ప్రజలు చెల్లించేవారు. పటేల్, పట్వారీ, జమీందారీ, జాగీర్దార్‌లు ప్రజలపై దౌర్జన్యాలు చేసేవారు. ఈ స్థితిలో వెలిదండ గ్రామంలో కూడా పటేలు, పట్వారీలు వెట్టిచాకిరీ, దోపిడీ, దౌర్జన్యాలు సాగుతూ ఉండేవి. ఆ గ్రామంలో రైతుల భూములను అక్రమంగా ఆక్రమించుకోవడం, ప్రజలకు భూతగాదాలు పెట్టి కేసుల్లో ఇరికించడం, అప్పులిచ్చి హెచ్చు వడ్డీ రేట్లు గుంజటం, పేదల భూములను తాకట్టు పెట్టుకోవడం, భూమి శిస్తులను అధికంగా విధించడం, జరిమానాలు విధించడం, కట్టకపోతే ఇండ్లను జప్తు చేసేవారు.

ఈ తరుణంలో గ్రామంలో ఆంధ్రమహాసభ కార్యకలాపాలను చాపకింద నీరులా వ్యాపింప చేశారు సీతారామయ్య. గ్రామంలోని పటేల్, పట్వారీ ఆగడాలకు వ్యతిరేకంగా ఆయన ప్రతిఘటించేవాడు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు పాడుతున్నాడని సీతారామయ్యపై పోలీసులకు రిపోర్టు ఇచ్చారు. గ్రామానికి వచ్చిన పోలీసులు ఆయనతో పాటు కొంతమంది యువకులను అరెస్టు చేసి కోదాడ, సూర్యాపేటకు తరలించి, ఆ తర్వాత హైదరాబాద్ జైలులో నిర్బంధించారు. వీరిపై కేసు ఏమిటో తెలియదు, విచారణ జరగలే.. ఆ విధంగా తొమ్మిది నెలలు నిర్బంధించారు. సీతారామయ్య రిమాండ్‌లో ఉన్న యువకు లందరికి కమ్యూనిస్టు పార్టీ నాయకులు, రాజకీయాల గురించి చెప్పేవారు. జైలు జీవితాన్ని అనుభవిస్తూనే మార్క్సిజం, రష్యా విప్లవం, సోషలిస్టు రాజ్యాంగం గురించి అధ్యయనం చేశారు. ఆయన జైలునుంచి వచ్చేసరి మునగాల పరగణ గ్రామమైన కొక్కిరేణిలో కమ్యూ నిస్టు పార్టీ సెంటర్ ఏర్పాటు చేసి నడుపు తున్నారు. పరగణా గ్రామాలు కాబట్టి అక్కడ కమ్యూనిస్టు పార్టీపై నిషేధం లేదు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రమహాసభ కోసం పనిచేశాడు. ఆ తర్వాత గ్రామాల్లో సాగుతున్న అరాచాకాలపై ఉద్యమాలు నిర్మించి ప్రజల కోసం పోరాడాడు.

హుజూర్‌నగర్ తాలూకాలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఉద్యమాన్ని నిర్మించడంలో అనేక నిర్బంధాలను అధిగమించి ఉద్యమ పురోగతికి కృషి చేశాడు. కాంగ్రెస్ గుండాల ఆగడాలను, హత్యా రాజకీయాలను ఎదుర్కొంటూనే కార్యకర్తలకు రక్షణ కల్పిస్తూ తన ఇల్లునే విప్లవ కేంద్రంగా మార్చాడు. ఈయన చేసే పోరాటంలో కుటుంబం పైకి ఎన్ని ఒత్తిళ్ళ వచ్చినా తట్టుకున్నారు. నిర్బందాలను ఎదుర్కొన్నారు. అనేక గ్రామాల్లో ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ ప్రభుత్వ, బంచరాయి, పోరంబోకు భూములను పేదలకు పంపిణీ చేశారు. లింగగిరిలో కౌలుదారీ హక్కుల కోసం జరిగిన పోరాటంలో, అగ్రహారంలో జరిగిన భూ పోరాటంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఆయన త్యాగనిరతి, ధైర్య సాహసం, కార్యదీక్ష, వాగ్దాటి నేటికి ప్రజల మదిలో స్ఫురిస్తూనే ఉంది. మార్క్సిస్టు సిద్ధాంత అధ్యయనం, పోరాట అనుభవం, నిర్మాణ దక్షత కలబోసుకున్న విప్లవవీరుడు సీతా రామయ్య. ప్రజల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన ఆయన 1997 అక్టోబరు 10న అనారోగ్యంతో చనిపోయారు. నేడు ఆ విప్లవయోధుని 26వ వర్ధంతి సందర్భంగా ఆయన ఆశయ సాధనకు పునరంకితమవ్వాలని ఆశిస్తూ... విప్లవజోహార్లు.

5
నవతెలంగాణ
కరీంనగర్
శనివారం | అక్టోబర్ 07, 2023 | www.navatelangana.com

ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ కౌశిక్ రెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట మండలంలోని సైదాబాద్ గ్రామంలో నిరుపేదలకు లాటరీ పద్ధతి ద్వారా ఇండ్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 20 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, ఎనిమిది సంవత్సరాలు మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ సమస్యను పరిష్కరించలేకపోయాడని విమర్శించారు. ఎమ్మెల్సీగా వచ్చిన సంవత్సరంలోనే మీ అందరికీ ఇండ్ల పట్టాలు అందజేసినట్టు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సైదాబాద్ ప్రజలందరూ ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సైదాబాద్ గ్రామ సర్పంచ్ పుప్పాల శైలజరాజారాం, జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, తహసీల్దార్ రజనీరెడ్డి పాల్గొన్నారు.

1 నుంచి పదోతరగతి విద్యార్థులకు
అల్పాహారం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

-మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ-కరీంనగర్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా రూరల్ మండలంలోని మొగ్దుంపూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లతో కలిసి సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. మొదటగా పిల్లలతో ముచ్చటించిన మంత్రి అనంతరం వారికి ఇడ్లి, వడ, ఉప్మా, బోండా, రెండు రకాల చట్నీలను అందించి వారితో సహపంక్తి అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల ద్వారా చదువుపై ఏకాగ్రతను పెంచే బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించే దిశగా సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకం ద్వారా సోమవారం నుంచి శనివారం వరకు, రోజువారిగా ఫైవ్ స్టార్ మెనూ కూడా సిద్ధం చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడానికి ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినట్టు చెప్పారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం సన్నబియ్యంతో భోజనాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతీకరించేలా మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని, విదేశీ విద్య కోసం అంబేద్కర్ ఓవర్సిస్ పథకాన్ని ప్రవేశపెట్టి 20 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జిల్లాలోని మొగ్దుంపూర్, వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాలలను రానున్న రోజులలో వ్యవసాయ యూనివర్సిటీలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో బురదమయంగా ఉండే గ్రామంలో పక్కారోడ్లను వేయడం జరిగిందని, అదే విధంగా గ్రామానికి పల్లె దవాఖానాను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలను తెలియజేసి, 798 మహిళకు బతుకమ్మ చీరలను, యువతకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ లను అందజేశారు. మొగ్దుంపూర్ గ్రామం నుంచి కానిస్టేబుల్‌గా ఎంపికైనా 9 మందిని మంత్రి శాలువాతో సత్కరించి వారిని అభినందించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి మాట్లాడుతూ..మొదటగా జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలలో ప్రతి నియోజక వర్గానికి ఒక పాఠశాల చొప్పున జెడ్పీహెచ్ఎస్ మొగ్దంపూర్, హుజురాబాద్, గంగాధర (బాలుర), మానకొండూర్ (బాలికల) పాఠశాలలో పథకాన్ని ప్రారంభిస్తామని, దసరా సెలవుల తర్వాత అన్ని పాఠశాలల్లో పథకం ప్రవేశపెడతామని తెలిపారు. పథకానికి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేలా ప్రతి మండలానికో ప్రత్యేకాధికారిని నియమించి కచ్చితమైన క్వాలిటి భోజనం అందిస్తామతని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ ఆర్డీఓ కే.మహేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఫ్యాక్స్ చైర్మెన్ శ్యాం సుందర్ రెడ్డి, తహసీల్దార్ నవీన్, ఎంపీడీఓ దివ్యదర్శన్, ఎంపీటీసీ పుష్ప, సర్పంచ్ జక్కని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



అల్పాహారం అందిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

మీడియాపై ఆంక్షలు హేయమైన చర్య

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్

- కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ - కరీంనగర్ : మీడియాపై ఆంక్షలు విధించడం హేయమైన చర్య అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. పత్రిక స్వేచ్ఛపై కేంద్రం చేసిన దాడిని ఖండిస్తూ శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా నగరంలోని స్థానిక తెలంగాణ చౌరస్తా వద్ద కళ్లకు గంతలు కట్టుకొని కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడారు. మీడియా వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్, కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్, జిల్లా సహాయ కార్యదర్శి వినయ్, నగర నాయకులు ఇషక్, సందేశ్, కేశవ్, శివ, కుమార్, సాయి పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీ కుటుంబానికి చెక్కు అందజేత

నవతెలంగాణ - కరీంనగర్ : జాతీయ సమైక్యత దినోత్సవం పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ అయిన తర్వాత విధులు నిర్వహించి ఇంటికి వెళ్లే క్రమంలో గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి పంచాయతీ సెక్రెటరీ రవీందర్ చొప్పదండిలో రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆ నిరుపేద కుటుంబానికి, ఇద్దరు పిల్లలకు మనోధైర్యాన్ని ఇవ్వాల్సిన ఆవశ్యకత చాలా ఉందని తలచి టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సదుద్దేశంతో టీఎన్జీవోల సంఘం నాయకుల నుంచి, ఉద్యోగుల నుంచి లక్ష 40 వేల నగదును గూగుల్ పే, ఫోన్ పే ద్వారా సేకరించారు. సేకరించిన నగదును మరణించిన పంచాయతీ సెక్రెటరీ రవీందర్ భార్య కనుమల్ల సుమలతకి జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ డాక్టర్ బి.గోపి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీఎన్జీవోల సంఘాన్ని, ఉద్యోగులను అభినంచారు. బాధిత కుటుంబానికి అతి తొందరగా కారుణ్య నియామకం పద్ధతిలో అర్హులైన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహా స్వామి, జిల్లా ఉపాధ్యక్షురాలు శారద, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, జిల్లా సంయుక్త కార్యదర్శి రాజేశ్వరరావు, పట్టణ బాధ్యులు సుమంత్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి, పంచాయతీ కార్యదర్శి గౌరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న కలెక్టర్ గోపి

అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగుపై క్షేత్ర ప్రదర్శన

నవతెలంగాణ - సైదాపూర్



మండలంలో కేంద్ర ప్రత్తి పరిశోధన సంస్థ (సిఐసిఆర్ - సెంట్రల్ ఇన్ స్టూట్ ఫర్ కాటన్ రీసెర్చ్) (కె వి కె - కృషి విజ్ఞాన కేంద్రం) జమ్మికుంట వారి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్న పత్తి పంటను శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శంకర్ నారాయణ, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ శంకర్ గణేష్, డాక్టర్ మనివన్నన్ (సిఐసిఆర్), డాక్టర్ జి.వీరన్న, పత్తి పంట ప్రధాన శాస్త్రవేత్త (ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం), కృషివిజ్ఞాన కేంద్రం జమ్మికుంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్‌రావు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి, విజయ్, ఏఈఓ నిఖిల్ కుమార్, రాశి కంపెనీ సీడ్స్ జిల్లా ప్రతినిధి వెంకటరెడ్డి, మనోజ్, ఫీల్డ్ అధికారులు రాజేష్, హరీష్ పాల్గొన్నారు.

ఒద్యారంలో గ్రామస్తుల వినూత్న నిరసన



నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలం ఒద్యారం గ్రామాన్ని కొత్తపల్లి మండలంలో కలుపాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్ష రెండవ రోజుకు చేరింది. మండల మార్పు పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో కూర్చున్న గ్రామస్తులు శుక్రవారం ముఖానికి నల్ల గుడ్డలు కట్టుకుని వినూత్నంగా నిరసన చేపట్టారు. నిరసనలో మాజీ సర్పంచ్ కూనబోయిన సత్తయ్య, విద్యాసాగర్‌రావు, కొమురయ్యతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

పీవీ జిల్లా ఏర్పాటు చేయాలని ర్యాలీ



నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ కేంద్రంగా పివి జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం హుజురాబాద్ పట్టణంలో పివి జిల్లా సాధన సమితి జేఏసీ ఆధ్వర్యంలో వాకర్స్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు సామాజిక సహాయకర్త వర్ధినేని రవీందర్‌రావు, జేఏసీ నాయకులు బండ శ్రీనివాస్, ఈశ్వర్‌రెడ్డి, ముక్కెర రాజు, వేల్పుల రత్నం, చందుపట్ల జనార్ధన్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, పాక సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మానవహార ప్రదర్శన

హుజురాబాద్ కేంద్రంగా పివి జిల్లా ఏర్పాటు కోసం ఈ నెల 7న పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాలు సాధన సమితి జేఏసీ ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేస్తున్నట్లు పివి జిల్లా సాధన సమితి జేఏసీ నాయకుడు, సామాజిక సహాయకర్త వర్ధినేని రవీందర్‌రావు తెలిపారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ లో జేఏసీ ఆధ్వర్యంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛందంగా మానవహారం విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌ఓను పరామర్శించిన మంత్రి గంగుల

నవతెలంగాణ - కరీంనగర్



మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్‌లో తన వ్యక్తిగత కార్యాలయ ప్రజా సంబంధాల అధికారి అనంతుల రమేష్ గాయపడగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి, పూర్తిగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పీఆర్వో రమేష్ మాట్లాడుతూ.. మంత్రికి ప్రజలపై ఉండే ప్రేమను ఆయన వెనకాల ఉండి ప్రతిరోజు చూస్తానని, ఈరోజు స్వయంగా అనుభూతి చెందానన్నారు. ఆయనవెంట మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కార్పొరేటర్లు కుర్ర తిరుపతి, ఎడ్ల సరిత అశోక్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వొడితల ప్రణవ్..

ఆందోళనలో కుటుంబం
మారిన హుజురాబాద్ రాజకీయం..
కాంగ్రెస్‌లో జోష్ పెరిగేనా

నవతెలంగాణ - హుజురాబాద్/జమ్మికుంట



మాజీ ఎంపీ రాజేశ్వరరావు మనవడు వొడితల ప్రణవ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని కాంగ్రెస్‌లో చేరారు. కుటుంబంలో సైతం ఎవ్వరికీ తెలియకుండా కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని వొడితల కుటుంబ సభ్యులు ఒక్కసారి అవాక్కైనట్లు తెలుస్తోంది. దీంతో వెంటనే ప్రణవ్‌తో మాట్లాడి వెనుకకు రప్పించేందుకు కూడా ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. అందుకు ససేమిరా అన్నట్లు కూడా తెలుస్తోంది. పీవీ.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాలలో అన్ని తానై ఢిల్లీలో రాజేశ్వర్‌రావు రాజకీయాలు చేశారు. అలాంటి కుటుంబ నేపథ్యం ఉన్నటువంటి వ్యక్తి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ జోష్ పెరిగేనా అని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. అందులో హుజురాబాద్ శాసనసభ టికెట్ హామీ ఇచ్చాకే పార్టీలో చేరినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ఆవిర్భావం నుండి రాజేశ్వర్‌రావు సోదరుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఆ పార్టీలో కీలకంగా పనిచేశారు. లక్ష్మీకాంతరావుకు ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాజ్యసభ సభ్యునిగా పార్టీ అవకాశం కల్పించింది. హుస్నాబాద్‌లో ఆయన కుమారుడు సతీష్ బాబుకు ఎమ్మెల్యేగా రెండుసార్లు టికెట్ ఇచ్చి గెలిపించారు. అదే కుటుంబంలో నుండి ప్రణవ్ కాంగ్రెస్‌లో చేరడంతో, అసలు ఆ కుటుంబంలో కుటుంబ బేదాలు వచ్చాయా అని చర్చ జరుగుతుంది. సతీష్ బాబు ఎమ్మెల్యేగా ఉన్నాడు కాబట్టి ఆ కుటుంబం నుండి మరొకరికి అవకాశం రాదు అనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సమాచారం. రెండు నెలల క్రితం హుజురాబాద్‌లో ప్రణవ్ తాత సింగపూర్ రాజేశ్వరరావు విగ్రహాన్ని ప్రతిష్ఠించగా మంత్రి హరీశ్‌రావు హాజరై ఆవిష్కరించారు. ప్రణవ్ జన సమీకరణ కూడా చేశారు. ఈ సందర్భంగా ప్రణవ్‌కు రాజకీయ భవిష్యత్తు ఉందని యాక్టివ్‌గా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ తరపున హుజురాబాద్ టికెట్టు ఆశించారు. కానీ మొదటి విడత లోనే పాడి కౌశిక్‌రెడ్డికి టికెట్ అనౌన్స్ చేయడంతో, ఇక పార్టీలో తనకు సముచిత స్థానం దొరకదేమోనని భావించి పార్టీ మారినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ కూడా హుజురాబాద్‌లో అంగ, అర్థబలం ఉన్నటువంటి వ్యక్తి అయితేనే బాగుంటుందని భావించి పార్టీలో చేర్చుకున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా హుజురాబాద్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

వందరోజుల్లో గ్యారెంటీ కార్డు అమలు

-60లక్షల మంది మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం

-కాంగ్రెస్ మ్యానుపెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ - కరీంనగర్



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే గ్యారెంటీ కార్డులో ప్రకటించిన 6 హామీలతో పాటు డిక్లరేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ మ్యానుపెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేది కాంగ్రెస్ పార్టీనేని, గ్యారెంటీ కార్డులతో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. మహలక్ష్మి పథకంతో పాటు ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ,ప్రతి మహిళకు రూ.2500 నగదు, రూ.500లకే గ్యాస్, అందిస్తామన్నారు. 2లక్షల రైతు పంట రుణమాఫి పెట్టుబడికింద ఏటా 15వేలు అందించడంతో పాటు రైతు కూలీలకు రూ.12వందల చొప్పను చెల్లిస్తామన్నారు. నిరుద్యోగయువతకు పై చదువులోకోసం రూ.5లక్షల విద్యాభరోసా ఏటీఎం కార్డు అందిస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికి ఆరోగ్య శ్రీపథకం ద్వారా రూ.10లక్షల వైద్యం అందించడంతో పాటు విద్య వైద్యానికి పెద్దపీట వేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల సూపర్ స్పెషాలటీ అసుపత్రులను ఏర్పాటు చేసి మెరుగైన వైద్యాన్ని అందిస్తామన్నారు. రేషన్‌కార్డుపై తెలంగాణ ప్రభుత్వం రేషన్‌బియ్యనికి పరిమితమైందని, కాంగ్రెస్ హయాంలో 9రకాల నిత్యవసర సరుకులు అందించామని అదే తరహాలో ప్రజలకు సరుకులు అందిస్తామని తెలిపారు. వరిరైతులకు బోనస్‌గా రూ.5వందలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వారితో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ క్లిష్టఫర్ , జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మేడిపల్లి సత్యం, కొత్తజయపాల్‌రెడ్డి, పురమల్ల శ్రీనివాస్, కర్ర సత్యప్రసన్నరెడ్డి , రవళిరెడ్డి, కే. పద్మకర్‌రెడ్డి, వైద్యుల అంజనీకుమార్ ,తాజుద్దీన్, సమద్‌నవాబ్ , కమ్రుద్దీన్ మల్యాల సుజీత్‌కుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిటిసికి వినతి



నవతెలంగాణ - తిమ్మాపూర్ : తెలంగాణ సేవా టాక్సీ ఆల్ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ డిటిసి చంద్రశేఖర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. డ్రైవర్లకు ఐదు లక్షల ప్రమాద బీమా కార్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మి, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రజనీ దేవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె సుధాకర్, కరీంనగర్ జిల్లా గౌరవ సలహాదారులు దాసరి దశరథం, జిల్లా ప్రెసిడెంట్ నజీర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన వారికి సన్మానం



నవతెలంగాణ - కొత్తపల్లి : పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో కొత్తపల్లి పట్టణానికి చెందిన భోగ సుస్మిత, నాయిని సౌమ్య, బండారి నాగేంద్ర ఉద్యోగాలు సాధించారు. వారిని శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు అభినందించి శాలువాలతో సన్మానించారు. కౌన్సిలర్ చింతల సత్యనారాయణరెడ్డి, బండారి వెంకటేష్, నాయని దేవదాస్, భోగ రమేష్, అలువల సత్యనారాయణ పాల్గొన్నారు.

కరీంనగర్‌లో అట్టహాసంగా హర్ ఘర్ కో నేతాజీ..

నవతెలంగాణ కరీంనగర్ : ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు కరీంనగర్‌లో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కరీంనగర్ నియోజకవర్గం అభ్యర్థి అంబటి జోజిరెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ కో నేతాజీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సుభాష్ నగర్ వద్ద సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పెద్ద ఎత్తున తెలంగాణ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో 1500 మంది పాల్గొన్నారు. ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి హాజరై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కమిటీ నిర్ణయం మేరకు ఇంటింటికి నేతాజీ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రారంభించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికి వెళ్లి వివరిస్తామని చెప్పారు. సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన కోసం ప్రజలందరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఫలాలు అందరికీ అందడం లేదని కొద్దిమందికే పరిమితం అవుతున్నాయి అన్నారు. అవినీతి రహిత పాలనే లక్ష్యంగా పార్టీ ముందుకు వెళుతుందన్నారు. కరీంనగర్ నుండి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి తేజప్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బండారి శేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గవ్వ వంశీధర్‌రెడ్డి, చొప్పదండి అసెంబ్లీ అభ్యర్థి ముత్యాల విజయ్ కుమార్, పెద్దెల్లి శేఖర్, పులమాటి సంతోష్, అతికం రాజశేఖర్‌గౌడ్, బెక్కంటి రమేష్, గొల్లపల్లి ప్రశాంత్, బద్రి నేత పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ధాన్యం ఎగుమతులు

జిల్లా రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్సింగరావు

నవతెలంగాణ - కరీంనగర్ :



రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకే జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ధాన్యం రవాణా చేస్తున్నట్లు రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి నర్సింగరావు స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొంతమంది కావాలని తమపై ధాన్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంఆర్‌తో పాటు రైస్ మిల్లర్లు కూడా ధాన్యం కొనుగోలు చేస్తారని గమనించాలన్నారు. తాము కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆన్ సీజన్‌లో రైస్ మిల్లులపై ఆధారపడ్డ కూలీలకు జీవనాధారం కల్పించేందుకు మరాడించి ఎగుమతి చేస్తామన్నారు. వాస్తవానికి ప్రభుత్వానికి ఇప్పటికే 50 శాతం వరకు సీఎంఆర్ అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, నాయకుడు బోయినపల్లి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

యశోద ఆస్పత్రిలో అరుదైన చికిత్స

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న వైద్యుడు

సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. శుక్రవారం నగరంలోని యశోద ఆస్పత్రి సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరో సర్జన్లు డాక్టర్ కేఎస్ కిరణ్, డాక్టర్ బిజే రాజేశ్, డాక్టర్ విశ్వనాథ్ వివరించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రానికి చెందిన విజయ రెండు నెలలుగా తరచు తలనొప్పి వస్తుండేది, ఇటీవల ఆమె ఒక్కసారిగా కింద పడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు ఆమెకు సీటీ యాంజియో స్కాన్ పరీక్ష నిర్వహించగా, ఆమె మెదడులో ఎంసీఏ అన్యూరిజం (రక్తనాళానికి సంబంధించిన)తో బాధపడుతున్నట్లుగా గుర్తించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియచేసి, ఇంట్రా ఆపరేటివ్ నెర్వ్ మానిటరింగ్ అనే అత్యాధునిక టెక్నాలజీ సహాయంతో మెదడు లోపలకు చొచ్చుకువెళ్లి ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ తర్వాత ఆమె రక్తనాళం మూసుకుపోయే పరిస్థితి గుర్తించి ఇంట్రా ఆర్టిరియల్ మిలినోమ్ ఇచ్చి కచ్చితమైన ఫలితాన్ని రాబట్టారు. మెదడుకు రక్త సరఫరా సాధారణ స్థితికి వచ్చి ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంతో ఉందని తెలిపారు. యశోద ఆస్పత్రిలో అన్ని రకాల అత్యాధునిక టెక్నాలజీలు, ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇలాంటి ఆపరేషన్లు న్యూరో సర్జన్లకు ఛాలెంజింగ్ అని, ఎందుకంటే ఈ ఆపరేషన్ నిర్వహించిన తర్వాత పేషంట్ పూర్వస్థితికి రావడానికి చాలా కృషి చేయాల్సి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా పేషంట్ విజయ మాట్లాడుతూ..ప్రస్తుతం తన ఆరోగ్యం బాగుందని, ఎలాంటి సమస్య లేదని తెలిపారు.

ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభం

నవతెలంగాణ - హుజురాబాద్ :



పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో శుక్రవారం ఎంఈఓ నరసింహారెడ్డితో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మంచి మనసుతో పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభించారన్నారు. అనంతరం పట్టణంలో 87 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఇంటింటికి వెళ్లి అందజేశారు. అలాగే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కుమారస్వామి, ముత్యం రాజు, తిరుమలరెడ్డి, సుశీల, లావణ్య, ఇమ్రాన్ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ - ఇల్లందకుంట

ఇల్లందకుంట ఎంపీడీవో కార్యాలయంలో మహిళలకు ఎంపీపీ సరిగొమ్ములత పావనివెంకటేష్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలు, యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ రాణి, ఏపీవో వెంకటేశ్వర్లు, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపాల్ కార్మికులు

నవతెలంగాణ-మంథని : మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ఈనెల 8 నుంచి మున్సిపల్ సమ్మెబాట పట్టనున్నారని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేశ్ అన్నారు. శుక్రవారం మంథని మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం బూడిద గణేష్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 8 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గాడిపెళ్లి మల్లేష్, సింగారం గట్టయ్య, బూడిద అశోక్,దేవేందర్, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కథలాపూర్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి. నారాయణ, డాక్టర్ సింధుజ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పారిశుభ్రత పాటించాలన్నారు. మండలంలోని పోతారం గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు సింధుజ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌస్ రెహమాన్, వైద్యాధికారి రజిత, సురేందర్, ఉపాధ్యాయులు సురేష్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



అభ్యర్థులను సన్మానించిన సంఘ సభ్యులు

నవతెలంగాణ-ఎండపల్లి : మండలంలోని రాజారాం పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఇటీవ రాష్ట్ర పోలీస్ నియామక మండలి బోర్డు విడుదల చేసిన కానిసేబుల్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన చిట్టుమల్ల శ్రీనివాస్ 17 ఏండు భారత సైన్యంలో పని చేసి సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ఆడెపు మహేష్ ఎక్సేంజ్ శాఖలో ఉద్యోగాలు సాధించాడు. పద్మశాలి సంఘం నుంచి ఒకేసారి ఇద్దరు అభ్యర్థులు ప్రభుత్వ కొలువులు సాధించడం పట్ల కుల బాంధవులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంఘం కార్యాలయం ఆవరణలో సంఘం అధ్యక్షుడు గాజుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో సన్మానించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ ప్రచారం



కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య ఘర్షణ

నవతెలంగాణ-ఎండపల్లి : ఎండపల్లి మండలంలో నోటిఫికేషన్ రాక ముందే రాజకీయ వేడి రాజుకుంది. ధర్మపురి నియోజకవర్గంలో ప్రధాన పోటీ గులాబీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే సాగుతున్న సంగతి. జనం మద్దతు కూడ గట్టడమే ముఖ్య లక్ష్యంగా ఇప్పటికే గడపగడపకు తిరుగుతూ జనంలో సానుభూతి పెంచుకున్న క్రమంలో మండలంలోని చర్లపల్లి గ్రామంలో యువత కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం పెద్ద ఎత్తున కాంగ్రెస్ గడప గడపకు వెళుతున్న సందర్భంలో బిఆర్ఎస్ చేపట్టిన ఓ సమావేశానికి హాజరైన బిఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పార్టీ నినాదాలతో భారీ ఉద్రిక్తత దారి తీసే క్రమంలో పోలీసులు రంగప్రవేశంతో సమస్య సద్దుమణిగింది.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించిన ఆదర్శ విద్యార్థులు



నవతెలంగాణ-ధర్మారం : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథటిక్స్ పోటీలలో సిల్వర్ బ్రాంజ్ మెడల్ సాధించారని ఆదర్శ విద్యాలయం ప్రిన్సిపాల్ మన్నె దీన తెలిపారు. గత నెల 30 నుంచి ఈనెల 1 వరకు కరీంనగర్ క్రీడా పాఠశాలలో జరిగిన 9వ తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ జూనియర్ ఛాంపియన్షిప్‌లో అండర్18 హెప్ట్ అత్లోన్ పాల్గొని ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ సాధించినట్టు తెలిపారు.ఎం. శ్రావ్య హై జంప్‌లో పాల్గొని మూడవ స్థానం సాధించి కాంస్య పతకాన్ని పొందింది, అదే విధంగా అండర్ 20 బి ప్రదీప్తి10 కిలోమీటర్ల రేస్ వాకింగ్‌లో పాల్గొని తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాన్ని సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీజీటీ ఏ.రాజేశం, మునిందర్, ఎస్.మణికుమార్ వ్యాయామ ఉపాధ్యా యులు బైకానీ కొమురయ్య, ఎం. సంజీవరావు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రికెట్ కిట్లు పంపిణీ



క్రికెట్ కిట్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-రామగిరి : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, మేదరవేన శారదకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇనుముల రమేష్, ఎంపీవో కాటం భాస్కర్, సర్పంచులు అల్లం పద్మ తిరుపతి, కొండవేన ఓదెలు యాదవ్, బుర్ర పద్మ శంకర్‌గౌడ్, దాసరి శంకరయ్య, రామగిరి లావణ్య నాగరాజు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గద్దల శంకర్, ఆలయ కమిటీ చైర్మన్ వేగోలపు శ్రీనివాస్‌గౌడ్, కొండవేన ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ నాయకులు విజయరమణారావు సమక్షంలో చేరికలు

నవతెలంగాణ-ఓదెల : ఓదెల మండలంలోని జీలకుంట గ్రామంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయ రమణారావు, మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు సమక్షంలో జీలకుంట గ్రామానికి చెందిన ఉద్యమకారులు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ లో చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ విజయరమణ రావు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాగిడి రవీందర్ రెడ్డి, కట్కూరు సమ్మిరెడ్డి, శాంగొండ బ్రహ్మచారి, పడాల రాజు, వంగ శ్రీనివాస్, అళ్ళ సుమన్ రెడ్డి, కంకణాల భాస్కర్ రెడ్డి,సిరేష్టి రాహుల్,శ్రీధర్,సుదీర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి



పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేసిన దళితులు

నవతెలంగాణ-ఓదెల : అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని ఓదెల మండలంలోని గుంపుల గ్రామంలో దళితులు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. అధికార పార్టీ నాయకులకు దళితబంధు ఇస్తున్నారని రోపించారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వం స్పందించి అర్హులకు దళిత బంధం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మక రవి,జూపాక పద్మ,పల్లెర్ల ప్రమీల, సకినాల శ్రీనివాస్, గంధం రామచందర్, తిప్పారపు సారయ్య, కోడం సారయ్య, అంబాల రమేష్, దళిత సభ్యులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలో పాస్ పోర్ట్ ఆఫీస్ ఏర్పాటు, బ్యాంకులో క్యాష్ చెస్ట్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాకు ఏటికి భారత్ సురక్ష సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా నుంచి ఉపాధి నిమిత్తం వేలాది మంది యువకులు విదేశాలకు వెళ్తున్నారని, పాస్ పోర్ట్ కోసం కరీంనగర్, నిజామాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. జిల్లా కేంద్రంలో పాస్‌పోర్ట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కశినాధం, జిల్లా ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, నరెందుల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ బండారి మల్లికార్జున్, వనమల సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- కోరుట్ల 100 పడకల ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రి ప్రారంబిస్తున్న మంత్రి హరీష్ రావు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ తదితరులు

నవతెలంగాణ-కోరుట్ల : పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రూ.16.80 కోట్లతో 100 పడకల ఆసుపత్రిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. . అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. నాడు కాంగ్రెస్ పరిపాలనలో రైతుల కష్టాలు వర్ణనాతీతం అన్నారు. ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణలో రైతులకు నేడు వ్యవసాయానికి 24 గంటలు కరెంట్ అందిస్తున్న ఘనత కేసీఆర్ కె దక్కుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు రైతులకు ఎరువులు కూడా దొరికేది కాదని విమర్శించారు. పదేండ్ల కింద టీడీపీలో ఉన్న రేవంత్ రెడ్డి ...పదేండ్ల పాలనా గురించి చర్చలు పెట్టుకుందామనడం సిగ్గుచేటన్నారు. ఆనాడు పావురాల గుట్టలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణిస్తే ....పావురాల గుట్టలో పావురంల ఎగిరిపోయాడని ఎద్దేవా చేసిన రేవంత్ కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత లేదని గుర్తుచేశాడు. ఇప్పటి వరకు 12070 మంది ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి పథకం అందించామన్నారు. రైతు బంధు ద్వారా ఇప్పటి వరకు 11 కిస్తులు చెల్లించామన్నారు. ఇలా అన్ని వర్గాల సంక్షేమానికి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కల్వకుంట్ల సంజయ్ లు మాట్లాడుతూ.. మంత్రి కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో సహకరించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే కే. విద్యాసాగర్ రావు, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, ఎస్పీ ఏ.భాస్కర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, వైద్యులు, ఇతర అధికారులు, సిబ్బంది. పాల్గొన్నారు.

మంత్రికి ప్రారంభోత్సవాలపై ఉన్న శ్రద్ధ విష జ్వరాలు అరికట్టడంలో లేదు

మాజీ ఎమ్మెల్యే కోమిరెడ్డి జ్యోతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోమిరెడ్డి జ్యోతి

నవతెలంగాణ -మెట్‌పల్లి : మంత్రి హరీష్‌రావుకు ప్రారంభోత్సవాలపై ఉన్న శ్రద్ధ విష జ్వరాలు అరికట్టడంలో లేదని మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కల్వకుంట్ల కుటుంబ సభ్యులు జిల్లాలో పర్యటిస్తున్నప్పుడు ప్రతిపక్ష నాయకుల అరెస్టు పరిపాటిగా మారిందని ఆరోపించారు. ఎలాంటి సమాచారం లేకుండా ఉదయం 6 గంటలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం పట్ల ఆమె మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో ఎప్పుడో పూర్తి కావాల్సిన కోరుట్ల 100 పడకల ఆస్పత్రి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆగ మేఘాల మీద ప్రారంభించాల్సిన ఆంతర్యం ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ పాలన అంతా అవినీతి మయమైందని ఆరోపించారు. మరోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ప్రజలు ఓటు వేసే పరిస్థితి లేదని తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలో పారిశుద్య లోపించి దోమలు స్వైర విహారం చేస్తుంటే పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో ఖాళీ స్థలాలు మురుగు కూపాలుగా మారి దోమలు, దుర్వాసనలతో ప్రజలు అనారోగ్యం బారిన పడి ప్రభుత్వాస్పత్రికి వెళితే అక్కడ సరైన సిబ్బంది లేక ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించి విష జ్వరాల నుంచి ప్రజలకు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు న్యాయవాది ఎలుముల రాంబాబు, సంగు గంగాధర్, తాండ్ర నరసయ్య, రావుల గణేష్, ధోనోజి వెంకటేష్, రాజేష్, సంతోష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలి

ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య



మగ్గం వర్క్స్ ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-రామగిరి : ప్రతి మహిళ ఉపాధి అవకాశాలను మెరుగు పరుచు కోవాలని ఎంపీపీ అరెల్లీ దేవక్క కొమురయ్య, జెడ్పీటీసీ మ్యాదరవేన శారద కుమార్ అన్నారు. శుక్రవారం సెంటినరీ కాలనీలోని ఏఐటీయూసీ కాంప్లెక్స్‌లో కళాంజలి మగ్గం వర్క్స్, లేడీస్ టైలర్‌ను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాపరబోయిన శ్రీదేవి భాస్కర్, సర్పంచ్ లు పల్లె ప్రతిమ పీవీరావు (రత్నాపూర్), అల్లం పద్మ తిరుపతి (పన్నూర్), గంట పద్మ వెంకటరమణ రెడ్డి (కల్వచర్ల) నిర్వహకులు చేతి భాగ్య లక్ష్మి రవీందర్ పాల్గొన్నారు.

ఎంపీపీ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల వినతి

తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఎంపీపీ ఆర్ఎల్ దేవక్క కొమురయ్య గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు.

నేడు చేప పిల్లల పంపిణీ

రామగిరి మండలం ఎంపీడీవో కార్యాలయంలో చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్టు ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఏడు సొసైటీల ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు.

ప్రయివేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



అల్పాహారం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని పటిష్టంగా అమలు పరచాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు వెచ్చిస్తూ పతశాలల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేస్తూ, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫారాలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొదటి దశలో మన ఊరు- మన బడి కార్యక్రమం కింద 274 పాఠశాలల్లో పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి గొప్ప ఆలోచన విధానంతో అల్పాహార పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ అనిల్ బాబు, జిల్లా విద్యా శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాల అసెంబ్లీ బరిలో జనసేన పోటీకి సిద్ధం

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జనార్ధన్



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల అసెంబ్లీ స్థానంలో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బెక్కం జనార్ధన్ అన్నారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 అసెంబ్లీ స్థానాల్లో జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నట్టు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించారన్నారు. ఈ 32 స్థానాల్లో జగిత్యాల ఉందని, ప్రజారాజ్యం పార్టీ రూపంలో జగిత్యాలలో స్థిరమైన ఓటుబ్యాంక్ ఉందని అందుకే ఇక్కడ పోటీ చేస్తామని తమ సత్తా చూపుతామని జనార్ధన్ పేర్కొన్నారు. వారాహిలో భాగంగా పవన్ కళ్యాణ్ జగిత్యాల నియోజకవర్గంలో పర్యటిస్తాడని చెప్పారు. ఈ కార్యక్రమంలో జగితాల పట్టణ అధ్యక్షుడు చింత సుధీర్, జగిత్యాల రూరల్ మండలం అధ్యక్షుడు బొల్లి రాము, లక్ష్మణ్, తాటిపల్లి అజయ్, మండల అధ్యక్షుడు కాసవేణి మల్లికార్జున్, మండల ప్రధాన కార్యదర్శి బత్తిని బాబుగౌడ్, శివకుమార్, సారంగాపూర్ మండల అధ్యక్షులు తోకల శ్రీధర్, పర్వేజ్, కిరణ్ సింగ్, గట్ల శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా బీఆర్ఎస్

ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



ఇండ్ల పట్టాలు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ- సుల్తానాబాద్ : బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి హనోహర్‌రెడ్డి అన్నారు. జీవో 58 ద్వారా నిరుపేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ముత్యం సునీత రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం 58 జీవో ద్వారా 61 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధుల ద్వారా అన్ని వర్గాలను పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు, ఆర్డీవో మధుమోహన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మెన్ బుర్ర మౌనిక, శ్రీనివాస్, కౌన్సిలర్లు మమత, సంపత్, పారుపల్లి జ్ఞానేశ్వరి, గుణపతి, కూకట్ల గోపి, చింత సునీత రాజు, గొట్టం లక్ష్మి మల్లయ్య, అనుమల అరుణ బాబురావు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల బాగుకే పథకాలు

పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్



అల్పాహారం పంపిణీ ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని : మన భవిష్యత్ తరాల బాగు కోసమే సీఎం కేసీఆర్ గొప్ప పథకాలు అమలు చేస్తున్నారని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. సీఎం అల్పాహర పథకాన్ని మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ఆయన అల్పాహరం చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహరం అందిస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడ లేని విదంగా అల్పాహారం పథకాన్ని సీఎం కేసీఆర్ రూపొందించారని కొనియడారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్యనందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మంథనిలో మత్స్యకారులకు చేప పిల్లలను మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజతో కలిసి మధూకర్ పంపిణీ చేశారు. 14 గ్రామాల్లోని మత్స్యకారులకు 9.63లక్షల చేప పిల్లలను పంపిణీ చేసినట్టు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ : మంథని మండలం మైదుపల్లి గ్రామంలో పెట్టెం సరిత ఇటీవల మరణించగా ఆమె కుటుంబాన్ని, అలాగే గాజులపల్లి గ్రామంలో పేరం భూమయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని జడ్పీ చైర్మన్ పరామర్శించారు.

ఇప్పపెల్లి గ్రామస్తుల ధర్నా



నవతెలంగాణ- కథలాపూర్ : ఎన్నో ఏండ్ల నుంచి ఇప్పపల్లి గ్రామ శివారు ఉన్న భూమిని కాపాడుకుంటూ వస్తే కొంత మంది ప్రభుత్వ అధికారు లు కలిసి రెండు కుల సంఘాలకు 25 ఎకరాల భూమిని చదును చేసుకోవడానికి వత్తాసు పలకడం సమంజసమేనా అని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 25 ఎకరాల భూమి చదును చేసుకున్న ముదిరాజ్, యాదవ కుల సంఘాల వద్ద నుండి భూమి ప్రభుత్వం తీసుకొని మంకీ కోర్టు, లేదంటే ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగపడేలా ఉండే విధంగా చూడాలని గ్రామస్తులు కోరారు. ప్రభుత్వ చదును చేస్తున్న ట్రాక్టర్లను ఒకే రోజు పోలీస్ స్టేషన్‌లో ఉంచుకుని వదిలిపెట్టడం ఏంటని గ్రామస్తులు తహసీల్దార్ ముంతాజోద్దీన్‌ను నిలదించారు. ట్రాక్టర్లను సీజ్ చేయాలని ,కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు యగాండ్ల రమేష్ గౌడ్, సర్పంచ్ కొలి వసంత నరేందర్ రెడ్డి,ఉపసర్పంచ్ మండలోజి నరేష్ చారి ,నంపెల్లి నరేష్,రమేష్ ,నర్సారెడ్డి, అజయ్ రావు, మల్లేశం, సాగర్,గంగాధర్. రాజేందర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జూలపల్లి : జూలపల్లి మండలం వడ్కపూర్ గ్రామానికి చెందిన తోటపల్లి సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబానికి సహాయం అందించాలని స్థానిక నాయకులు కేసీఆర్ సేవా దళం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, పద్మశాలి సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జూలపల్లి మండల జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌ను కోరగా వెంటనే స్పందించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కెసిఆర్ సేవా దళం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు దండే వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి చాతళ్ళ కాంతయ్య, బొద్దుల సాయినాథ్, బోళ్ళ అంతయ్య, వేల్పుల గట్టయ్య, కనకయ్య, శంకరయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత



నవతెలంగాణ -మెట్‌పల్లి : మున్సిపల్ శాఖ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంపు, ఉద్యోగ భద్రత ఇతర అపరిస్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండి ఉస్మాన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులతో కలిసి మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ కు కార్మికులు సమ్మె నోటీసు అందించారు. కార్మికులకు సుప్రీంకోర్టు 2016 మార్గదర్శకాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని, పర్మినెంట్ ఉద్యోగంతో పాటు ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ. 25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలైన మున్సిపల్ కార్మికులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇండ్లు లేదా ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధురమ్మ, లంక శ్రీకాంత్, లక్ష్మణ్, రవి, సురేష్, నరసయ్య, గంగపోచయ్య, సుమన్ తదితర మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అనుక్షణం భద్రతతో పని చేయాలి



గని అధికారులతో ఏరియా సేఫ్టీ జీఎం

నవతెలంగాణ-రామగిరి : గనిలో విధులు నిర్వహిస్తున్నప్పుడు అనుక్షణం భద్రతతో పని చేయాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ ఎస్. సాంబయ్య అన్నారు. శుక్రవారం ఏపీఏ జీఎం కె. వెంకటేశ్వర్లుతో కలిసి అడ్రియాల లాంగ్ వాల్ గనిని సందర్శించి, రక్షణపై తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. పని స్థలాల వద్ద ఉద్యోగులతో మాట్లాడి, రక్షణపై తీసుకుంటున్న జాగ్రత్త చర్యల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి కె.నాగేశ్వరరావు, సూపరిండెంట్ ఆఫ్ మైన్స్ కె. జనార్ధన్, పిట్ ఇంజీనీర్ విజె వెంకటేష్ పాల్గొన్నారు.

యువత సేవలు అభినందనీయం



హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా ఎస్సై చేతుల మీదుగా ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

నవతెలంగాణ-రామగిరి : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం యువత సేవలు అభినందనీయమని కమాన్‌పూర్ ఎస్సై భేతి రాములు అన్నారు. శుక్రవారం కమాన్‌పూర్ మండలంలోని గుండారం గ్రామానికి చెందిన రాచకొండ ప్రేమ్ ఏడాది కాలంగా బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతన్నాడు. హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించే క్రమంలో పరిస్థితి విషమించి ప్రేమ్ మృతి చెందాడు. సభ్యులంతా కలిసి తమ చేసిన మొత్తాన్ని రూ.1,13,700/- ఎస్సై రాములు చేతుల మీదుగా ప్రేమ్ కుటుంబ సభ్యులకు అందించారు. ప్రేమ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని, 8332033669 నంబర్‌కి ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు నారగోని సతీష్, సీనియర్ జర్నలిస్ట్ జబ్బర్ ఖాన్, మేడగోని విజయ్, రెడ్డి చైతన్య, గడ్డం ప్రకాష్, మల్యాల రమేష్, కొత్తపల్లి సతీష్, బుర్ర శ్రీనివాస్, వడ్లకొండ తిరుపతి, జంగిలి పోచాలు, జంగిలి కనకయ్య పాల్గొన్నారు.

549 ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం ప్రారంభం



అల్పాహారం ప్రారంబిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

నవతెలంగాణ- పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలోని 549 ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని అమర్‌నగర్ లో గల ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో కలెక్టర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. విద్యార్థులకు స్వయంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వడ్డించారు. ప్రతి రోజు పిల్లలు ఉదయమే పాఠశాలకు వచ్చి చేతులు శుభ్రంగా కడు కుని అల్పాహారం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్య క్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, అకడమిక్ కో-ఆర్డినేటర్ పి.ఎం.షేక్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారికి 'ఆశాల' వినతి

నవతెలంగాణ-పెద్దపల్లి : ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, ప్రమాద బీమా రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని జిల్లా వైద్యాధికారికి తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి జి. జ్యోతి మాట్లాడుతూ.. 18 ఏండ్లుగా గ్రామాల్లో ఆశావర్కర్లు ఆరోగ్యశాఖకు ప్రజలకు వారధిగా పని చేస్తున్నారన్నారు. గతం కంటే పని భారం పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆశాలతో అనేక పనులు చేయిస్తుందని పేర్కొన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు టీ శారద, సువర్ణ, డి రజిత ,స్వప్న ,మంజుల, కోమల, సరోజన ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



మంథనిలో కాంగ్రెస్ ఫ్లెక్సీని చింపడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-మంథని : మంథని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చింపి వేయడంతో కాంగ్రెస్ నాయకులు పాత పెట్రోల్ బంకు వద్ద ధర్నా చేపట్టారు. అధికార పార్టీకి చెందిన నాయకులే ఫ్లెక్సీ చింపి వేశారని ఆరోపించారు. వారి ధర్నాలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాశాలకు సామగ్రి అందజేత



విరాళంతో వస్తు సామాగ్రిని సమకూర్చిన కళాశాల ఉపాధ్యాయులు

నవతెలంగాణ-మంథని : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, అధ్యాపకుల ఆధ్వర్యంలో కళాశాల భవనంలో కరెంట్ కోసం రూ.45వేల విలువ చేసే ఫ్యాన్లు, బల్బులు, ఎలక్ట్రిక్ వైరింగ్, స్విచ్ బోర్డులు, పైపులు ఇతర పనుల కోసం సామగ్రిని అధ్యాపకులు ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉష, అధ్యాపకులు జ్యోతి,రాజ్ కుమార్,రాఘవేంద్ర చారి, శ్రీనివాస్,పాషా, రాయలింగు,మయూరి, తదితరులు పాల్గొన్నారు.

రచ్చపల్లిలో బతుకమ్మ చీరలు పంపిణీ



పంపిణీ చేస్తున్న సర్పంచ్ కణవేణ శ్రీనివాస్

నవతెలంగాణ-మంథని : మండలంలోని రచ్చపల్లిలో మహిళలకు గ్రామ సర్పంచ్ కనవేణ శ్రీనివాస్ బతుకమ్మ చీరలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మిరియాల ప్రసాద్ రావు,ఉప సర్పంచ్ గుర్రం సదానందం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రిటైల్ చేపల మార్కెట్ ప్రారంభం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : జగిత్యాల అర్బన్ మండల మోతే శివారు గొల్లపల్లి రోడ్డులో రూ. 10 లక్షలతో నిర్మించిన రిటైల్ చేపల మార్కెట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మహేష్, సర్పంచ్ స్వప్న రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటేష్, రైతుబంధు, సమితి మండల కన్వీనర్ జుంబర్తి శంకర్, గుమ్ముల అంజయ్య, శీలం ప్రవీణ్, టివి సూర్యం, ఆసిఫ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీరామ్ బిక్షపతి ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముత్తు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తుమ్మ గంగాధర్, మాదాసు రవి, పల్లికొండ రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ

రాజన్న సిరిసిల్ల

శనివారం | అక్టోబర్ 7, 2023 | www.navatelangana.com

పత్రిక స్వేచ్ఛపై కేంద్రం ప్రభుత్వ దాడిని ఖండించండి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మంద అనిల్ కుమార్



నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆలిండియా కమిటీ పిలుపులో భాగంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ వైఖరిని ఖండించాలన్నారు. న్యూస్ క్లిక్ పోర్టల్ కార్యాలయంపై అందులో పని చేస్తున్న 47మంది జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసులు దాడులకు పాల్పడిన తీరు దుర్మార్గమన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛపై జరుగుతున్న దాడిని ఎస్ఎఫ్ఐ సిరిసిల్ల జిల్లా కమిటీ ఖండిస్తున్నదన్నారు. కేసులను నమోదు చేస్తామని భయబ్రాంతులకు గురి చేయడం ప్రజాస్వామ్య సంస్థల నిర్వీర్యం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, జిల్లా నాయకులు సొల్లు సాయి, పెండెం ఆదిత్య ఆదేప్ అభిషేక్, సెల్ల నవీన్ , అరుణ్, రామ్ చరణ్, సాయి చరణ్, బాను, భాస్కర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బతుకమ్మ చీరల పంపిణీ



పంపిణీ చేస్తున్న జెడ్పీటీసి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యలయం ఆవరణలో శుక్రవారం సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీలు వందిర్ల నాగరాణి పర్శరాములుగౌడ్, ఎలగందుల అనసూయ నర్సింలు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బండారి బాల్‌రెడ్డిలు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : తెలంగాణలో ఉన్న ప్రతి ఆడబిడ్డకు బతుకమ్మ చీరలు రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డ కట్నం గా అందజేస్తుందని ఎంపీపీ పడిగల మానస, ఏఎంసీ చైర్మన్ పూసపల్లి సరస్వతి అన్నారు. శుక్రవారం మండలంలోని పాపయ్య పల్లె, ఓబులాపూర్, చిన్న లింగాపూర్ తో పాటు పలు గ్రామాల్లో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు మోర నిర్మల, ఏఎంసీ డైరెక్టర్ సద్ద రోజా, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్దిదారులకు చెక్కులను అందిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం పది మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.1లక్ష 97500 విలువగల చెక్కులను స్థానిక సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు వందిళ్ల నాగరాణి పర్శరాములుగౌడ్, ఎలగందుల అనసూయ నర్సింలు, ఎఎంసి డైరెక్టర్ మెండె శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

నాన్నకు ప్రేమతో..


ప్రొఫెసర్ ఉద్యోగం వదిలి పోలీస్ ఉద్యోగం



కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన రామకృష్ణ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రానికి చెందిన కుబేర రామకృష్ణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాలలో సివిల్ పోలీస్ ఉద్యోగం సాధించారు. ఎంటెక్ పూర్తి చేసి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన తండ్రి కుబేర స్వామి కోరిక మేరకు ఉద్యోగాన్ని వదిలేసి ప్రభుత్వ కొలువు కోసం సొంతంగా నోట్స్ ప్రిపేర్ చేసుకొని ఇంటి వద్దనే ఉండి చదువుకొని సబ్ ఇన్స్‌పెక్టర్‌కు ప్రిపేర్ అయ్యాడు. నాలుగు మార్కులతో ఎస్ఐ పోస్టు రాలేదు. కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగంలో రాజన్నసిరిసిల్ల జిల్లాలో14వ ర్యాంకు సాధించి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం పొందాడు. తండ్రి కోరికమేరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ఇంటి వద్దనే సొంతంగా పరీక్షకు సిద్ధమై ఉద్యోగం పొందడంతో రామకృష్ణను పలువురు అభినందించారు.


లండన్‌లో బొప్పాపూర్ గ్రామవాసి హత్య



మృతిచెందిన రయిసుద్దిన్ (ఫైల్ ఫోటో)

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన చాంద్ పాషా కుమారుడు రయిసుద్దిన్ గత శనివారం లండన్‌లో హత్యకు గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 13ఏండ్ల కిందట బొప్పాపూర్ గ్రామం నుంచి హైదరాబాద్‌కు ఉపాధి కోసం వెళ్లారు. అనంతరం ఉపాధి కోసం లండన్‌కు వెళ్లాడు. ఈ కుటుంబం లండన్‌లో స్థిరపడ్డ రయిసొద్దీన్ అక్కడ కొందరు వ్యక్తులు గొడవ పడుతుంటే గొడవను ఆపే ప్రయత్నం చేయగా ఉగాండా వాసులుగా అనుమానిస్తున్న ఇద్దరు రయిసొద్దీన్‌ను కత్తులతో పొడిచారు. తీవ్రంగా గాయపడ్డ అతడిని ఆసుపత్రికి తరలించే సమయంలో మృతిచెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. అక్టోబర్ 5న కూతురు వివాహం హైదరాబాద్‌లో ఉండగా అందుకు ఏర్పాట్లు చేసుకున్న తరుణంలో హత్యకు గురికావడంతో బొప్పాపూర్ గ్రామంలో, బంధువులలో విషాదం నెలకొంది.

ఆశా కార్యకర్తల ధర్నా, రాస్తారోకో



ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం కామారెడ్డి - సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆశా వర్కర్లు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. పోలీసులు నచ్చజెప్పి ఆశా కార్యకర్తలను రోడ్డుపై నుంచి శిబిరంలోకి తరలించారు. మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ 12 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. కరోనా సమయంలో ఆశా కార్యకర్తలే దేవుళ్లు అని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం ఆశా కార్యకర్తలను పిలిచి చర్చించడం లేదన్నారు. మంత్రి కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటిస్తుంటే ఆశా కార్యకర్తలైన మహిళలు అని కూడా చూడకుండా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆశా కర్యకర్తలకు ఉద్యోగ భద్రతను కల్పిస్తామన్నారు.

దుమాల గ్రామంలో వైద్య శిబిరం



ఫీవర్ సర్వే చేస్తున్న మండల వైద్యాధికారిణి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని దుమాల గ్రామంలో శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ సంప్రతి రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య బృందం వెళ్లి ఇంటింటికీ రక్త పరీక్షలు చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి రెడ్డి మాట్లాడుతూ సుమారు 74మందిని పరీక్షించి మందులను పంపిణీ చేసినట్టు తెలిపారు. అదేవిధంగా పది మందికి మలేరియా, రాపిడ్ టెస్ట్ చేశామన్నారు. తమ సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరం పరీక్షలు నిర్వహించారని సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కదిరే రజిత శ్రీనివాస్, కార్యదర్శి మహేందర్, పిహెచ్ఎస్ రజిని, సూపర్వైజర్ పద్మ, ఆరోగ్య సిబ్బంది నరేందర్, రమేష్, అనసూయ, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి

నవతెలంగాణ - ఇల్లంతకుంట : ప్రజా ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వైద్య ,ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి శుక్రవారం మండలానికి వచ్చిన మంత్రికి ప్రజలు బ్రహ్మ రథం పట్టారు. మండల కేంద్రంలో నిర్మించబోయే 50పడకల ఆసుపత్రికి భూమి పూజ, మార్కెట్ యార్డ్, మహిళా బిల్డింగ్, పల్లె దవాఖాన లాంటి అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇల్లంతకుంట మండల చిరకాల వాంఛ అయిన 50పడకల ఆసుపత్రి త్వరలో నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలములోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. రైతాంగ తాగు, సాగు నీటి అవసరాల కోసం రాష్ట్ర బడ్జెట్లో ఎక్కువ మొత్తంలో కేటాయించి రైతుల కన్నీళ్లు తుడిచిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు. మండలంలో ఏ మూల చూసినా గలగల పారే సెలయేర్లు దర్శనమిస్తున్నాయన్నారు. పచ్చటి పొలాలతో అన్ని గ్రామాలు కళ కళ లాడుతున్నా ప్రతి పక్షాలకు కనబడటం లేదని విమర్శించారు. మహిళా అభివద్ధి కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని, స్వశక్తితో సంఘ సభ్యులు ఎదగాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు సిద్దంగా ఉండాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. పని చేసే ప్రభుత్వానికే పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ రాఘవరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుమన్ మోహన్‌రావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, జిల్లా వైస్ చైర్మన్ వేణు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, స్థానిక సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ నర్సయ్య యాదవ్, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, నాయకులు వేణురావు, తిరుపతిరెడ్డి, తిరుపతి, నర్సింహారెడ్డి, అయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా మంత్రి హరీష్‌రావు మండలానికి రాక సందర్భంగా శుక్రవారం రాత్రి మంత్రికి వ్యతిరేఖంగా వెలసిన ఫ్లెక్సీలు కలకలం రేపాయి.

వేతనం పెంచి సమ్మె విరమింపజేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్
- సిరిసిల్లలో ఆశాల రాస్తారోకో



సిపిఎం నాయకులను బలవంతంగా లాక్కెల్తున్న పోలీసులు



సిరిసిల్ల గాంధీ చౌక్‌లో రాస్తారోకో చేస్తున్న ఆశా కార్యకర్తలు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. ఆశా వర్కర్లు చేస్తున్న సమ్మె శుక్రవారానికి 12వ రోజుకు చేరడంతో సిరిసిల్ల గాంధీ చౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. ఆశా కార్యకర్తలకు మద్దతుగా రాస్తారోకోలో పాల్గొన్న సీపీఐ(ఎం) నాయకులను పోలీసులు బలవంతంగా లాక్కెళ్లారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశా వర్కర్ల వేతనాలు పెంచకుండా వారిపై కక్ష సాధింపు ధోరణి కొనసాగిస్తున్నాడన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ జీతాలు తెలంగాణ రాష్ట్రంలోనే ఇస్తున్నామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ ఆశా వర్కర్లు వినతి పత్రం ఇస్తామన్నా తీసుకునే పరిస్థితిలో లేడని, ఈ రకంగా ఇంకో మంత్రి జగదీశ్ మమ్మల్ని ఓడించండి మేము ఇంట్లో కూర్చుంటామని తలతిక్క సమాధానాలు ఇస్తున్నాడని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ ఆశా వర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటోందన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే ఆశా వర్కర్ల సమస్యలు, వారికి వేతనం రూ.18వేలు పెంచకుంటే మంత్రి జగదీష్ రెడ్డి అన్న విధంగానే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించి ఎమ్మెల్యేలను ఇంట్లో కూర్చుండబెట్టే పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు సూరం పద్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, నాయకులు గోవిందు, లక్ష్మణ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి జయశీల, గౌరవాధ్యక్షురాలు భారతి కోశాధికారి కస్తూరి, గాయత్రి, లత, చందన, లక్ష్మి, లావణ్య, చంద్రకళ పాల్గొన్నారు.

17ఏండ్లకు ఇంటికి చేరిన వలసజీవి

- దుబాయ్ జైల్లో మగ్గిన కోనరావుపేట వాసి
- కేటీఆర్ కృషితో క్షమాభిక్షతో స్వగ్రామానికి



కుటుంబ సభ్యులతో దండుగుల లక్ష్మణ్

నవతెలంగాణ - కోనరావుపేట : బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన వలసజీవి అక్కడ హత్యకేసులో 17ఏళ్లుగా జైలు జీవితం గడిపి క్షమాభిక్షతో విడుదలై శుక్రవారం స్వగ్రామం చేరుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన దండుగుల లక్ష్మణ్(38) 2005లో ఉపాధి కోసం దుబాయ్ దేశం వెళ్లాడు. 2006లో దుబాయ్ లో జరిగిన హత్య కేసులో జిల్లాకు చెందిన శివరాత్రి రవి, మల్లేశం, నాంపల్లి, హన్మండ్లు, లక్ష్మన్ లకు 25ఏళ్ల జైలు శిక్ష విధించింది. లక్ష్మణ్ అప్పటి నుండి దుబాయ్ జైల్లో మగ్గుతున్నాడు.వీరి విడుదల కోసం మంత్రి కేటీఆర్ కొన్నేళ్లుగా అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేరంలో ప్రాణాలు కోల్పోయిన నేపాల్‌కు చెందిన బహదూర్ సింగ్ అనే బాధిత కుటుంబానికి కేటీఆర్ స్వయంగా వెళ్లి షరియ చట్టం ప్రకారం రూ.15లక్షల నష్టపరిహారాన్ని అందించారు. బాధిత కుటుంబం ఇచ్చిన క్షమాభిక్ష పత్రాలను దుబాయ్ ప్రభుత్వానికి సమర్పించి క్షమాభిక్ష కోరారు. అయినా దుబాయ్ ప్రభుత్వం నేర తీవ్రతను దృష్టిలో ఉంచుకొని క్షమాభిక్షను ప్రస్తావించలేదు. గత నెలలో మంత్రి కేటీఆర్ దుబాయ్ పర్యటనలో జిల్లాకు చెందిన ఖైదీల విడుదల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేసి దుబాయ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మానవతా దృక్పథంతో తెలంగాణ ఎన్నారైల క్షమాభిక్ష కోసం సహకరించాలని కోరారు. మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించి దుబాయ్ ప్రభుత్వంతో స్థానిక చట్టాల మేరకు చర్చించేందుకు పంపిస్తామని అక్కడి అధికారులు కేటీఆర్‌కు హామీ ఇచ్చారు. జిల్లాలోని కొనరావుపేట మండల కేంద్రానికి చెందిన దండగుల లక్ష్మణ్‌కు దుబాయ్ కోర్ట్ క్షమాభిక్ష ఇవ్వడంతో విడుదలై శుక్రవారం ఇంటికి చేరుకున్నాడు. 17ఏండ్ల తర్వాత తన కొడుకును చూసుకున్న లక్ష్మణ్ తల్లి లస్మవ్వ, అన్న, అక్కలు ఆనందంతో కన్నీటి పర్యంతమయ్యారు. 17ఏండ్లు జైలు జీవితం గడిపి బయటకు రావడంతో లక్ష్మణ్ మానసిక పరిస్థితి బాగా లేదని, ప్రభుత్వం తన తమ్ముడికి వైద్యం చేయించి ఆర్థికంగా ఆదుకోవాలని లక్ష్మణ్ అన్న రాజు కోరాడు. తన తమ్ముడి విడుదలకు సహకరించిన మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

స్వరాష్ట్రంలో ప్రభుత్వ బడులు బలోపేతం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- ముఖ్యమంత్రి అల్పాహార పథక ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ అరుణ చిత్రంలో జిల్లా కలెక్టర్


నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలసి సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. వారితో కలిసి టిఫిన్ చేశారు. రుచి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో ప్రభుత్వ బడుల దశ, దిశ మారిందన్నారు. సీఎం కేసిఆర్ ప్రత్యేక చొరవతో తెలంగాణలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన బోధన, మౌలిక వసతులపరంగా బలోపేతం అయ్యాయని తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన తో అనేక మంది తిరిగి ప్రభుత్వ బడి బాట పట్టారన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గంలోని ఒక్కో ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఈ పథకం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, రాష్ట్ర పవర్ లూమ్, టెక్స్ టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అకునూరి శంకరయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ ఆయాజ్, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, స్థానిక కౌన్సిలర్ రెడ్యా నాయక్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీల పంపిణీ




ముస్తాబాద్: ప్రొజెటింగ్ కాపీలతో లబ్దిదారులు

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలో లబ్దిదారులకు గృహలక్ష్మి ద్వారా ఇల్లు నిర్మాణం చేసుకోవడానికి ప్రభుత్వం రూ.మూడు లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ముస్తాబాదులో గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు నిర్మాణం చేసుకునే 32మంది లబ్దిదారులకు శుక్రవారం ప్రొసీడింగ్ కాపీలను సర్పంచ్ సుమతి కృష్ణ మూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి గౌడ్ ఈవో శ్రీనివాస్, ఎంపీటీసీలు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వీర్నపల్లి : పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - వీర్నపల్లి : మరింత మండలాన్ని అభివృద్ధి చేస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట అగయ్య అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో రైతు వేదికలో గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలు, స్పోర్ట్స్ మెటీరియల్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, అడపడుచులకు బతుకమ్మ చీరలను ఎంపీపీ మాలోతు భూలా, జెడ్పీటీసీ కళావతి, సర్పంచ్ పాటి దినకర్‌లతో కలసి తోట అగయ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షులు ఎడ్ల సాగర్, వైస్ చైర్మన్ తులసిరాం, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



తంగళ్ళపల్లి : ప్రొసీడింగ్స్ కాపీలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ- తంగళ్లపల్లి : మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో శుక్రవారం గృహలక్ష్మి పథకం కింద ఎంపికైన లబ్దిదారులకు ప్రొసీడింగ్స్‌లను ఎంపీపీ పడిగల మానస, ఏఎంసి చైర్మన్ పూసపల్లి సరస్వతి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నందగిరి నర్సయ్య, ఎంపిటిసి రాజిరెడ్డి,ఏఎంసి డైరెక్టర్లు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వడ్డేరా ఓబన్న వర్ధంతి

నవతెలంగాణ - రుద్రంగి : స్వతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో వడ్డెర సంఘం అధ్యక్షుడు గొళ్ళెం నర్సింగ్ ఆధ్వర్యంలో ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర కులస్థులు మాట్లాడుతూ.తెల్ల దొరల వెన్నులో వణుకు పుట్టించిన ఘనత వడ్డే ఒబన్నదని అన్నారు.రేనాటి విరుడిగా,వడ్డెర ముద్దుబిడ్డగా, స్వతంత్ర సమరయోధుడిగా వడ్డే ఒబన్న వడ్డెర ప్రజల గుండెల్లో నిలిచిపోయారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గొళ్ళెం శేఖర్, గొళ్ళెం కుమార్, బోదసు గంగరాజం, శివరాత్రి రత్నం, గుంజే రాజేష్, జలందర్, రాఘవ్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

మల్కపేట రిజర్వాయర్ ప్రారంభానికి ఏర్పాట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



మల్కాపేట రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ - కొనరావుపేట : కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజి-9లో భాగంగా నిర్మిస్తున్న కోనరావుపేట మండలంలోని మల్కపేట రిజర్వాయర్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. త్వరలో ఈ జలాశయం సీఎం కేసిఆర్ ప్రారంభించనున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి కొనరావుపేట మండలంలోని మల్కపేట రిజర్వాయర్‌ను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ప్యాకేజీ-9 పూర్తయిందని, ఇదివరకే ట్రయల్ రన్‌లో భాగంగా రెండు పంపులు సక్సెస్ అయ్యాయని తెలిపారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో 60వేల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందడంతోపాటు 26,150 ఎకరాలు ఆయకట్టు స్థిరీకరణ కానుందని, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాలలోని రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. హెలిప్యాడ్ సిద్ధం చేయాలని, కంట్రోల్ రూమ్, పైలాన్ ను ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని అన్నారు. ప్రాజెక్టు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను సూచించారు.

'సీఎం బ్రేక్ ఫాస్ట్'తో పౌష్టికాహార లోపానికి చెక్

జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ




మాట్లాడుతున్న జిల్లా పరిషత్ అధ్యక్షురాలు అరుణ

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే చిన్నారుల్లో తలెత్తే పౌష్టికాహార లోపానికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం 'సీఎం బ్రేక్ ఫాస్ట్' పేరుతో పథకాన్ని ప్రారంభించిందని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ, పంచాయితీ రాజ్ అధికారులు సమన్వయం చేసుకుంటూ పటిష్ట చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. శుక్రవారం జెడ్పీచైర్‌పర్సన్ అధ్యక్షతన జిల్లా స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. విద్య, వైద్యం, ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, నిర్మాణ పనుల స్టాండింగ్ కమిటీలకు జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షత వహించగా, వ్యవసాయం పై వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మహిళా సంక్షేమపై తంగలపల్లి జెడ్పీటీసీ పూర్మాని మంజుల, సాంఘిక సంక్షేమంపై బోయినపల్లి జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ కొండయ్య స్టాండింగ్ కమిటీలకు అధ్యక్షత వహించారు. సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నియంత్రణ, పారిశుధ్య అంశాలపై అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. రహదారులు, మురుగు కాలువలు, నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్య లు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీటిసి లు గట్ల మీనయ్య, చీటీ లక్ష్మణ్ రావు, నాగం కుమార్, కోమిరి శెట్టి విజయ లక్ష్మణ్, ఏష వాణి తిరుపతి,అడిషనల్ కలెక్టర్, జడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రధాన రహదారిపై మండేపల్లి దళితులు ధర్నా



నవతెలంగాణ - తంగళ్లపల్లి : మండేపెల్లిలో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని అలాగే నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని మండేపల్లి దళితులు, గ్రామస్తులు కోరారు. మండలంలోని మండపల్లి గ్రామానికి చెందిన దళితుల భూమిని ప్రభుత్వం ఆక్రమించి ఇతరులకు కేటాయిస్తున్నారని మా భూమి మాకు కేటాయిస్తూ భూమిని కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలంటూ శుక్రవారం మండేపల్లి దళితులు తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై బైటాయించారు. అరగంట పాటు రాస్తారోకో నిర్వహించడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని భూనిర్వాసితులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పి ట్రాఫిక్ పునరుద్ధరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.

మాజీ సర్పంచ్‌లకు పెన్షన్ ఇవ్వాలి



నూతనంగా ఎన్నికైన మాజీ సర్పంచుల ఫోరం మండల కార్యవర్గం

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : మాజీ సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు బొడ్డు దేవయ్య అన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ల ఫోరం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మాజీ సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా దేవుని సుజాత నర్సయ్య, ఉపాధ్యక్షులుగా తీగల దుర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా వాసాల వెంకటరామిరెడ్డి, కోశాధికారిగా చిలివేరి రాజేశ్వరి రాజు, సంయుక్త కార్యదర్శిగా అలువాల సుగుణ లక్ష్మణ్, కార్యదర్శిగా గజ్జెల స్వామి, ముఖ్య సలహాదారులుగా గుర్రం సత్తయ్య, ఆసాని సత్యనారాయణ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బొడ్డు దేవయ్య మాట్లాడుతూ... మాజీ సర్పంచులు ఆర్థికంగా, మానసికంగా కంగిపోయారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మాజీ సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లిన ఏనాడు ప్రభుత్వం స్పందించిన పాపాన పోలేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేదంటే రానున్న ఎన్నికల్లో మాజీ సర్పంచ్ ల సత్త చూపెడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

మహిళా సంఘ భవనానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో మహిళా సంఘ భవనానికి సర్పంచ్ నక్క రేవతి ఆధ్వర్యంలో ఎంపీపీ పడిగల మానస, ఏఎంసీ చైర్మన్ పూసపల్లి సరస్వతి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. రూ.5లక్షల ప్రత్యేక నిధుల ద్వారా మహిళా సంఘ భవనాన్ని నిర్మించనున్నట్లు వారు తెలిపారు. మహిళ ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దుర్గాప్రసాద్,బి ఆర్ ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు మోర నిర్మల, ఏఎంసీ డైరెక్టర్ సద్ద రోజా పాల్గొన్నారు.

కేటీఆర్ పచ్చి అబద్ధాల మంత్రి...

కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కెకె మహేందర్ రెడ్డి



కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వివరిస్తున్న కేకే మహేందర్ రెడ్డి

నవతెలంగాణ - తంగళ్లపల్లి : 'కేటీఆర్ పచ్చి అబద్దాల మంత్రి అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కేకే మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జెండాను కేకే మహేందర్ రెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆ నలుగురి దోపిడీ కొనసాగుతోందన్నారు. అనంతరం గ్రామ ప్రజలకు, కార్యకర్తలకు కాంగ్రెస్ ఇచ్చే ఆరు గ్యారంటీలను ఇంటి ప్రచారం చేస్తూ, అందరిని కలుస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధే ఎజెండా..


డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు



మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ప్రతిమ ఫౌండేషన్ అధినేత

నవతెలంగాణ - కొనరావుపేట : అభివృద్దే తన ఎజెండా అని, ప్రతి గ్రామానికి ప్రతిమ సేవలను అందిస్తున్నామని బీజేపీ స్టేట్ లీడర్ డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. శుక్రవారం కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేసిన వాటర్ ప్లాంట్‌ను డాక్టర్ వికాస్ దీప దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము స్వప్న, ఉప సర్పంచ్ పుంగం గౌడ్, బిజెపి జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మిరియాల్కర్ బాలాజీ, పురుషోత్తం రావు,ప్రభాకర్,శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్ గౌడ్,సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ యువకులను సన్మానం



సన్మానిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ - రుద్రంగి : ఇటీవల విడుదలైన ఫలితాల్లో నలుగురు యువకులు కానిస్టేబుల్‌గా ఉద్యోగాలు సాధించిన సందర్భంగా ఎంపీపీ గంగం స్వరూప మహేష్ ఆధ్వర్యంలో యువకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రుద్రంగి గ్రామానికి చెందిన ఆకుల నవీన్, బాసాని సూర్య ప్రకాష్, తోకల శశిధర్, నేదురీ నవీన్‌లు పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం రుద్రంగి మండలానికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గంగం మహేష్, పితటి గాజుల వేణు, అంబటి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

జగిత్యాల-పెద్దపల్లి

శనివారం అక్టోబర్ 7, 2023 www.navatelangana.com

ప్రొటోకాల్ పాటించకుండా అవమానిస్తున్నారు..

- ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా
- ముత్తారం సర్పంచ్ తూటి రజిత రఫీ

నవతెలంగాణ-ముత్తారం:

మహిళా సాధికారత మాటలకే పరిమితమవుతుందని, ముత్తారం ఎంపీడీవో కలికోట శ్రీనివాస్ మండలంలో ప్రొటోకాల్ పాటించకుండా సర్పంచులను అవమాని స్తున్నారని ముత్తారం సర్పంచ్ తూటి రజిత రఫీ ఆరోపిం చారు. ప్రొటోకాల్ పాటించని ఎంపీడీవోపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. శుక్రవారం ముత్తారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బతుకమ్మ చీరల పంపిణీలో భాగంగా మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయాల్సి ఉండగా, ఎంపీడీవో శ్రీనివాస్ ప్రొటోకాల్ పాటించకుండా మహిళా సర్పంచ్‌నైన తనకు సమాచారం ఇవ్వకుండ అవమానించారన్నారు. అధికార పార్టీ నేతలకు తొత్తుగా వ్యవహరిస్తున్న ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బక్కతట్ల కుమార్ యాదవ్, గాదం శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:

దేశానికి ఆదర్శంగా నిలిచేలా సీఎం కేసీఆర్ తెలంగాణ విద్యావ్యవస్థ మార్చారని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం రామగుండం 21వ డివిజన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సీఎం అల్పాహారం పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చేయని విధంగా మానవీయ కోణంలో ఆలోచించి పేద విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకాన్ని తీసుకు వచ్చిన మనసున్న మారాజు సీఎం కేసీఆర్ అని కొనియడారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జడ్పీటీసీ అమల నారాయణ, కార్పొరేటర్ కౌశిక లత, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి, బొడ్డుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామంలో కోటి 45 లక్షల రూపాయలతో ప్రధాన రోడ్లు, డ్రెయినేజీ ముదిరాజ్ సంఘం భవన నిర్మాణం, జీపీ కార్యాలయం ప్రహరి గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. సీఎం కేసీఆర్ హయంలో పల్లె ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

బిఆర్ఎస్ పార్టీలో 20 యువకుల చేరిక

శుక్రవారం 12వ డివిజన్‌కు చెందిన 20 మంది యువకులు సంతోష్, భగత్ సింగ్, నరేష్, రమేష్, వెంకన్న, వెంకటేష్, తిరుపతి, సదానందంలు బిఆర్ఎస్ నాయకులు బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరగా వారికి కుండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామంలో అభివృద్ధి ప్రారంభించి, బతుకమ్మ చీరలను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు 24గంటల ఉచిత కరెంటు, ఫించన్లు, కళ్యాణ లక్ష్మి, రైతు బంధు, రైతు బీమా పథకాలు వచ్చాయన్నారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. రానున్న



చిన్నారులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఎంపీపీ వాళ్ల అనసూర్య, నాయకులు కౌశిక హరి, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, సర్పంచులు మల్లెత్తుల శ్రీనివాస్, దుర్గం జగన్, లక్ష్మి పతి, కోల లత, ఎంపీటీసీ సభ్యులు సంతపురి ప్రియంకా, గంగాధరి రమేష్, ఉప సర్పంచులు బుట్టి శ్రీకాంత్, మాదాసు పాల్గొన్నారు.

మేరు భవన్‌ను ప్రారంభించిన రామగుండం ఎమ్మెల్యే

42వ డివిజన్ కళ్యాణ్ నగర్ మేరు అధ్యక్షులు కీర్తి నాగరాజు ఆధ్వర్యంలో మేరు భవన్‌ను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించారు. మేరు కులస్తులకు కుట్టుమిషన్ అందజేస్తామన్నారు. రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక రావు, టిఆర్ఎస్ నాయకులు కౌశిక్ హరి, 42 డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్ కుమార్, మేరు సంఘం అధ్యక్షుడు కీర్తి నాగరాజు, ముప్పిడి సత్యప్రసాద్, ఓదెల సర్వం, కే పి ఆర్ స్వామి, మామిడి శెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

రామగుండం నియోజకవర్గం నిరుద్యోగ రహితంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని రామగుండం నియోజకవర్గం లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన కోసం మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన కోసం (టాస్క్)తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన గోదావరిఖని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం లో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. రామగుండం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం మెగా జాబ్ మేళా ద్వారా గొప్ప అవకాశం కలుగుతుందని టాస్క్ చైర్మన్ సి.ఈ.ఓ శ్రీకాంత్ సిన్హా తెలిపారు. మెగా జాబ్ మేళా లో ఈ ప్రాంత నిరుద్యోగ యువత పాల్గొని ఉద్యోగాలను పొందవచ్చున్నారు. కార్యక్రమంలో రామగుండం నగర డిప్యూటీ మేయర్ అభిషేక రావు, నాయకులు కౌశిక్ హరి, టాస్క్ ప్రతి నిధులు ప్రదీప్ రెడ్డి, అనిల్, ప్రసాద్, నారాయణ దాసు మారుతి, పిల్లి రమేష్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మేడిపల్లి



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మేడిపల్లి మండలంలోని గుండ్లపల్లి, కాచారం, పోరుమల్ల, మేడిపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. రూ.10 కోట్లతో 600 ఇండ్ల మంజూరు, రూ.20 కోట్లతో మేడిపల్లి నుండి గోవిందారం వరకు రెండు వరస రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. 50 మంది బీడీ కార్మికులకు పేకేదారులకు పెన్షన్ పత్రాలు, 25 గ్రామాలకు స్పోర్ట్స్ అందజేశారు. అనంతరం బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మి నరసింహారావు, మాజీ మార్కెట్ చైర్మెన్ లోకబాపు రెడ్డి, జిల్లా వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, ఎంపీపీ ఉమాదేవి రాజా రత్నాకర్‌రావు, కేడీసీసీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, మేడిపల్లి సర్పంచ్ క్యాతం వరలక్ష్మి మహేందర్ పాల్గొన్నారు.

2019-2022 డిస్మిస్ కార్మికులకు సర్క్యులర్‌తో అన్యాయం

నవతెలంగాణ-గోదావరిఖని:

పట్టణంలోని జవహర్ నగర్‌లోని సింగరేణి స్టేడియంలో శుక్రవారం 2019 నుండి 2022 వరకు డిస్మిస్ అయిన రామగుండం ఏరియా ఆర్జి-1, ఆర్జీ-2, ఆర్జి-3, శ్రీరాంపూర్ ఏరియా, మందమరి కార్మికులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2019-2022డిస్మిస్ కార్మికుల సర్క్యులర్‌తో తీవ్ర అన్యాయం జరిగిందని, కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తున్న హెచ్ఎంఎస్, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, సిఐటియు, బిఎంఎస్ యూనియన్ సంఘాల నాయకులు మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దుర్గం రాకేష్,మెరుగు రమేష్, మహేందర్, చంటి,కిషోర్, మేదరి శ్రీనివాస్ పలువురు డిస్మిస్ కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

నవతెలంగాణ-గోదావరిఖని:



అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న అధికారులు

రామగుండం నగర పాలక సంస్థ 1వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీ లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు శుక్రవారం కూల్చివేశారు. రోడ్డు , రోడ్డు ప్రక్కన ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనర్ ఆదేశాలతో పట్టణ ప్రణాళికా విభాగం అధికారి తిరుపతమ్మ సిబ్బందితో వెళ్ళి జేసీబీతో అక్రమ నిర్మాణం కూల్చివేశారు. అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ సి. హెచ్. నాగేశ్వర్ హెచ్చరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ముత్తారం:



పరామర్శిస్తున్న మాజీ జడ్పిటిసి

ముత్తారం మండలం హరిపురం గ్రామం కాంగ్రెస్ గ్రామ శాఖ యూత్ అధ్యక్షుడు అనుముల సంపత్ సోదరి కోమలత ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను మాజీ జడ్పిటిసి చొప్పరి సదానందం శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు చేనవెన సాయికుమార్, సీనియర్ నాయకులు బోడ ప్రకాష్ రెడ్డి, కూస రాజయ్య తదితరులున్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ



నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం కార్పొరేషన్ 30వ డివిజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మహిళలకు వచ్చిన బతుకమ్మ చీరలను నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ శుక్రవారం అందజేశారు. ప్రతీ దసరా సందర్భంగా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం చీరలను అందజేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దళిత జర్నలిస్టులకు దళితబంధు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ- పెద్దపల్లి

పెద్దపల్లి నియోజకవర్గంలోని దళిత జర్నలిస్టులకు దళితబంధు పథకంతో పాటు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి మల్లేష్ శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో 30 నుంచి 50 మంది వరకు వివిధ పత్రికలు, టీవీ ఛానల్‌లో దళిత జర్నలిస్టులు ఏళ్ల



కలెక్టర్ వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

తరబడి పని చేస్తున్నారని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన వారికి దళితబంధు వర్తింప చేయాల న్నారు. మంథనిలో జడ్పీ చైర్మన్ పుట్ట మధు, రామగుండంలో ఎమ్మెల్యే కోరు కంటి చెందరు తమ నియోజకవర్గాల్లో దళిత జర్నలిస్టులకు దళిత బంధు పథకం వర్తిం పజేసి మంజూరు చేసినట్టు తెలిపారు. అయితే పెద్దపల్లి నియోజకవర్గంలో మాత్రం స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఇప్పటివరకు దళిత బంధు పథకం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపించలేదన్నారు. దళిత జర్నలిస్టులకు దళిత బంధు పథకంలో జాబితాలో ఎంపిక చేయలేదని దళిత జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యం వివక్షత చూపు తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దళితబంధు కోసం జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవాలని వారిలో అర్హులైన జర్నలిస్టులను గుర్తించి లబ్ధిదారులుగా ఎంపిక చేసి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కన్నం చంద్రమౌళి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ జీలకర్ర రమేష్ ఉన్నారు.

ఏఐటీయూసీ న్యాయ పోరాటంతోనే గుర్తింపు సంఘం ఎన్నికలు

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

నవతెలంగాణ-గోదావరిఖని:



నామినేషన్ దాఖలు చేస్తున్న ఎఐటియుసి నాయకులు

ఏఐటీయూసీ న్యాయ పోరాటంతో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సింగరేణిలో ఈనెల 28న జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో పోటీ చేయడానికి హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆయన యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ ఒంటరిగా హైకోర్టుకు వెళ్లి ఎన్నికలు కేసు వేసిందన్నారు. కోర్టు మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని ఫిబ్రవరి లో తీర్పు ఇచ్చిందని, కానీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుపకుండా ఏమేమో కారణాలు చెప్పి వాయిదా వేస్తే, ఏఐటీయూసీ తిరిగి కోర్టు కు వెళ్ళి కార్మిక శాఖపై ఒత్తిడి తేవడం జరిగిందన్నారు. కేంద్ర కార్మిక శాఖ పలు సార్లు అన్ని కార్మిక సంఘాలతో చర్చలు జరిపితే 14కార్మిక సంఘాలు ఎన్నికలు నిర్వహించాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కు వ్రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశాయని, దీని ఆధారంగానే డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సెప్టెంబర్ 27న ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి యూసఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల బారులు

నవతెలంగాణ-జూలపల్లి :



బారులు తీరిన రైతులు

జూలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జూలపల్లి ఆధ్వర్యంలో యూరియా బస్తాల లారీ రావడంతో ఒక్కసారిగా రైతులు బారులు తీరారు. అధికారులు మాత్రం యూరియా నిలువలు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. కానీ రైతులు యూరియా దొరకడం లేదని ఆవేదన చెందుతున్నారు. వరి పంటకు సరైన సమయంలో యూరియా వేయకపోడంతో పంట తగ్గే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు చొరత తీసుకుని రైతులకు అందుబాటులో యూరియా ఉండేలా చూడాలని కోరుతున్నారు.

చెవిలో పూలతో నిరసన తెలిపిన మధ్యాహ్న భోజన కార్మికులు

నవతెలంగాణ-మల్లాపూర్ : మండల కేంద్రంలో విద్యా వనరుల కేంద్రం వద్ద సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చెవిలో పూలతో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కొత్త మెనూ సవరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరింతవరకు సమ్మె కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సరిత, లక్ష్మి తదితరులున్నారు.

బీఆర్ఎస్‌ది అవినీతి పాలన

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:



కండువా కప్పుతున్న రాజ్‌ఠాకూర్

బిఆర్ఎస్ అవినీతి పాలనతో విసిగి కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక 3వ డివిజన్ న్యూ పోరాటపల్లికి చెందిన ఎన్టీపీసీ టౌన్ ప్రెసిడెంట్ ఎండి.ఆసిఫ్ పాషా, మెరుగు లింగయ్య ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రామగుండం నియోజకవర్గం ఇన్‌చార్జ్ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కుండువాలు కప్పి పార్టీకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ అవినీతి పాలనను అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన వెంటనే చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరేలా ప్రతి ఒక్కరూ విస్తతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహంక్వాలి స్వామి, జిల్ల బీసీ సెల్ సెక్రటరీ మరీదు మురళి కృష్ణ, 3వ డివిజన్ అధ్యక్షులు, ఈదునూరి మల్లేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇనుకొండ నరసింహ రెడ్డి, రాజేశంరమేష్, తిరుపతి, కంది ఆంజనేయులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేసిన సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:



సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎర్లాయీస్ యూనియన్ నాయకులు శుక్రవారం నామినేషన్‌ను దాఖలు చేసింది. యూనియన్ తరుపున సింగరేణి ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఆర్ఎల్‌సి సాహూకు నామినేషన్‌ను యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహ రావు, యూనియన్ నాయకురాలు వి.సుధారాణి సమర్పించారు.

డంపింగ్ యార్డ్‌తో ప్రజల ప్రాణాలకు ముప్పు

నవతెలంగాణ-గోదావరిఖని:



జిఎంకు వినతి అందజేస్తున్న మద్దెల దినేష్

రామగుండం కార్పొరేషన్ గోదావరిఖని గంగానగర్ సమీపంలోని గోదావరి వద్ద డంపింగ్ యార్డ్‌తో చెత్త గుట్టలుగా ఏర్పడి ప్రజల ప్రాణాలకు ముప్పు కలుగుతుందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఆరోపించారు. డంపింగ్ యార్డ్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, సింగరేణి యాజమాన్యం ఖాళీ స్థలాన్ని కేటాయించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఆర్జీ 1 జిఎం చింతల శ్రీనివాస్‌ను కలిసి కోరారు. సింగరేణి సిఅండ్ఎండి, డైరెక్టర్ పాను లేఖ ద్వారా కోరడం జరిగిందని ఆయన తెలిపారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ -మెట్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని పాత బస్ స్టాండ్ వద్ద ఆశా కార్యకర్తలు నిరసనకు దిగారు. ఏండ్లు చాలీచాలని వేతనాలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - మెట్‌పల్లి

కోరుట్లలో మంత్రి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, ఇతర కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి , జగిత్యాల జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అందే మారుతి బాపూజీ , మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మమ్మద్ ముఖీమ్ అన్నారు. రాష్ట ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కులను కలరాస్తోందని మండిపడ్డారు.

పోలీసు ఉద్యోగాలు సాధించిన యువకులకు ఘన సన్మానం



సన్మానిస్తున్న రైతు బంధు మండల అధ్యక్షులు

నవతెలంగాణ-ముత్తారం:

పోలీసు ఉద్యోగాలను సాధించిన ముత్తారం మండల యువకులను ముత్తారం మాజీ ఎంపీపీ, రైతు బంధు మండల అధ్యక్షులు అత్తె చంద్రమౌళి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. లక్కారం గ్రామానికి చెందిన దయ్యాల సంతోష్ ఏఆర్ కానిస్టేబుల్, బిడిద సాగర్ జైల్ శాఖ కానిస్టేబుల్, మంథని అఖిల్ ఆర్మీలో సేలెక్ట్ అయి ట్రైనింగ్ పూర్తి చేసుకొని జమ్ము కాశ్మీర్‌లో విధుల్లో చేరడానికి వెళ్తున్న సందర్భంగా వీరిని ఘనంగా సన్మానించారు. సర్పంచ్ అత్తె లలిత, ఎంపీటీసీ ఒద్ది తిరుమల తిరుపతి, ఉప సర్పంచ్ జంగ తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు స్వరూప సారయ్య, నరేష్, అయిలమ్మ, పోశాలు, గ్రామ శాఖ అధ్యక్షులు మాదాసి రమేష్ పాల్గొన్నారు.

మద్దెల చెరువులో బోటింగ్ ప్రారంభం

నవతెలంగాణ-కోరుట్ల :



బోటింగ్ ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజలకు ఆహ్లాదం కోసం చెరువులో బోటింగ్ ఏర్పాటు చేశారని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. కోరుట్ల పట్టణంలోని మదుల చెరువు మినీ ట్యాంక్ బండ్‌లో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి కలెక్టర్ బోటింగ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, మునిసిపల్ చైర్‌పర్సన్ లావణ్య, పర్యాటక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు గూడ మహేందర్ (35) శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 8 ఏండ్ల క్రితం మహేందర్‌కు హారికతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొన్ని రోజుల నుంచి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్థాపానికి గురైన మహేందర్ తన ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య హారిక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ బి.సమ్మయ్య తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురి అరెస్ట్

నవ తెలంగాణ-రామగిరి



మాట్లాడుతున్న ఎస్ఐ కటికే రవి ప్రసాద్

రామగిరి మండల పరిధిలోని పన్నూరు గ్రామంలో గడ్డం సాయి కుమార్, జక్కుల రాజేందర్, కంది రఘుపతి, మానుపాటి రాజేష్, ఉండంటి రాజ్ కుమార్ ఐదుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తూ రామగిరి పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై కటికే రవి ప్రసాద్ ఆధ్వర్యంలో వారి తనిఖీలు చేయగా అనుమానాస్పదంగా కనిపించిన వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఆయన వెంట మహిళా ఎస్సై దివ్య ఉన్నారు.

తెలంగాణ పథకాలు ఇతర రాష్ట్రాల్లో ఎందుకు లేవు..

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుంకె

నవతెలంగాణ- మల్యాల

తెలంగాణ సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలో గృహలక్ష్మి, ప్రొసీడింగ్స్ ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ఐదేండ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. గతంలో స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా గెలిచి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతం మీద మమకారం ఉండదని, పార్టీలకు అతీతంగా తాను అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. 60 ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేదని, కాంగ్రెస్ ఓటు వేసే అభివృద్ధి శూన్యం అని తెలిపారు.

ఆశాకార్యకర్తల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

నవతెలంగాణ-మల్లాపూర్ : మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజు కొనసాగింది. ఈ సమ్మెకు గల్ఫ్ కార్మికుల నాయకులు పెనుకుల అశోక్ సంఘీభావం తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ..పెరుగుతున్న ధరలకనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషికాలను రూ.18వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో లయ, శిరీష,లావణ్య,స్వప్న, రమ, వసంత,లత,శాంత, రాజేశ్వరి,ప్రేమలత, సరిత పాల్గొన్నారు.

వివేకానందలో ఎన్ఎస్ఎస్‌పై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించినట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్.గోపికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ మాజీ జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కె.మురళి మాట్లాడారు. అనంతరం ఇటీవల నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాపోలు గోపికృష్ణ, కచ్చు సతీష్, ఏసీఓ బి.సంపత్ కుమార్, ఏవో బి.శ్రావణ్ కుమార్, బి.రామేశ్వర రావు, అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

లక్షల్లో బకాయిలు.. అయోమయంలో సర్పంచులు..

- బిల్లుల పేమెంట్ల కోసం ఎదురు చూపులు
- బతుకమ్మ, దసరా ఏర్పాట్లకు నిధుల గండం
- కార్యాలయాల చుట్టు ప్రదక్షిణ
- ఎన్నికల షెడ్యూల్ వెలువడితే ఎట్లాగని ఆవేదన
- ప్రత్యామ్నాయ పనుల్లో సర్పంచులు



ఆటోతో జీవనోపాధి పొందుతున్న సర్పంచ్ మేఘరాజ్

నవతెలంగాణ-గంగాధర

అసెంబ్లీ ఎన్నికలకు రెండు, మూడు రోజుల్లో షెడ్యూల్ వెలువడే అవకాశాలు ఉండడంతో లక్షల్లో రావల్సిన బిల్లుల పేమెంట్ బకాయిలు పెండింగ్ పడే ప్రమాదం నెలకొని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు సద్దుల బతుకమ్మ, దసరా పండుగలు సమీపించగా, మరో వైపు ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే తమ పరిస్థితి ఏంటనే అయోమయం నెలకొంది. లక్షల్లో రావల్సిన బిల్లుల పేమెంట్స్ బకాయిలు ఎప్పుడొస్తాయంటూ సంబంధిత కార్యాలయాల చుట్టు ప్రదక్షిణ చేస్తూ ఆరా తీస్తున్న తీరు ఇది.

గంగాధర మండలంలోని 33 గ్రామ పంచాయతీల పరిధిలోని ఒక్కో జీపీకి 10 లక్షలకు తగ్గకుండా 40 లక్షల వరకుబిల్లులు పేమెంట్ కాకుండా పెండింగ్‌లో ఉన్నాయంటూ సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. జీపీల్లో నిధులు లేకున్నా జిల్లా, మండలాధికారుల ఒత్తిడితో గ్రామాల్లో అనేక రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉండగా, చేసేది లేక ఎంబీ రికార్డులు చేయించుకుని పేమెంట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు అప్పులు చేసి గ్రామ సమస్యలు తీరుస్తుంటే, మరికొందరు అస్తులు అమ్ముకుని ఖర్చులు భరిస్తూ ఆవేదనలో మునిగారు. సద్దుల బతుకమ్మ, దసరా ఏర్పాట్లకు నిధుల గండం ఏర్పడి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తమ పరిస్థితి తయారైందని కలవరపడుతున్నారు.



బతుకమ్మ చీరల మెండి పనిలో సర్పంచ్ అలువాల నాగలక్ష్మి

విడుదలకు నోచని ఎస్ఎఫ్‌సీ, సీనరేజ్, స్టాంప్ డ్యూటీ నిధులు.?

గ్రామ పంచాయతీల పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల విడుదల చేయాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధుల జాడే లేకుండా పోయింది. ఒకటి కాదు..రెండు కాదు.. 20 మాసాలుగా జీపీలకు ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదలే కాలేదు. ఇదేంటని అధికారులను అడిగితే సమాధానం లేకపోగా, కేంద్రం విడుదల చేసే (పీఎఫ్ఎంఎస్) 15 వ ఆర్థిక సంఘం నిధులను తమ ప్రమేయం లేకుండానే డిజిటల్ కీ ద్వారా విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ల ఈఎంఐల పేమెంట్స్‌కు వినియోగిస్తున్నారని సర్పంచులు మండిపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు గ్రానైట్ క్వారీలు గల జీపీలకు పెద్ద మొత్తంలో సీనరేజ్ నిధులు, స్టాంప్ డ్యూటీ నిధులు జమ అయ్యేవి. ఇప్పుడా నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ ఖజానాకు మరల్చుకుంటుంది. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు సీనరేజ్, స్టాంప్ డ్యూటీ నిధులు జీపీలకు జమైన దాఖలాలే లేవు.

సర్కారు తీరుపై సర్పంచుల గుర్రు..

నెల నెల జీపీలకు విడుదల చేయాల్సిన నిధుల జాడే లేకపోగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల పేమెంట్స్ లేక సర్కారు తీరుపై సర్పంచులు గుర్రుగా ఉన్నారు. నిధులు లేకున్నా అధికారులు తమపై ఒత్తిడి పెంచి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తుంటే, బిల్లుల పేమెంట్ లేక అప్పుల బాధతో సతమతం అవుతున్నామని సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా జీపీల్లో నిధుల లేమి కొట్టస్తుంటే, చేపట్టాల్సిన దినసరి పనులకు ఎక్కడి నుండి డబ్బు వెచ్చించేదని సర్పంచులు మదనపడుతున్నారు. మరో వారం లోపు ఎన్నికల షెడ్యూల్ వెలువడితే తమ గతేం కావాలంటూ సర్పంచులు దిగులు చెందుతున్నారు. బిల్లుల పేమెంట్ జరుగక ఆందోళన చెందుతున్న సర్పంచులు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సెగ పెట్టే అవకాశాలు లేకపోలేదనే అంశం జనంలో చర్చానీయాంశంగా మారింది.

-నిరసనల హోరు.. ప్రత్యామ్నాయం వైపు సర్పంచుల చూపు

బిల్లుల పేమెంట్స్ కోసం సర్పంచుల నిరసన హోరు పెరుగగా, సమస్యల నుండి గట్టెక్కేందుకు ప్రత్యామ్నాయం వైపు పరుగెడుతున్నారు. వెంకటాయపల్లి గ్రామంలో చేపట్టిన పలు రకాల అభివృద్ధి పనులకు బిల్లులు పేమెంట్ లేక ఆందోళన చెందిన ఆ గ్రామ సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజ్ ఆటో నడుపుతూ బతుకుదెరువును వెతుక్కున్నారు. ఒద్యారం సర్పంచ్ ములుకుంట్ల సంపత్ సర్పంచ్ పదవితో సతమతం అవుతూ డైయిరీ ఫాంను పెట్టుకుని పాడిగేదలతో సావాసం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కొండన్నపల్లి, కొండాయపల్లి, గట్టుభూత్కూర్, మల్లాపూర్, చర్లపల్లి (ఎన్), బూర్గుపల్లి, నాగిరెడ్డిపూర్‌తోపాటు పలు గ్రామాల సర్పంచులు వ్యవసాయంపై వచ్చే ఆదాయాన్ని జీపీలకు సమస్యల వెచ్చిస్తూ ఉపశమనం పొందుతున్నారు. గర్శకుర్తి సర్పంచు అలువాల నాగలక్ష్మి బతుకమ్మ చీరలను నమ్ముకుని బతుకుదెరువును పొందుతుంటే, ప్రత్యామ్నాయ పనులు లేని సర్పంచ్‌లు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆస్తులు అమ్ముకునే దుస్థితికి చేరారనే ప్రచారం జనంలో జోరుగా సాగుతోంది.

వెంటనే పెండింగ్ బిల్లులు పేమెంట్ చేయాలి

- మడ్లపల్లి గంగాధర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, గంగాధర



గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే పేమెంట్ అయ్యేలా నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది. నిధులు లేకున్నా అధికారులు తమపై ఒత్తిడి పెంచి పనులు చేయించారు. బిల్లులు రాక వచ్చే సద్దుల బతుకమ్మ, దసరా ఏర్పాట్లను చేయలేని పరిస్థితి ఉంది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడే లోపే ప్రభుత్వం ప్రతి జీపీ సర్పంచుకు పేమెంట్ కావల్సిన పెండింగ్ బకాయిలు క్లియర్ అయ్యేలా చేయాలి.

అభివృద్ధి, ఆహ్లాదం, ఆధ్యాత్మికం కలిసి ఉన్నదే కరీంనగర్

- తెలంగాణను తిరిగి ఆంధ్రాలో కలిపేందుకు కుట్ర

- మంత్రి గంగుల కమలాకర్



మంత్రికి స్వాగతం పలుకుతున్న మహిళలు

నవతెలంగాణ - కరీంనగర్

అభివృద్ధి.. ఆహ్లాదం.. ఆధ్యాత్మికం కలిసి ఉన్నదే కరీంనగర్ అని రాష్ట్ర బీసీ సంక్షేమ పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. 25వ డివిజన్ కిసాన్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఎడ్ల సరితఅశోక్‌తో కలిసి అరుంధతి నగర్ ఎల్లమ్మ టెంపుల్ సమీపంలో కోటి 25 లక్షల సాధారణ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గృహలక్ష్మి లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. లక్ష్మీ గణపతి కాలనీ రోడ్ నెంబర్1 వద్ద అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 26వ డివిజన్‌లో కార్పొరేటర్ నక్క పద్మక్రిష్ణతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. 24వ డివిజన్ శివాజీ నగర్ పాల డెయిరీ సమీపంలో కార్పొరేటర్ కుర్ర తిరుపతితో అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. 23వ డివిజన్ సుభాష్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఆర్ష కిరణ్మయి మల్లేశంతో కలిసి హెల్త్ సెంటర్ సమీపంలో శంకుస్థాపన చేశారు. 33వ డివిజన్ భగత్ నగర్‌లో మేయర్ సునీల్ రావుతో కలిసి ప్రభుత్వ పాఠశాలలో సుమారు 7కోట్లతో చేపట్టిన మౌలిక వసతులను ప్రారంభించారు. అనంతరం అదే డివిజన్‌లో చైతన్య యూత్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. 2009, 2014, 2018 ఎన్నికల్లో ఆశీర్వదించి హ్యాట్రిక్ విజయాలు కట్టబెట్టిన ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. 2009లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కిసాన్ నగర్‌లో పర్యటించినప్పుడు ఇక్కడ గుంతలమైన రోడ్లు, దుర్గంధం వెదజల్లే డ్రయినేజీలే కనిపించాయని, సమైక్య పాలనలో మౌలిక సౌకర్యాలు లేక అరిగోస పడ్డ రోజులు గుర్తున్నాయన్నారు. స్వయం పాలనలో కరీంనగర్ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ వేలకోట్ల రూపాయలు విడుదల చేస్తున్నారన్నారు. పచ్చని తెలంగాణను దోచుకునేందుకు ఢిల్లీ పాలకులు మళ్లీ హైదరాబాద్‌లో పాగా వేస్తున్నారని అన్నారు. తెలంగాణను తిరిగి ఆంధ్రాలో కలిపేందుకు బీజేపీ ముసుగులో మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ముసుగులో కేవీపీ, షర్మిలలు తెలంగాణలోకి వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారంతా మన కేసీఆర్‌ను ఓడగొట్టి తెలంగాణను మళ్లీ దోచుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తామని వస్తున్న వారిని చూస్తే భయమేస్తుందని, 50కి పైగా కేసులు, మూడు నెలల జైలు శిక్ష అనుభవించిన వారు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మితో పేదల సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



నవతెలంగాణ - రామడుగు : దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో సొంత జాగా ఉన్న నిరుపేదలకు సొంతింటి కలను సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకంలో సాకారం చేస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్ షానగర్‌లో లబ్దిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలను, కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. లబ్దిదారులకు మూడు విడతల్లో డబ్బు అందుతుందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కరోనాతో రెండేండ్లు వృథాగా గడిచినా రూ.1800కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసానని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి గెలిపించి, స్థానికుడైన తనను మల్లోసారి ఆశీర్వదించి గెలిపిస్తే డబుల్ అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.భాస్కర్, ఎంపీపీ కలిగేటి కవితాలక్ష్మణ్, ఏఎంసీ చైర్మన్ మామిడి తిరుపతి, కొక్కెరకుంట సింగిల్విండో చైర్మన్ వొంటెల మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీవో భాస్కర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితెందర్‌రెడ్డి, నాయకులు మార్కొండ కిష్టారెడ్డి, వంచ మహేందర్‌రెడ్డి, చాడ శేఖర్‌రెడ్డి, బండ అజయ్‌రెడ్డి, గుండి ప్రవీణ్, గుర్రం దేవికరాజశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అల్పాహార పథకం ప్రారంభం



నవతెలంగాణ - మానకొండూర్

మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి కేసీఆర్ అల్పాహార పథకాన్ని ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మెన్ జీవి.రామకృష్ణారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎంపీపీ ముద్దసాని సులోచనశ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఎంపీటీసీలు ఉండింటి సులోచనశ్యామ్సన్, పిట్టల కవితమధు, పాల్గొన్నారు.

మార్కండేయ దేవాలయానికి విరాళం



నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని జంగపల్లి గ్రామ మార్కండేయ దేవాలయం నిర్మాణానికి రాష్ట్ర జాయింట్ యూత్ సంయుక్త కార్యదర్శి, కాంగ్రెస్ నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి (చొక్కారావుపల్లి) రూ.11వేల 16 పద్మశాలి కులస్తులకు అందజేశారు. కార్యక్రమంలో గుంటుక కేశవులు, భూశంకర్, చంద్రమౌళి, ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు తడూరి వంశీకృష్ణరెడ్డి, వరుకోలు వెంకట్, పరిపూర్ణచారి, మహేందర్‌రెడి, పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలి



నవతెలంగాణ - గన్నేరువరం

కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు ఏఐసీసీ ఇన్‌చార్జి క్రిస్టోఫర్ తిలక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ నాయకుల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మోటార్ వాహన చట్టం-2019ని సవరించాలి

ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పున్నం రవి



నవతెలంగాణ - కరీంనగర్ : డ్రైవర్ల మెడకు ఉరితాడులాంటి మోటార్ వాహన చట్టం-2019ని సవరించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పున్నం రవి అన్నారు. ఆల్ ఇండియా ప్రయివేటు రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట రవాణా రంగ కార్మికులు ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ కే.లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి పున్నం రవి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు రవాణా రంగంలో పని చేస్తున్నారని, వీరికి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆటో, గూడ్స్, డ్రైవర్ల పొట్ట కొట్టే పోర్టల్ యాప్, రాపిడో బైక్ యాప్ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రయివేటు డ్రైవర్లకు జీవో నెంబర్ 25ని గెజిట్ చేసి అమలు చేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ఆంధ్ర రాష్ట్రంలో ఇస్తున్నట్లు ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.10,000 ఇవ్వాలని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డ్రైవర్లకు మెడకు ఉరితాడు లాంటి మోటార్ వాహన చట్టం 2019ని సవరించాలన్నారు. టోల్ గేట్ చార్జీలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, గ్రీన్ టాక్స్ రద్దు చేయాలని, ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్ చార్జీలు, పెనాల్టీలు తగ్గించాలని, ప్రమాద బీమా 10 లక్షలు పెంచాలని, కార్మికులు కోరిన చోట అడ్డా స్థలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. బంగారు తెలంగాణ ధనిక రాష్ట్రం అని చెప్పుకునే పాలకులు ఇంతవరకు డ్రైవర్లకు పథకాలు అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు చెలికాని శ్రీనివాస్, లారీ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు ఎంకే ఆరిఫ్ మొయినుద్దీన్, కారు డ్రైవర్స్ నునిగంటి రాజు, శ్రీనివాస్ ఏషియన్ పెయింట్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు దురిసేటి కర్ణాకర్, చొప్పదండి ట్రాలీ యూనియన్ అధ్యక్షులు వంగ సాంబ, శ్రీరామ్ నర్సింగ్గం, ఉండాడి రవి, పూసల యాదగిరి, అమర్ కొండ శంకర్, బుర్ర శేఖర్, వంగ రమేష్, మల్యాల తిరుపతి, కుర్ర తిరుపతి, సాగర్, వంశీ, రాజశేఖర్ మల్లేష్, ఆటో డ్రైవర్లు అంతగిరి నాగరాజు, దయ్యాల శ్రీనివాస్, మహేందర్, సంపత్, నరేష, డ్రైవర్లు పాల్గొన్నారు.

9న పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ - వీణవంక : గొర్రెలు, మేకల పెంపకం దారుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 9న తెలంగాణ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడించనున్నట్టు ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి రవియాదవ్ తెలిపారు. మండలంలోని చల్లూరు గ్రామంలో ఆ సంఘం సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు గుంపుల సంపత్, గుంపుల రాజేందర్, బండి శంకర్, గుంపుల శ్రీనివాస్, బాలయ్య పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంటలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్‌రావు శుక్రవారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీపతి నరేష్, పొనగంటి సారంగం, బిట్ల కళావతిమోహన్, వార్డు ఆఫీసర్ స్వాతి పాల్గొన్నారు. మోత్కులగూడెం గ్రామంలో సింగిల్‌విండో అధ్యక్షుడు పొన్నగంటి సంపత్ పంపిణీ చేశారు. కౌన్సిలర్లు పొనగంటి రాము, పొన్నగంటి శ్రీలత, బిట్ల కళావతి, పొన్నగంటి విజయలక్ష్మి, పొనగంటి సారంగం ఉన్నారు.


నవతెలంగాణ - వీణవంక

మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామంలో వైస్ ఎంపీపీ రాయిశెట్టి లతాశ్రీనివాస్, సర్పంచ్ ఎం.సమ్మిరెడ్డి శుక్రవారం బతుకమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు. తన్నీరు హరీశ్ రావు టీం రాష్ట్ర అధ్యక్షుడు అప్పని హరీశ్, ఉపసర్పంచ్ దుడపాక రాజకొండయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో శుక్రవారం బతుకమ్మ చీరలను సర్పంచ్ మేచినేని నవీన్‌రావు పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి



నవతెలంగాణ - చొప్పదండి : పట్టుదలతో శ్రమించి లక్ష్యాన్ని సాధించాలని చొప్పదండి ఎస్సై ఉపేంద్రచారి, సర్పంచ్ తాళ్లపెల్లి సుజాతశ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలంలోని కొలిమికుంట గ్రామానికి చెందిన సత్తు తిరుపతి, చొక్కల మహేష్ కానిస్టేబుల్ ఫలితాలలో ఎంపికకాగా శుక్రవారం సర్పంచ్ ఆధ్వర్యంలో ఎస్ఐ హాజరై సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోట కోటేష్ పటేల్, ఉపసర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఏపీలో కంటే తక్కువ జీతం ఆశాలకి ఇస్తున్నారు కేటీఆర్..

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్



నవతెలంగాణ - కరీంనగర్

ఏపీలో కంటే తక్కువ జీతం తెలంగాణలో ఆశా కార్యకర్తలకు ఇస్తున్నారు కేటీఆర్ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ విమర్శించారు. శుక్రవారం ఆశాల సమ్మె 12వ రోజు జిల్లా బస్టాండ్ ఎదుట పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థుల పరీక్ష సమయం, ప్రజల కోసం రాస్తారోకో విరమణ చేసి సమ్మె శిబిరం వద్దకు చేరుకుని దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. దేశంలో అందరికంటే ఎక్కువగా జీతాలు ఇచ్చేది తామే అని మంత్రి కేటీఆర్ షాద్‌నగర్, హనుమకొండలో అబద్దాలు చెప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫిక్స్ వేతనం రూ.10వేలు ఇస్తున్నారు, ఇక్కడ ఫిక్స్ వేతనం లేదని, పారితోషికం 5 వేల నుంచి 9000 ఇస్తున్నారు, ఈ గౌరవ వేతనంలో రికార్డ్స్, జెరాక్స్, ఆటో కిరాయి ఖర్చులు పోను ఏం మిగులుతుందని ప్రశ్నించారు. సమస్య పరిష్కారం చేయకపోగా కార్మిక సంఘాలను అవహేళన చేస్తూ అహంకార పూరిత మాటలు మాట్లాడుతున్నారని, కార్మికులకు కష్టం వస్తే రోడ్డు మీద వచ్చి అనేక విజయాలు సాధించిన చరిత్ర మరిచిపోవద్దు అన్నారు. ఎర్రజెండాతోనే అంగన్వాడీ కార్యకర్తలు విజయం సాధించారు, ఆశా కార్యకర్తలు కూడా అదే ఎర్రజెండా కింద విజయం సాధించే వరకు సమ్మె జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా అధ్యక్షులు శారద, నాయకులు పద్మ, శోభ, విజయ లక్ష్మి, రాజమణి, లలిత, శైలజ, పద్మ, శోభ, రజియా, లక్ష్మి, శంకరమ్మ, పరిమిత, స్వరూప, లక్ష్మి సదాలక్ష్మి, సరోజన, సుహాసిని, లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే సర్కారు లక్ష్యం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



విద్యార్థులతో అల్పాహారం చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - గంగాధర : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అల్పాహారం పేరిట పౌష్టికాహారం అందిస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన అల్పాహారం పథకాన్ని గంగాధర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాల డైనింగ్ హాలులో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. నేటి బాలలే రేపటి బావి భారత పౌరువులని, వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాధ్యత గురువులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ మడ్లపల్లి గంగాధర్, కురిక్యాల సర్పంచ్ మేచినేని నవీన్‌రావు, ఎంఈవో వేణుకుమార్, బీఆర్ఎస్ నాయకులు అట్ల శేఖర్‌రెడ్డి, ఆకుల మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాలకు బియ్యం పంపిణీ

నవతెలంగాణ - ఇల్లందకుంట : ఇల్లందకుంట మండలం లక్ష్మాజిపల్లి గ్రామపంచాయతీలో పంపు డ్రైవర్‌గా పని చేస్తున్న చేలిక ఐలయ్య అనారోగ్యంతో చనిపోయాడు. ఆయన కుటుంబానికి ఇల్లందకుంట మండల కమిటీ ఆధ్వర్యంలో 50కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్, మండల అధ్యక్షుడు కొత్తూరు మల్లయ్య, కార్యదర్శి గురుకుంట్ల బాబు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, భద్రయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన వారికి సన్మానం



నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన వీణవంక అనిల్, జనగాం విజయ్, అంబాల హేమ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. వారిని శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి వారి స్వగృహంలో శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎడ్ల ప్రభాకర్‌రెడ్డి, వేనంక లక్ష్మయ్య, కోనయ్య, లక్ష్మారెడ్డి, చిలుకూరు స్వామి, రాయమల్లు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన ఆడేపు మానస (23) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భర్త ఆడేపు రఘు కొన్నిరోజుల నుండి మానసను వేధిస్తుండడంతో తన పుట్టింటికి వెళ్లింది. మానస గొడవ గురించి తల్లిదండ్రులకు చెప్పగా పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందామని చెప్పారు. మానస తమ్ముడు, తల్లి కూలి పని కోసం ముంబయి వెళ్లడంతో శుక్రవారం మానస భర్త రఘు ఫోన్ చేసి తిట్టడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మానస తండ్రి అలువాల మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ - మానకొండూర్ : మానకొండూర్ మండలంలోని సదాశివపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ కందుకూరి వెంకటస్వామి తల్లి కందుకూరి మల్లమ్మ ఇటీవల మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మెన్ జీవి.రామకృష్ణారావు శుక్రవారం పరామర్శించారు. వారి వెంట జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎంపీపీ ముద్దసాని సులోచనశ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ ఆకుల పద్మప్రకాష్, మానకొండూర్ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, తదితరులున్నారు.

కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించిన డీపీఓ

నవతెలంగాణ - హుజురాబాద్

మండలంలోని రాంపూర్ గ్రామంలో కంపోస్టు షెడ్‌ను శుక్రవారం డీపీఓ వీరబుచ్చయ్య పరిశీలించారు. ఆయనవెంట సర్పంచ్ మనోహర్, ఎంపీఓ వి.సురేందర్, పీఎస్ జయేందర్, తదితరులు పాల్గొన్నారు.

'మేనిఫెస్టోలో వైశ్య కార్పొరేషన్ చేర్చాలి'

నవతెలంగాణ - కొత్తపల్లి : కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శ్రీవాసవి ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం చింతకుంట ఆధ్వర్యంలో కాంగ్రెస్ మేనిఫెస్టో తెలంగాణ వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మేనిఫెస్టోలో ముందు వరుసలో వైశ్య కార్పొరేషన్ చేర్చాలని మంథని శాసనసభ్యుడు, తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో చైర్మెన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి మెమోరాండం శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంకణాల అనిల్ కుమార్, గుండా ప్రభాకర్, గట్టు మహేష్, ఆదర్శ్, భూపతి శ్రీనివాస్, తాటిపల్లి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటీ ప్రచారానికి స్పందన..

కొత్త జయపాల్‌రెడ్డికి అపూర్వ స్వాగతం



నవతెలంగాణ - కరీంనగర్

కాంగ్రెస్ నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి ప్రచారానికి మంచి స్పందన వచ్చింది. కరీంనగర్ నియోజకవర్గం నగునూర్‌లో మాజీ సర్పంచ్ పెంచాల లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్, మాజీ మండలాధ్యక్షుడు సాయిళ్ల రాజు, నాయకులు, కార్యకర్తలతో కలసి కొత్త జయపాల్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. గ్రామంలో పలు వీధుల్లో ప్రచారానికి వెళ్లగా స్థానికులు సమస్యలు ఏకరువు పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని భరోసా ఇచ్చారు.

కరీంనగర్ ప్రశాంత్ నగర్ హనుమాన్ దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు కొత్త జయపాల్ రెడ్డి పూజలు చేసి, నగునూర్ వెళ్లి దుర్గామాత దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పు చప్పుళ్ల మధ్య నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటా ప్రచారం చేశారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి..

కాంగ్రెస్‌కు ఒకసారి అవకాశం ఇవ్వండి.. సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని కొత్త జయపాల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రూ.500 లకే గ్యాస్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు 12 వేల ఆర్థిక సాయం ఇలా కాంగ్రెస్ గ్యారెంటీ స్కీమ్‌లను వివరించారు. కార్యక్రమంలో నాయకులు సాయిల్ల రాజు, బత్తిని శ్రీనివాస్ గౌడ్, కొత్తకొండ కొమురయ్య, అచ్చ కనుకయ్య, లింగంపల్లి శ్రీధర్, తాళ్లపల్లి శ్రీనివాస్, కోట రవి, బండారి శ్రీనివాస్, కచ్చు పరశురాం, మల్లపెల్లి నర్సయ్య, వేల్పుల అనిల్ పాల్గొన్నారు.

బిజినెస్

పండగ వేళా.. తగ్గని వడ్డీ రేట్లు



- రుణ గ్రహీతలకు నిరాశ
- కీలక రేట్లు యథాథతం
- ఆర్‌బీఐ నిర్ణయం
- వృద్ధి 6.5 శాతమే
- ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉండొచ్చు : గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రస్తుత పండగ సీజన్ వేళ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గొచ్చని ఆశపడిన వారికి నిరాశనే ఎదురయ్యింది. 6.5 శాతం గరిష్ట స్థాయికి చేరిన రెపో రేట్లను ఈ దఫా అయినా తగ్గిస్తారని రుణ గ్రహీతలు ఎదురు చూశారు. అందుకు భిన్నంగా ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షా వడ్డీ రేట్లను యథాతథంగా నిర్ణయించింది. మరోవైపు అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల్లో బుల్లెట్ పేమెంట్ స్కీమ్ కింద బంగారు రుణాలను రెండింతలు పెంచి రూ.4 లక్షలకు చేర్చడం సానుకూలాంశం. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయాలను శుక్రవారం ఆయన మీడియాకు వెల్లడించారు. రెపో రేటును ఇంతక్రితం స్థాయిలోనే 6.5 శాతంగా నిర్ణయించామన్నారు. ఇందుకు ఎంపీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారన్నారు. రెపో రేటులో మార్పులు చేయకుండా ఉంచడం ఇది నాలుగోసారి. ఆర్‌బీఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య వరుసగా వడ్డీ రేట్లను పెంచింది. ఆరు సార్లలో 2.50 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో వడ్డీ, వాయిదా చెల్లింపులు ఎక్కువై రుణాలు భారం అయ్యాయి. ఈ క్రమంలోనే అనేక మంది గృహ, వాహన, వ్యక్తిగత రుణ గ్రహీతలు ఇకనైనా వడ్డీ రేట్లలో తగ్గుదల ఉండొచ్చని ఈ దఫా ఆశించారు.

"ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేట్ సైతం 6.75 శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి. ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేట్ 6.75 శాతం వద్దే కొనసాగింపు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ 6.5 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చు. సెప్టెంబర్ 29 నాటికి దేశ విదేశీ మారక నిల్వలు 586.9 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం 6.8 శాతంగా ఉంది. వచ్చే ఏడాదికి 5.2 శాతానికి తగ్గవచ్చని అంచనా. నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు అకస్మాత్తుగా పెరిగితే పరిస్థితులను చక్కదిద్దేందుకు సన్నద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది." అని శక్తికాంత దాస్ తెలిపారు.

"వృద్ధి బలంగానే ఉన్నప్పటికీ.. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేటు నిర్ణయాల పరంగా దూకుడును కొనసాగిస్తుండటంతో అంతర్జాతీయంగా కొన్ని అంశాలు ప్రతికూలంగా మారాయి. ద్రవ్యోల్బణాన్ని పరిశీలిస్తునే దాన్ని లక్షిత పరిధిలోకి తీసుకొచ్చేందుకు కట్టుబడి ఉన్నాము. ద్రవ్యోల్బణ లక్ష్యం నాలుగు శాతమే. కూరగాయలు, వంట గ్యాస్ ధర దిగిరావడంతో సెప్టెంబరులో ద్రవ్యోల్బణం తగ్గొచ్చు. 2023- 24లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉండొచ్చని అంచనా. మూడో త్రైమాసికంలో ఆహార పదార్థాల ధరల్లో స్థిరమైన తగ్గుదల నమోదయ్యే సూచనలు లేవు. ప్రస్తుతం 6.8 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం వచ్చే ఏడాదికి 5.2 శాతానికి తగ్గొచ్చు." అని దాస్ అన్నారు.

అర్బన్ కోపరేటివ్ బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి బుల్లెట్ రీపేమెంట్ స్కీమ్ కింద ఉన్న రుణ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచుతూ ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంది. బుల్లెట్ రీపేమెంట్ స్కీమ్‌లో బంగారంపై తీసుకున్న రుణాలకు వడ్డీ, అసలు ఒకేసారి చెల్లించే సదుపాయం ఉంటుంది. సాధారణంగా బంగారంపై రుణాలకు ప్రతీ నెల వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.

రూ.2వేల నోటు మార్పిడికి వెసులుబాటు..!

రూ.2,000 నోటు సాధారణ మార్పిడికి వెసులుబాటు కల్పించారు. ఇంకా మార్కెట్‌లో రూ. 12,000 కోట్ల విలువైన (3.37 శాతం) 2000 నోట్లు చలామణిలో ఉన్నాయని శక్తికాంత దాస్ వెల్లడించారు. పెద్ద నోటు ఉపసంహరణ ప్రకటన తర్వాత ఇప్పటి వరకు 96 శాతానికి పైగా నోట్లు బ్యాంకింగ్‌లోకి తిరిగి వచ్చాయన్నారు. వీటి విలువ రూ.3.43 లక్షల కోట్లుగా ఉందన్నారు. ఇందులో 87 శాతం బ్యాంక్ డిపాజిట్లుగా వచ్చాయని, మిగిలినవి ఇతర నోట్లతో ఎక్స్ఛేంజీ చేసుకున్నారని ఆయన వెల్లడించారు. కాగా.. అక్టోబర్ 8వ తేదీ తర్వాత కూడా ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాల్లో నోట్లను మార్చుకునేందుకు, డిపాజిట్ చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నామని శక్తికాంత దాస్ తెలిపారు. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయన్నారు. రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఈ ఏడాది మే 19న ఆర్‌బిఐ ప్రకటన చేసిన విషయం తెలిసిందే.

విదేశీ శక్తులకు భారత అంతరిక్ష రంగం..!

- ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపు యోచన



న్యూఢిల్లీ : ఇప్పటి వరకు ప్రభుత్వ రంగ సంస్థలు, ఖనిజ వనరులను విదేశీ, ప్రయివేటు శక్తులకు విక్రయిస్తూ వస్తోన్న మోడీ సర్కార్.. తాజాగా భారత అంతరిక్ష రంగంలో కూడా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు వీలుగా నిబంధనలను మరింత సులభతరం చేయాలని యోచిస్తోంది. ఇదే విషయాన్ని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) సెక్రటరీ రాజేష్ కుమార్ వెల్లడించారు. అంతరిక్ష రంగంలో ఎఫ్‌డీఐ నిబంధనలను మరింత సరళీకరించే అవకాశాలున్నాయన్నారు.

కొన్ని రంగాలు సహా దాదాపు అన్నిటిలోనూ ఎఫ్‌డీఐల సరళీకరణలో భారత్ తన లక్ష్యాన్ని చేరుకుందని రాజేష్ కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికే అనేక రంగాల్లో ఎఫ్‌డీఐలకు అవదులు లేకుండా చేశామన్నారు. ఇదే క్రమంలో అంతరిక్ష రంగంలోనూ మార్పులు చేపట్టే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం అంతరిక్ష రంగంలో ఉపగ్రహాల స్థాపనలో మాత్రమే ఎఫ్‌డిఐలకు 100 శాతం అనుమతి ఉంది. ఎఫ్‌డీఐ నిబంధనలను మరింత సడలిస్తే ఇస్రో లాంటి కీలక సంస్థలు నిర్వీర్యం అయ్యే ప్రమాదం లేకపోలేదని నిపుణులు భావిస్తున్నారు.

హక్‌దర్శక్‌తో ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ జట్టు



బెంగళూరు: దేశంలోని ఎంఎస్ఎం ఈ ఔత్సాహికవేత్తలకు మద్దతును అందించడానికి ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, హాక్‌దర్శక్ భాగస్వామ్యం కుదు ర్చుకున్నాయి. సామాజిక, ఆర్థిక సమ్మే ళన సంస్థగా ఉన్న హాక్‌దర్శక్‌తో సం యుక్తంగా పని చేస్తూ..ఆర్థిక అక్షరాస్యత పెంచాలని నిర్దేశించుకున్నట్లు ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ ఎండీ, సీఈఓ ఇట్టిరా డావిస్ పేర్కొన్నారు. రానున్న మూడేళ్లలో సుమారు 15,000 మంది వద్దకు చేరుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు. ఇందుకోసం ఇరు సంస్థలు కలిసి ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించా మని హాక్‌దర్శక్ సీఈఓ అనికేత్ దోగర్ పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి వ్యవస్థాపకులకు సైతం సాధికారతను అందించాలనేది తమ లక్ష్యమన్నారు.

జిఎస్‌టిపై ఎఫ్‌టీసీసీఐ సర్టిఫికెట్ కోర్సు

హైదరాబాద్ : ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసీసీఐ) కొత్తగా జీఎస్‌టీపై సర్టిఫికెట్ కోర్సును నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అక్టోబర్ 12 నుండి నాలుగు వారాల పాటు ప్రతి గురు, శుక్రవారాల్లో శిక్షణ ఉంటుందని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. నవంబర్ 2న ముగుస్తుందని తెలిపింది. నిష్ణాతుల ఆధ్వర్యంలో తరగతులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొంది.

మీడియా స్వేచ్ఛను హరిస్తే ఖబడ్దార్

పాలకుల బెదిరింపులకు భయపడేది లేదు

- జర్నలిస్టుల నిరసన ర్యాలీలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలకులు మీడియా స్వేచ్ఛను హరిస్తే ఖబడ్దార్ అంటూ పలువురు వక్తలు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా ఇలాంటి చర్యలకు పాల్పడటమంటే అది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో న్యూస్‌క్లిక్, వైర్ తదితర మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై జరిగిన దాడులను నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్ర వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. మీడియా స్వేచ్ఛను హరిస్తే ఖబర్దార్, ఢిల్లీ పోలీసుల వైఖరిని ఖండించండి, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుదాం, రాజ్యాంగ హక్కులను గౌరవిద్దాం అంటూ ఈ సందర్భంగా జర్నలిస్టులు నినదించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే), తెలంగాణ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీబీజేఏ)ల నేతృత్వంలో పాత్రికేయులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగాటీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన సభలో సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి, ప్రజాశక్తి మాజీ ఎడిటర్ ఎస్. వినయ్ కుమార్, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, అఖిలభారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారధి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ తదితరులతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ న్యూస్ క్లిక్‌పై రుజువుకు నిలవని, నిరాధారమైన ఆరోపణలు చేసి వారిని అకారణంగా అరెస్టు చేశారని విమర్శించారు.మీడియా అనేది మోడియాగా మారి, పత్రికా స్వేచ్ఛకు భంగం కలుగుతున్న ప్రస్తుత తరుణంలో న్యూస్‌క్లిక్‌పై జరిగిన దాడిని అర్థం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలు రోజురోజుకు హరించుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయ, అమిత్ చక్రవర్తిలను ఎందుకు అరెస్టు చేశారో స్పష్టత ఇవ్వాలన్నారు. కనీసం వారికి ఎఫ్ఐఆర్ కాపీ కూడా ఇవ్వలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాసినా, మాట్లాడినా ఏదో ఒక నెపంతో అరెస్టులు, కేసులు, వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తోందని గుర్తు చేశారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు నిరసనగా జర్నలిస్టులు తమ గళానికి, కలానికి పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ మీడియా మీద, పౌర సంస్థల మీద ఉక్కుపాదం మోపడం సహించారనిదన్నారు. న్యూస్ క్లిక్ పోర్టల్ కార్యాలయంపైన, అందులో పని చేస్తున్న 47 మంది జర్నలిస్టులపైన ఢిల్లీ పోలీసులు దాడులు జరిపిన తీరు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకు సోదాలు జరుపుతున్నారో, ఎందుకు అరెస్టులు చేస్తున్నారో చెప్పకుండా చీకటి రోజులను గుర్తు చేసే విధంగా ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తనకు వ్యతిరేకంగా వార్తా కథనాలు ఇస్తున్నారనే కక్షతో మీడియా సంస్థలను బెదిరించి తన గుప్పిట్లో పెట్టుకునేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నదని ఆరోపించారు. కఠినమైన ఉపా చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నామని చెప్తున్న పోలీసులు ముందుగా ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయడం లేదో చెప్పడం లేదని తెలిపారు. చైనా పెట్టుబడులను బూచిగా చూపి ప్రజాస్వామ్యాన్ని హరిస్తున్నారని విమర్శించారు. కారణం చెప్పకుండా అరెస్టు చేయడం ప్రాథమిక హక్కుకు భంగం కలిగించడమేనన్నారు. మీడియా సంస్థపైన, జర్నలిస్టుల పైన పాలకులు చేస్తున్న దాడులను ఆపకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ 2021 నుంచి ప్రభుత్వానికి చెందిన వివిధ సంస్థలను ఉపయోగించి వరుస చర్యలతో న్యూస్‌క్లిక్‌ను లక్ష్యంగా ఎంచుకున్నారని తెలిపారు. తప్పుడు ఆరోపణలతో వేధిస్తున్నారని విమర్శించారు. పార్థసారథి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వ్యవహారం అప్రజాస్వామికంగా ఉందని చెప్పారు. సాగర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడే వారిపై తప్పుడు ప్రచారం చేయటం కేంద్రానికి అలవాటుగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఈ. చంద్రశేఖర్, తన్నీరు శ్రీనివాస్, హెచ్‌యూజే అధ్యక్ష కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీష్, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నవీన్, రాజశేఖర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఎప్పుడిస్తారు..

సీఎం ప్రకటించి ఆరు నెలలైనా అందని సాయం

- కరీంనగర్ జిల్లా చొప్పదండిలో రైతుల రాస్తారోకో
- వెంటనే పరిహారం అందించాలి : రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణ వెంకటరెడ్డి





నవతెలంగాణ - చొప్పదండి

పంట నష్టపరిహారంపై సీఎం కేసీఆర్ ప్రకటించి ఆరు నెలలు దాటినా అందలేదు.. నష్టపరిహారం ఇంకెప్పుడిస్తారు.. ఆరు నెలలైనా అందలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రంలోని గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద శుక్రవారం రైతులు పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. వారికి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణ వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గం అభ్యర్థి కొంకటి శేఖర్ మద్దతు తెలిపారు. చొప్పదండి సీఐ గోపతి రవీందర్, ఎస్ఐ ఉపేంద్రచారి సిబ్బందితో కలిసి ఘటన స్థలంలో మోహరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఆరు నెలల కిందట చొప్పదండి మండలంలో వడగండ్ల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గంలో పర్యటించి పదివేల పంట నష్టపరిహారం అందించాలని అధికారులను ఆదేశించగా, సర్వే చేసిన అధికారులు నివేదిక పంపించారని చెప్పారు. ఆరు నెలలు అవుతున్నా పరిహారం అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చొప్పదండి మండల వ్యవసాయ అధికారి వి.వంశీకృష్ణ, సీఐ రవీందర్ రైతులతో మాట్లాడారు. అధికారులతో చర్చించి పరిహారం అందేలా చూస్తామని చెప్పారు. ఈ క్రమంలో అధికారులకు రైతులకు మధ్య కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది. రైతులు, నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇప్ప శ్రీనివాసరెడ్డి, కనుమల్ల రాజశేఖర్, కళ్ళపెల్లి అరవింద్, రైతు సంఘం నాయకులు గుర్రం రవీందర్‌రెడ్డి, నూనె శేఖర్, రాజన్నల తిరుపతి, సంబోజీ సునీల్, నెట్టు శ్రీనివాస్, పెద్ది వీరేశం, నూనె చందు, ఒగ్గు లింగయ్య, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



మీడియాపై దాడిని ఆపాలి..

- ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి
- నారాయణగూడ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావ్యతిరేక కార్యక్రమాలను నిరంతరం ఎండగడుతూ ప్రజలకు చేరువ చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాపై బీజేపీ ప్రభుత్వం దాడులను ఆపకపోతే ఉద్యమాలు చేపడతామని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి అన్నారు. న్యూస్‌క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిని ఢిల్లీ పోలీసులు క్రూరమైన ఉపా ఆరోపణలను ఉపయోగించి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం నారాయణగూడ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీలో పలువురు జర్నలిస్టుల ఇండ్లపై 'రైడ్' చేసి ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకోవడం దారుణమన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారతదేశం స్థానం దిగజారడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నాలుగో స్తంభంగా సూచించబడే మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వ దిక్కుమాలిన చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పి అధికార అహంకారాన్ని దించుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, నాయకులు రమ్య, నాగేందర్, రమేష్, ప్రశాంత్, భారత్, చరణ్‌శ్రీ, శివ, శ్రీరామ్ పాల్గొన్నారు. మీడియాపై ఆంక్షలు విధించడం హేయమైన చర్య అని.. పత్రిక స్వేచ్ఛపై కేంద్రం దాడిని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా వద్ద కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు.

మరుగుజ్జులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

- ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మరగుజ్జు వికలాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన మంత్రి కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ కమిషనర్ సుమోటగా కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ అహంకార పూరితంగా మాట్లాడారనీ, వికలాంగులకు క్షమాపణ చెప్పకపోతే..జిల్లా పర్యటనలలో తమ నిరసనను తెలపాలని సూచించారు. రాజకీయ విమర్శల సందర్భంగా అంగవైకల్యాన్ని కించ పరుస్తూ మాట్లాడటం సంస్కారం కాదని తెలిపారు. గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ప్రతిపక్ష పార్టీల నాయకులను విమర్శిస్తూ 'సమ ఉజ్జీలతోనే మా పోటీ... మరగుజ్జులతో కాదు' అంటూ మరగుజ్జు వికలాంగుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడటం విజ్ఞత కాదని హితవు పలికారు. ఇది కేటీఆర్‌కు పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తు చేశారు. చట్టాలను గౌరవించాల్సిన వారే వికలాంగులను కించపరిచే విధంగా మాట్లాడటమేంటని ప్రశ్నించారు. వికలాంగుల హక్కుల చట్టం - 2016 - సెక్షన 92 (ఎ) ప్రకారం వైకల్యం గల ఏ వ్యక్తినైనా కించపరిచే ఉద్దేశంతో, ఏ స్థలంలోనైనా, బహిరంగంగానైనా ఉద్దేశ పూర్వకంగా అవమానించినా, భయపెట్టినా చట్ట రీత్యా నేరం అవుతుందని గుర్తు చేశారు. వారికి కనీసం ఆరు నెల్లనుంచి ఐదేండ్ల వరకు జైలు శిక్ష, జరిమానా వర్తిస్తున్నదని తెలిపారు.

అమెరికా ప్రతినిధుల సభ

స్పీకర్ తొలగింపు - పర్యవసానాలు



న్యూయార్క్:అమెరికా చరిత్రలో మొట్ట మొదటి సారి ప్రతినిధుల సభ స్పీకర్‌ను పదవి నుంచి తొలగించింది. రిపబ్లికన్ పార్టీకి చెందిన కెవిన్ మెకార్థీ ప్రతినిధుల సభ స్పీకర్‌గా తొమ్మిది నెలల క్రితమే ఎన్నికయ్యారు. మెకార్థీ పదవీచ్యుతుడు కావటానికి ప్రధాన కారణం సొంత పార్టీకే ప్రాతినిధ్యంవహిస్తున్న మట్ గెయిట్జ్. మెకార్థీని తొలగింపుకుగాను ఓటింగ్ జరగటానికి ముందు ఆయన తొలగింపు ఆవశ్యకతను గూర్చి సోషల్ మీడియాలో మట్ గెయిట్జ్ తీవ్ర ప్రచారం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రతిష్టంభన(షట్ డౌన్) సమస్యను అధిగమించేందుకు ప్రతినిధుల సభ ఆమోదించవలసిన ప్రభుత్వ వ్యయంలో ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న సహాయాన్ని కూడా కలపటం కోసం మెకార్థీ ప్రతిపక్ష డెమోక్రాట్లతో రహస్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడని గెయిట్జ్ ఆరోపిం చాడు. అమెరికా రుణ సంక్షోభం గురించి ఆయన మాట్లాడాడు. మెకార్థీ తన పార్టీ కే అబద్దాలు చెబు తున్నాడని, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అవినీతి పై విచారణ జరపటానికి మెకార్థీ ఏమాత్రం ఆసక్తి చూపటం లేదని కూడా గెయిట్జ్ ఆరోపించాడు. ఈ కారణాలచేతనే మెకార్థీని స్పీకర్ పదవి నుంచి తప్పించవలసి వచ్చిందని ఆయన అన్నాడు.

అయితే ప్రతినిధుల సభలో ప్రతిపక్షమైన డెమోక్రాట్లు మెకార్థీని రక్షించటానికి ప్రయత్నించ లేదు. ఓటింగ్‌లో 208మంది డెమోక్రాట్లు మెకార్థీని వ్యతిరేకించారు. ప్రతినిధుల సభలో 216-210 ఓట్లతో మెకార్థీ తన పదవిని కోల్పోయాడు. కనీసం ఎనిమిది మంది రిపబ్లికన్ ప్రతినిధులు తమ పార్టీ ప్రతినిధి, స్పీకర్ మెకార్థీకి వ్యతిరేకంగా ఓట్లు వేశారు. (ఐదుగురు ఓటు వేసినా సరిపోతుంది). పైకి ఇది రిపబ్లికన్ పార్టీలో ఏర్పడిన సంక్షోభంగా కనపడుతుంది. ఒకవేళ ప్రభుత్వం షట్ డౌన్ అయితే, చట్టాల ఆమోదం ప్రక్రియ స్తంభిస్తే, ఆర్థిక వ్యవస్థ మరింతగా కుదేలయితే డెమోక్రాట్లకు వీటన్నిటినీ ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీమీదకు తోసే అవకాశం వస్తుంది. అయితే ఉక్రెయిన్‌కు చేస్తున్న వందల బిలియన్ల ఆర్థిక, ఆయుధ సహాయాన్ని ముగించటానికి ఈ సంక్షోభాన్ని రెండు పార్టీలు కలిసి వాడుకునే సాధ్యత కూడా ఉంది. ఉక్రెయిన్‌లో పెచ్చు మీరిన అవినీతి కారణంగా ఆ దేశానికి అపరిమితంగా చేస్తున్న సహాయాన్ని కొనసాగించ జాలమనే ఆలోచన అధ్యక్ష భవనంకు ఉందన్న సమాచారాన్ని గూఢచార వర్గాలు లీక్ చేశాయి. అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న సంవత్సరంలో ఉక్రెయిన్ కు వందల కోట్ల డాలర్ల సహాయం చేయటంపైన తీవ్రతరమౌతున్న బేధాభిప్రాయాల ప్రభావం అమెరికా రాజకీయాలపైన ఉంటుంది.

ఈలోపు ఈ రాజకీయ నాటకంలో ఎవరి పాత్రలను వారు పోషిస్తున్నారు. ఒకవైపు డెమోక్రాట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ అనుకూల ధోరణిని ప్రదర్శిస్తున్నారు. 'ఆటలు ఆపి' ఉక్రెయిన్‌కు కావలసిన అదనపు 24బిలియన్ డాలర్ల సహాయాన్ని ఆమోదించాలని బైడెన్ అమెరికన్ కాంగ్రెస్‌ను డిమాండ్ చేశాడు. ఈ సహాయాన్ని ఆమోదిస్తే ఉక్రెయిన్‌కు అమెరికా ఇప్పటివరకు 137బిలియన్ డాలర్ల సహాయం అందించినట్టు అవుతుంది. ఈ నేపథ్యంలో బైడెన్‌కు, ఇతర డెమోక్రాట్లకు ప్రజామోదం 30శాతంకంటే తక్కువగా ఉంటోంది. అమెరికన్ కాంగ్రెస్ లోని ప్రతినిధుల సభకు ఎవరు స్పీకర్ అవుతారనే విషయంపైన అనేక పుకార్లు ఉన్నాయి. అమెరికన్ రాజ్యాంగాన్ని అనుసరించి ప్రతినిధుల సభకు స్పీకర్ కావటానికి సాంకేతికంగా సభలో సభ్యుడు కానవసరం లేదు. డోనాల్డ్ ట్రంప్‌ను స్పీకర్‌గా చేయటమూ ఒక సాధ్యత అనే పుకారు ఉంది. ఏమైనప్పటికీ ఉక్రెయిన్‌కు అమెరికా అపరిమితమైన సహాయాన్ని అందించే పరిస్థితి ఉండకపోవచ్చు.

బీఆర్ఎస్‌లో చేరిన మెదక్ డీసీసీ అధ్యక్షులు కె.తిరుపతిరెడ్డి

- కండువా కప్పి ఆహ్వానించిన కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు సమక్షంలో మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షులు కె.తిరుపతిరెడ్డి చేరారు. ఆయనకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..పదేండ్లుగా కాంగ్రెస్ పార్టీని మెదక్ జిల్లాలో బలోపేతం చేసేందుకు శాయశక్తులా కృషి చేశానన్నారు. ఆ పార్టీ తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్‌లో పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులకు కాకుండా పారాషూట్ లీడర్లకి, డబ్బుల సంచులతో వచ్చే వారికి మాత్రమే టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ తరుణంలోనే ఆ పార్టీని వీడి ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న సీఎం కేసీఆర్ నాయకత్వంలో పనిచేసేందుకు బీఆర్ఎస్‌లో చేరానని తెలిపారు. మెదక్ జిల్లాలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతారని చెప్పారు. మెదక్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ..పార్టీ కోసం కష్టపడిన తిరుపతిరెడ్డి లాంటి నాయకులను కాంగ్రెస్ బలవంతంగా బయటకు పంపించిందని విమర్శించారు.

చమురు సరఫరాలో

కోతలను కొనసాగిస్తున్న సౌదీ అరేబియా, రష్యా



మాస్కో :చమురు ఉత్పత్తిలోను, ఎగుమతుల్లోను ఈ సంవత్సరం చివరిదాకా స్వచ్ఛందంగా విధించుకున్న కోతలను కొనసాగిస్తామని సౌదీ అరేబియా, రష్యా ప్రకటించాయి. చమురు ఉత్పత్తిదారుల ఒపెక్ ప్లస్ గ్రూపులో ప్రధాన చమురు ఉత్పత్తిదారులైన ఈ దేశాలు వేరువేరు ప్రకటనలు చేశాయి. ఒపెక్ ప్లస్ గ్రూపుకు చెందిన మినిస్టీరియల్ మానిటరింగ్ ప్యానల్ ఆన్‌లైన్‌లో సమావేశమవటానికి ముందు ఈ ప్రకటనలు వెలువడ్డాయి.


సౌదీ అరేబియా తాను చేస్తున్న ఉత్పత్తిలో రోజుకు 10లక్షల బారెల్స్ ముడి చమురును తగ్గించుకుంటుందని ప్రకటించింది. నవంబర్, డిసెంబర్‌లో రోజుకు దాదాపు 90లక్షల బ్యారెల్స్ ముడిచమురును ఉత్పత్తి చేసినట్టు సౌదీ అరేబియా ఎనర్జీ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉత్పత్తి చేసే క్రమంలో రోజుకు 10లక్షల బ్యారెల్స్ ముడిచమురు కోత అమలయ్యేలా చేస్తామని సదరు సౌదీ మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే సంవత్సరం చివరిదాకా రోజుకు 3లక్షల బ్యారెల్స్ ముడి చమురును తన ఎగుమతుల్లో కోతను విధిస్తామని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ ప్రకటించాడు. మార్కెట్ ను విశ్లేషిస్తూ పైన వివరించినట్టు ముడి చమురు ఎగుమతులలో కోతను అమలు చేస్తామని ఆయన చెప్పాడు. గత సంవత్సరం ఏప్రిల్ నెలలో ప్రకటించినట్లు రష్యా తన చమురు ఎగుమతిలో 5శాతం అంటే రోజుకు 5లక్షల బ్యారెల్స్ ముడిచమురును తగ్గించుకుంటుంది. ఈ తగ్గింపు మార్చి నుంచి సంవత్సరాంతంవరకూ కొనసాగుతుందని నొవాక్ వివరించాడు.

పెట్రోలియం ఎగుమతి చేస్తున్న దేశాల సంస్థ(ఒపెక్), రష్యాతోసహా దాని మిత్రదేశాలు తమ చమురు ఉత్పత్తిని ప్రపంచ డిమాండ్‌లో 2శాతాన్ని గత నవంబర్ నుంచి 2023వ సంవత్సరాంతం దాకా తగ్గించుకోవటానికి అంగీకరించాయి. ఆ తరువాత ఈ గ్రూపు తన కోతలను 2024దాకా కొనసాగించటానికి అంగీకరించింది. జులై నెలలో సౌదీ అరేబియా, రష్యా తమ చమురు సరఫరాలో కోతలను విధిస్తున్నట్టు ప్రకటించిన తరువాత ప్రపంచ మార్కెట్ లో చమురు ధర బ్యారెల్ కు 76డాలర్ల నుంచి వర్తమానంలో 89డాలర్లకు పెరిగింది.

కరీంనగర్
11
శనివారం
7 అక్టోబర్ 2023
నవతెలంగాణ మానవి
www.navatelangana.com

పెండ్లై పిల్లలు పుట్టిన తర్వాత ఆ పిల్లలను చూసుకోవల్సిన బాధ్యత ఎవరిది. తల్లిదండ్రులది అవుతుంది. కానీ కేవలం తల్లికి మాత్రమే సంబంధించిన విషయంగా చూస్తున్నారు. పెండ్లి తర్వాత విడాకులు తీసుకుంటే ఇక పూర్తిగా తల్లిపైనే ఆ భారం పడుతుంది. భర్త మాత్రం ఎలాంటి బాధ్యతలు లేకుండా హాయిగా తీరుగుతుంటాడు. కనీసం అతన్ని ప్రశ్నించేందుకు కూడా వీలు లేదు. సమాజంతో పాటు కుటుంబ సభ్యులు కూడా పిల్లల బాధ్యత తల్లిదే అంటారు. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్.

బాధ్యత లేని భర్తతో ఎలా..?



ఐద్వా అదాలత్

ఫాతిమాకు సుమారు 40 ఏండ్లు ఉంటాయి. ఆమె భర్త నజీర్ మొదటి నుండి సరిగ్గా పనికి వెళ్ళేవాడు కాదు. మొదట్లో ఉమ్మడి కుటుంబంలో ఉండేవారు. అప్పుడు సమస్యలు పెద్దగా తెలిసేవి కావు. పిల్లలు పెరిగే కొద్ది సమస్యలు కూడా పెరిగాయి. అత్తామామ తినడానికి ఎలాంటి లోటూ చేసేవారు కాదు. కానీ పిల్లల చదువు, వారి అవసరాలు, అనారోగ్యం వస్తే ఆస్పత్రికి తీసుకు వెళ్ళాలన్నా దేనికీ ఆమె వద్ద పైసా ఉండేది కాదు. అలాంటి అవసరాల కోసం పుట్టింటిపై ఆధారపడేది. రాను రాను పరిస్థితి మారిపోయింది. ఫాతిమా వాళ్ళ నాన్న చనిపోయారు. దాంతో ఆర్థిక సమస్యలు మొదలయ్యాయి. వాళ్ళ మామయ్య ఉద్యోగం నుండి రిటైర్ అయ్యాడు. ఆయనకు వచ్చే ఆదాయం కూడా తగ్గిపోయింది. ఆయనకు పెండ్లి కావల్సిన ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. దాంతో మామ 'నాకు వచ్చే డబ్బు మొత్తం మీ ఖర్చులకు వాడితే నా పిల్లల పెండ్లి ఎలా చేస్తాను. మీరు వేరుగా ఉండండి' అని చిన్న షాప్ పెట్టిచ్చాడు.

కానీ నజీర్ దాన్ని కూడా సరిగ్గా నడిపించలేకపోయాడు. చివరకు అమ్మేశాడు. దాంతో పరిస్థితి దారుణంగా తయారయింది. ఫాతిమా కంపెనీలో పనికి వెళ్ళేది. ఇలాంటి సమస్యల మధ్య మామకు గుండె ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. ఆయన దాచుకున్న డబ్బు మొత్తం ఆస్పత్రి ఖర్చులకే అయిపోయాయి. ఇలాంటి గడ్డు స్థితిలో నజీర్ భార్యా, పిల్లల్ని వదిలేసి ఎటో వెళ్ళిపోయాడు. పోలీస్ స్టేషన్లో కంప్లెయింట్ ఇచ్చారు. అయినా ఫలితం లేదు. అతనికి ఎప్పుడు ఇష్టం వుంటే అప్పుడు వచ్చిపోతుండేవాడు. వచ్చినప్పుడు కూడా భార్య పిల్లల్ని విపరీతంగా కొట్టేవాడు. ఇలా ఐదేండ్లు గడిచిపోయాయి. ఫాతిమా పని చేసే చోట దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండేది. దాంతో ఆమె ఆరోగ్యం దెబ్బతింది. 'నేను చనిపోతే నా పిల్లల పరిస్థితి ఏమిటి' అని భయం పట్టుకుంది. ఇదే విషయాన్ని అత్తమామలకు చెప్పింది. వాళ్ళూ ఏమీ చేయలేక నజీర్ వచ్చినప్పుడు పెద్దమనుషుల్లో పంచాయితీ పెట్టారు. 'నాకు ఆమె వద్దు. విడాకులు ఇచ్చేస్తాను. పిల్లలతో కూడా నాకు ఎలాంటి సంబంధం లేదు' అని చెప్పి అతను వెళ్ళిపోయాడు. ఇలాంటి పరిస్థితుల్లో తెలిసిన వాళ్ళు చెబితే ఫాతిమా ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

నజీర్‌ను, అతని కుటుంబ సభ్యులను కూడా పిలిపించి మాట్లాడాం. 'నువ్వు భార్యా పిల్లల్ని వదిలిపెట్టి బాధ్యత లేకుండా తిరుగుతున్నావు. పైగా పిల్లలతో నాకు ఎలాంటి సంబంధం లేదంటున్నావు. విడాకులు ఇస్తానంటున్నావు. విడాకులు ఇవ్వడమంటే అంత తేలికనుకుంటున్నావా? ఐదుగురు పిల్లల బాధ్యతను భార్యపై వేశావు. ఫాతిమా ఏమీ చేయలేదని నీ ఇష్టం వచ్చినట్టు చేస్తున్నావు. దీని వల్ల నువ్వు చాలా నష్టపోతావు. బాగా ఆలోచించుకొని నిర్ణయం తీసుకో. సంపాదన లేకపోతే ఎవ్వరూ నీకు విలువ ఇవ్వరు. ఓ మనిషిగా కూడా చూడరు. తాగి తాగి నీ ఆరోగ్యం పాడైతే చూసే దిక్కులేక అల్లాడిపోతావు. అనవసరంగా సమస్యలు తెచ్చుకోకు. ఇప్పుడు ఫాతిమాకు అండగా మేమున్నాము. అవసర మైతే పోలీస్ స్టేషన్ వరకు వెళతాం. నిన్నేం చేయాలో మాకు బాగా తెలుసు. ఇప్పటికైనా మారి నీ బాధ్యతలు తెలుసుకో. భార్యా పిల్లల్ని చక్కగా చూసుకో. ఏదైనా పని చేసి డబ్బు సంపాదించు. అప్పుడు నీ విలువ ఎంత పెరుగుతుంతో నీకే తెలుస్తుంది' అని హెచ్చరిస్తున్నట్టు గట్టిగా మాట్లాడాము.

దాంతో అతను కాస్త భయపడ్డాడు. తన తప్పు తెలుసుకుని 'ఇకపై నేను కూడా పని చేసుకుంటాను. నా భార్యాల్ని చూసుకుంటాను' అన్నాడు. 'ఇవన్నీ మాటల్లో కాదు, చేతుల్లో చూపించు అప్పుడు నమ్ముతాం' అని చెప్పి పంపించాము. ఐదుగురు పిల్లల్లో మేమే మాట్లాడి ముగ్గురిని హాస్టల్లో చేర్పించాం. మేము ఆ బాధ్యత తీసుకునే సరికి తనని ఎక్కడ పోలీస్ స్టేషన్లో అప్పగిస్తామో అనే భయంతో ఫైనాన్స్‌లో నజీర్ ఆటో తీసుకుని నడిపించడం మొదలుపెట్టాడు. ఫాతిమా వాళ్ళ అత్తయ్య వాళ్ళ ఇంటి దగ్గర్లో చిన్న ఇల్లు అద్దెకు తీసుకుంది. పక్కనే ప్రభుత్వ ఆస్పత్రి ఉంది. అక్కడ చికిత్స తీసుకుంది. ఇప్పుడు ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే వుంది. అదే ఆస్పత్రిలో చిన్న ఉద్యోగంలో చేరింది. వాళ్ళ మధ్య గొడవలు కూడా తగ్గిపోయాయి. మిగిలిన ఇద్దరు పిల్లల్ని కూడా హాస్టల్లో వేయడానికి మాట్లాడుతున్నారు.

ఆర్థిక పరిస్థితి బాగుంటే అన్ని బంధాలు బాగుంటాయని సంపాదించడం మొదలుపెట్టిన నజీర్‌కు తెలిసొచ్చింది. పని చేయకముందు అతన్ని ఎవ్వరూ పలకరించే వారు కాదు. బాధ్యత లేకుండా భార్యా పిల్లలను వదిలేసి తిరుగుతు న్నాడని అందరూ అతన్ని తిట్టేవారు. అలాం టిది ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపో యింది. ఆటో నడిపిన డబ్బును భార్యకు ఇస్తున్నాడు. పిల్లల్ని కూడా బాగా చూసు కుంటున్నాడు. తాగడం మాత్రం పూర్తిగా తగ్గించలేదు. కానీ ముందులా కాకుండా చాలా వరకు తగ్గించాడు. మరో రెండేండ్లల్లో పూర్తిగా మానేస్తాను అని మాకు మాట ఇచ్చాడు. భర్తలో వచ్చిన మార్పుకు ఫాతిమా చాలా సంతోషంగా ఉంది.

- వై. వరలక్ష్మి
9948794051

సంపాదన లేకపోతే ఎవ్వరూ నీకు విలువ ఇవ్వరు. ఓ మనిషిగా కూడా చూడరు. తాగి తాగి నీ ఆరోగ్యం పాడైతే చూసే దిక్కులేక అల్లాడిపోతావు. అనసరంగా సమస్యలు తెచ్చుకోకు. ఇప్పుడు ఫాతిమాకు అండగా మేమున్నాము. అవసర మైతే పోలీస్ స్టేషన్ వరకు వెళతాం. నిన్నేం చేయాలో మాకు బాగా తెలుసు. ఇప్పటికైనా మారి నీ బాధ్యతలు తెలుసుకో. భార్యా పిల్లల్ని చక్కగా చూసుకో. ఏదైనా పని చేసి డబ్బు సంపాదించు. అప్పుడు నీ విలువ ఎంత పెరుగుతుంతో నీకే తెలుస్తుంది



ఇంట్లో ఉండాల్సిన మొక్కలు

ఇంట్లో పెంచుకునే మొక్కల్లో కొన్ని అద్భుతమైనవి ఉన్నాయి. మన మెదడును చురుగ్గా ఉంచే శక్తి మొక్కలకు ఉంది. మనల్ని రకరకాల వ్యాధుల నుంచి కాపాడతాయి. అవి మనకు మంచి ఆక్సిజన్ ఇవ్వడమే కాదు శరీరం లోపల విష వ్యర్థాల్ని తరిమేసి ఆరోగ్యాన్ని పెంచుతాయి. తులసి మొక్క ఎంత మంచిదో మనకు తెలుసు. దాని నిండా ఔషధ గుణాలే. అలాంటివే మరికొన్ని ఉన్నాయి. అవి మనం తినే ఆహారానికి సువాసన, రుచి అందిస్తాయి. వాటిని నిత్యం వాడుతూ ఉంటే... అనేక సమస్యలు దూరమవుతాయి. అలాంటి ఐదు మొక్కల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



స్టివియా... : పంచదారను ఎక్కువగా వాడితే బరువు పెరుగుతాం. దీనివల్ల షుగర్ వచ్చే ప్రమాదం ఉంటుంది. ఈ స్టివియా మొక్కను పంచదార బదులు వాడొచ్చు. ఇది ఇళ్లలోనే పెరుగుతుంది. టీ పెట్టుకునే టప్పుడు కొన్ని ఆకుల్ని తీసుకొని టీలో వేస్తే చాలు. టీపొడితో పాటూ ఇవీ మరిగి తీపిని అందిస్తాయి. పైగా ఈ ఆకులు కీళ్ల నొప్పులు, గుండెజబ్బుల నుంచి కాపాడతాయి. ముసలితనాన్ని అడ్డుకుంటాయి. దంతాల్ని కాపాడతాయి. నోట్లో బ్యాక్టీరియా ఉంటే అస్సలు ఊరుకోవు.



క్రెస్ : ఈ మొక్క చాలా వేగంగా పెరుగుతుంది. రెండు వారాల్లోనే బోలెడు మొక్కలు, ఆకులు వస్తాయి. వీటిని కూరల్లో వాడితే మన కంటి చూపు మెరుగవుతుంది. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. కాన్సర్‌ని ఈ మొక్కలు అడ్డుకుంటాయి. దంతాలు, చిగుళ్లను కాపాడతాయి. ఈ మొక్కల ఆకుల్ని జ్యూసులు, సలాడ్లు, పాస్తాలు... ఇలా తినేవాటిలో వేసుకుంటే సరి.. ఆరోగ్యం సంగతి అదే చూసుకుంటుందట.



బ్లడీ సోరెల్ : ఈ ఆకులపై ఆకారాలు మన బాడీలోని ధమనులు, సిరల్లా కనిపి స్తాయి. అందుకే... ఈ మొక్కకు బ్లడీ సోరెల్ అనే పేరు పెట్టారు. ఈ మొక్కలు మధ్య ఆసియా దేశాలు, గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా ఉంటాయి. ఈ ఆకులు బీపీని నియంత్రిస్తాయి. చర్మాన్ని తేమగా ఉంచుతాయి. బాడీలో విష వ్యర్థాల్ని తరిమి కొడతాయి. వీటిలో విటమిన్ ఏ, సీ, మెగ్నీషియం ఉంటాయి. ఈ ఆకుల్ని శాండ్‌విచ్, సూప్స్, జ్యూసుల్లో, కూరల్లో వాడేస్తే సరి.



హిసోప్ ప్లాంట్ : ఔషధ మొక్కల్లో దీన్ని క్వీన్ అని చెప్పుకోవచ్చు. పూర్వకాలం నుంచి దీన్ని మందుల్లో వాడుతున్నారు. ఈ మొక్క మన చుట్టుపక్కల వాతా వరణాన్ని క్లీన్ చేస్తుందని చెబుతారు. ఈ మొక్క ఆకులు మన జీర్ణ వ్యవస్థను బాగు చేస్తాయి. శ్వాస బాగా ఆడేలా చేస్తాయి. ఈ ఆకులు యాంటీసెప్టిక్, యాంటీబయోటిక్‌గా పనిచేస్తాయి. కండరాల నొప్పిని పోగొడతాయి. ఇలా ఈ మొక్క ఆకుల వల్ల చెప్పలేనన్ని ఆరోగ్య లాభాలున్నాయి. మీరు తినే ఆహారంలో ఈ మొక్క ఆకుల్ని అప్పుడప్పుడూ వేసేసుకోవడమే.



సేజ్ హెర్బ్ : ఇది కూడా ఔషధ మొక్కే. చాలా ఆహారాల్లో దీని ఆకుల్ని ఉపయోగిస్తారు. ఈ ఆకుల చిన్న ముద్ద నోట్లో వేసుకొని తింటే చాలు జ్ఞాపకశక్తి పెరుగుతుంది, చురుకుదనం వస్తుంది, ఏకాగ్రత పెరుగుతుంది. జీర్ణ వ్యవస్థ మెరుగవుతుంది. కడుపులో నొప్పి పోతుంది. దీని గింజలు, పప్పులతో పాటుగా వండుకుంటారు. వంటల్లో ఈ ఆకుల్ని కూడా వేసుకుంటే సరి. రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం.

బిడ్డల ఆకలి తీర్చేందుకే..

(మొదటిపేజీ తరువాయి)

బాల్య వివాహాలు తగ్గాయని, బాలింతలకు కేసీఆర్ కిట్ ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో సహజ ప్రసవాలు పెరిగి మాత శిశు మరణాలు తగ్గాయని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించడం వల్ల విద్యార్థుల్లో రక్తహీనత, పౌష్టికాహారం లోపాన్ని తగ్గిస్తుంద ని, తద్వారా వారు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు చదువుపై మరింత దృష్టి పెట్టేందుకు తోడ్పడుతుందని తెలిపారు. అంతేకాకుండా, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందన్నారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ద్వారా బోధన చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వెయ్యి రెసిడెన్సియల్ పాఠశాలలు ఏర్పాటు చేయగా అందులో సగం బాలికల పాఠశాలలు ఉన్నాయన్నారు. అనంతరం మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి చదువుపట్ల ఏకాగ్రతను పెంచే దిశగా చేపట్టినదే 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' అని అన్నారు. పంచాయతీరాజ్, మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖల సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శంబీపూర్ రాజు, బొగ్గారపు దయానంద్, చైర్మెన్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సత్తు వెంకటరమణరెడ్డి, పంచాయతీరాజ్ డైరెక్టర్ హనుమంతరావు, విద్యాశాఖ సెక్రటరీ వాకాటి కరుణ, డైరెక్టర్ దేవసేన, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీహార్‌లో కులగణనపై జోక్యానికి నో

(మొదటిపేజీ తరువాయి)

ఆగస్టు 2న పట్నా హైకోర్టు సైతం తీర్పు వెలువరించింది. అయితే కుల గణన సర్వే రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ నలంద నివాసి అఖిలేశ్ కుమార్, యూత్ ఫర్ ఈక్వాలిటీ, ఏక్ సోచ్ ఏక్ ప్రయాస్ అనే స్వచ్ఛంద సంస్థలు సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టీ ధర్మాసనం విచారించింది. ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ం ఇటీవల సర్వే వివరాలను వెల్లడించిందని పిటిషనర్ తరపు న్యాయవాది అపరాజితా సింగ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధమని,వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'రాష్ట్ర ప్రభుత్వం లేదా ఏదైనా ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయాన్ని అడ్డుకోలేం. అది తప్పిదమే అవుతుంది. ఒకవేళ డేటాకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే.. దాన్ని పరిశీలనలోకి తీసుకుంటాం. ఇటువంటి సర్వే చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలు, తదితర అంశాలను పరిశీలిస్తాం' అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా సర్వేకు సంబంధించి తదుపరి సమాచారాన్ని ప్రకటించకుండా యథాతథ స్థితిని పిటిషనర్ కోరినప్పటికీ.. సుప్రీం ధర్మాసనం అందుకు నిరాకరించింది. ఈ క్రమంలో పిటిషనర్ల సవాలుపై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్ల తదుపరి విచారణను 2024 జనవరికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

బీహార్ సర్వే వివరాలు..

నితీశ్ కుమార్ ప్రభుత్వం 2024 సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో రాష్ట్రంలో కులగణనపై ఇటీవల సర్వే జరిపింది. ఆ సర్వే వివరాలను విడుదల చేసింది. రాష్ట్రంలో 13.07 కోట్ల జనాభా ఉండగా, వీరిలో ఓబీసీలు, ఈబీసీలు 63 శాతం ఉన్నారు. వీరిలో ఈబీసీలు 36 శాతం కాగా, ఓబీసీలు ఆ తర్వాత స్థానంలో 27.13 శాతంగా ఉన్నారు. ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కులానికి చెందిన ఓబీసీ గ్రూప్‌లోని యాదవులు మొత్తం జనాభాలో 14.27 శాతం ఉన్నారు. షెడ్యూల్డ్ కులాల్లోకి వచ్చే దళితులు 19.65 శాతం ఉన్నారు. ఎస్టీలు సుమారు 22 లక్షలు అంటే 1.68 శాతం ఉన్నారు.

మోగనున్న నగారా..!

(మొదటిపేజీ తరువాయి)

సంఘం ఢిల్లీలో ఎన్నికల పరిశీలకులతో భేటీ జరపనుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థంగా అమలు చేయడంతోపాటు క్షేత్రస్థాయిలో ఎన్నికల నిర్వహణపై ధనం, కండ బలం ప్రభావాన్ని తగ్గించేందుకు అవసరమైన వ్యూహాన్ని ఈసీ అమలు చేయనుంది. ఇందుకోసం పోలీసులు, వ్యయాలు, సాధారణ విభాగాలకు సంబంధించిన పరిశీలకులతో శుక్రవారం మొత్తం సమీక్ష జరిపింది. తుది ప్రణాళికకు ఆమోదం తెలపనుంది. ఆయా రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్షలు జరిపిన విషయం తెలిసిందే.

ముంబయిలో అగ్ని ప్రమాదం

- ఏడుగురి సజీవ దహనం
- 40 మందికి గాయాలు



ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలో శుక్రవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. గోరేగావ్ ప్రాంతంలో ఒక ఏడు అంతస్తుల నివాస భవనంలో మంటలు చెలరేగి ఏడుగురు సజీవ దహనమయ్యారు. మరో 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గోరేగావ్ ప్రాంతంలోని పశ్చిమ అజాద్ నగర్ లోకాలిటీలోని జై భవాని భవనంలో మంటలు ప్రారంభమయ్యాయి. ఒక్కసారిగా భవనమంతా వ్యాపించాయి. సమాచారమందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మైనర్లుసహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయినట్టు బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో 12 మంది పురుషులు, 28 మంది మహిళలు గాయపడ్డారని, వారిని ఆసుపత్రులకు తరలించామని చెప్పారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా వెల్లడి కాలేదు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ప్రమాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. క్షతగాత్రుల చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు

బీఆర్ఎస్‌ను గెలిపించేందుకే మోడీ తాపత్రయం

- టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తామనీ, ఇంటింటికీ తిరుగుతామని టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ బలంగా ఉన్న 76 స్థానాల్లో ఓట్లను చీల్చి బీఆర్ఎస్‌ను గెలిపించడానికి ప్రధాని మోడీ తాపత్రయ పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలోనే పసుపు బోర్డు, గిరిజన విశ్వవిద్యాలయం గుర్తుకొచ్చాయా?అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీ సాధ్యం కాదని చెప్పిన ఓపీఎస్‌ను అమలు చేస్తామన్నారు. దళితబంధు ఎంత మందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేండ్లలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో, డబుల్ బెడ్రూం ఇండ్లు ఎన్ని ఇచ్చారో చెప్పాలని కోరారు. మోడీ మాట్లాడిన మాటలకు ఇంత వరకు కేసీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

కులగణనకు కేంద్రంపై ఒత్తిడి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీల నుంచి కేంద్రంపై ఒత్తిడి పెరుగుతున్నది. ఇప్పటికే బీహార్ రాష్ట్రం కులగణను నిర్వహించి మోడీ సర్కారుపై పరోక్షంగా ఒత్తిడిని పెంచింది. అయితే, దేశంలోని ఓబీసీలను ఏకీకృతం చేయడానికి కేంద్రం రోహిణి ప్యానెల్ సిఫారసులను అమలు చేసే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. కుల గణనపై మోడీ ప్రభుత్వం సందిగ్ధతతో ఉండటంతో ఎన్డీయే మిత్రపక్షాలు సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ), అప్నా దళ్ (ఎస్), రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాలు రోహిణి ప్యానెల్ నివేదికను వీలైనంత త్వరగా అమలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయి.

వర్గాల మధ్య రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలను సమానమైన పునర్విభజనను నిర్ధారించడానికి ఓబీసీల ఉప-వర్గీకరణను జస్టిస్ జి రోహిణి నేతృత్వంలోని ప్యానెల్‌కు అప్పగించారు. ప్యానెల్ 2,600ఓబీసీ కమ్యూనిటీలను మూడు బ్యాండ్‌లుగా వర్గీకరించింది. ఎక్కువ కాలం రిజర్వేషన్ ప్రయోజనాలను పొందని సమూహాలకు 8 నుంచి 10 శాతం రిజర్వేషన్‌ను నిర్ణయించింది. 983 కులాలు ఎలాంటి ప్రయోజనాలనూ పొందలేదని ప్యానెల్ కనుగొన్నది.

రాష్ట్ర జనాభాలో మూడింట రెండు వంతుల మంది వెనుకబడిన వర్గాలకు చెందినవారని బీహార్ కులాల సర్వే వెల్లడించినప్పటి నుంచి బీజేపీపై ఒత్తిడి పెరిగిందని విశ్లేషకులు అంటున్నారు. ఎస్‌బీఎస్‌పీ చీఫ్ ఓం ప్రకాష్ రాజ్‌భర్ మాట్లాడుతూ.. రోహిణి ప్యానెల్ నివేదికను ఎన్నికల ముందు అమలు చేయవచ్చని అన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే మాట్లాడుతూ.. కేంద్రం దేశవ్యాప్తంగా కుల గణన చేయాలనీ, రాష్ట్రాలు కుల సర్వేలు నిర్వహించడాన్ని తాను అంగీకరించనని అన్నారు. కుల ప్రాతిపదికన జనాభా గణనను తమ పార్టీ ఇప్పటికే డిమాండ్ చేసిందని అప్నాదళ్ (ఎస్) నేత, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్ తెలిపారు.

ఓబీసీలను ఉప వర్గీకరించి 12 వారాల్లోగా నివేదిక సమర్పించేందుకు కేంద్రం 2017లో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జి రోహిణి నేతృత్వంలోని కమిషన్ తన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఈ ఏడాది జులై 31న సమర్పించింది.

పింఛన్ల పెంపుపై త్వరలో శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా హన్మకొండలోని 'కుడా' మైదానంలో, వరంగల్ నగరంలోని ఖిలావరంగల్ కోట మైదానంలో జరిగిన బహిర ంగసభల్లో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ మరో ఛాన్స్ ఇవ్వమని అడుగుతున్నదని, ఆ పార్టీకి ఇప్పటికే 11 సార్లు ఛాన్స్ ఇస్తే 55 ఏండ్లు రాష్ట్రాన్ని పీల్చి పిప్పిచేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కరెంటు ఇస్తలేదని కాంగ్రెస్, బీజేపీలు అబద్దాలు ప్రచారం చేస్తున్నాయని, ఈ రెండు పార్టీలకు బంపర్ ఆఫర్ ఇస్తున్నామని.. "బస్సులు మేమే పెడుతం.. ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తం బస్సుల్లో తిరిగి కరెంటు తీగలను గట్టిగా పట్టుకోండి.. కరెంటుందో లేదో తెలుస్తది" అని తెలిపారు.

తెలంగాణపై విషం చిమ్ముతున్న మోడీ..

తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ప్రధాని మోడీ విషం చిమ్ముతూనే ఉన్నారని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని మోడీ వ్యాఖ్యానించారని, రాష్ట్రం ఏర్పడితే సంబురాలు చేసుకోలేదని ఇష్టమొచ్చినట్టు మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అమెరికాకు పారిపోయిన కిషన్‌రెడ్డి ఇప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడయ్యారని తెలిపారు. మోడీ దేవుడని సంజయ్ మాట్లాడుతున్నారని, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచినందుకు దేవుడా అని ప్రశ్నించారు. రూ.400 ఉన్న గ్యాస్ ధరను రూ.1,250లకు పెంచారన్నారు.

ఏ గట్టునుంటరో తేల్చుకోవాలె..

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన వరంగల్ వాళ్లు ఏ గట్టున ఉంటారో తేల్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా రంగస్థలం సినిమాలోని 'ఏ గట్టునుంటావో నాగన్న' అనే పాటని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు వస్తున్నాయని ఆగమాగం కావద్దన్నారు. ఒకవైపు రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం, సంక్షేమ పథకాలతో పరుగులు పెడుతున్న ప్రభుత్వం, అభివృద్ధి ఫలాలు అందిస్తున్న వినయ్ ఉన్నారని, మరో వైపు రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిన కాంగ్రెస్, బీజేపీ ఉన్నాయన్నారు. 25 ఏండ్లుగా వినయ్‌భాస్కర్‌ను కార్పొరేటర్ స్థాయి నుంచి చీఫ్ విప్ స్థాయి వరకు ఎదగడానికి అవకాశమిచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అయన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 24 అంతస్తుల అతిపెద్ద ఆస్పత్రి వరంగల్‌లో నిర్మాణంలో ఉన్నదని, దసరా పండుగలోపు నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. అలాగే, అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. సభలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు పసునూరి దయాకర్, మాలోత్ కవిత, హన్మకొండ జడ్పీ చైర్మెన్ డాక్టర్ సుధీర్‌కుమార్, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అరూరి రమేష్, నన్నపనేని నరేందర్, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు పన్ను చెల్లింపు సొమ్ము

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేయాలంటూ.. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, ఆర్బీఐలకూ నోటీసులు జారీ చేసింది.

'ఎన్నికలకు ముందు ప్రభుత్వం నగదు పంపిణీ చేయడం కంటే దారుణం మరొకటి ఉండదు. ఇది ప్రతిసారీ జరుగుతోంది. చివరకు పన్ను చెల్లింపుదారులపై ఈ భారం పడుతోంది. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు పన్ను చెల్లింపుదారుల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నాయి' అని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లను,ఎన్నికల కమిషన్,ఆర్బీఐలను నాలుగు వారాల్లోపు స్పందించాలని ఆదేశించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లతోపాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మిజోరంలలో మరికొన్ని వారాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

కులగణనే తొలి అడుగు..?

(మొదటిపేజీ తరువాయి)

రంగును సైతం బయటపెడుతుందని కూడా నమ్ముతోంది. కనుక ఆ దిశగా తన వ్యూహాలకు పదును పెడుతోంది. అందులో తొలి అడుగే బీహార్‌లో జరిగిన కులగణన. కులాల వారీ జనాభా లెక్కలు తేలితే వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీలు మరిన్ని ఆర్థిక, సంక్షేమ ప్రయోజనాలు పొందగలుగుతారు. రాజకీయంగానూ ఎదుగుతారు. ఉదాహరణకు బీహార్‌లో ఓబీసీల జనాభా 63%. ఇండియా కూటమి చెబుతున్న విధంగా అక్కడ ఓబీసీ కోటాను పెంచితే చట్టసభలలో ఇప్పటి వరకూ అగ్రవర్ణాల చేతిలో ఉన్న జనరల్ కేటగిరీ సీట్లు తగ్గిపోతా యి. వెనుకబడిన తరగతులు, ఎస్సీలు, ఎస్టీల స్థానాలు పెరుగుతాయి. ఇందుకు న్యాయ వ్యవస్థ కూడా అనుమతిస్తోంది. ఉదాహరణకు తమిళనాడులో 50% కోటా పరిమితి ఎప్పుడో దాటిపోయింది.

అరెస్టుకు బలమైన కారణమే లేదు

(మొదటిపేజీ తరువాయి)

వాదనలు వినకుండానే రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాది ఎవరో వారికి తెలుసు. ఇప్పటికీ సమాచారం ఇవ్వలేదు. అయితే తమ లాయర్‌కు సమాచారం ఇచ్చారు. ప్రతివాదిని వినకుండానే ఉత్తర్వులు జారీ చేశారు" అని సిబల్ వాదనలు వినిపించారు.

ఈ కేసును ఎలాగైనా పొడిగించాలని తుషార్ మెహతా ప్రయత్నం చేశారు. మెహతా ప్రత్యుత్తరంలో సమయం కోరారు. ఈ దశలోనే రిమాండ్ దరఖాస్తులోని లోపాలను, అరెస్టుకు గల కారణాలను తెలియజేయకపోవడంలోని న్యాయపరమైన లోపాన్ని కోర్టు ఎత్తిచూపింది. ఈ కేసును సోమవారం మొదటగా పరిశీలిస్తామని కూడా కోర్టు తెలియజేసింది. ఈ దశలో కేసు పత్రాలను అందజేస్తామని మెహతా హామీ ఇచ్చారు. అమిత్ తరపు న్యాయవాది తన క్లయింట్ డిఫరెంట్‌లీ ఎబుల్డ్ అని కోర్టుకు తెలిపారు. అమిత్ వైద్య అవసరాల్లో ఎలాంటి లోటుపాట్లు చేయవద్దని విచారణ అధికారిని కోర్టు ఆదేశించింది.కోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ కాపీని స్వీకరించిన తర్వాత శుక్రవారం ఢిల్లీ హైకోర్టులో కపిల్ సిబల్ కేసును ప్రస్తావించారు.

19 నుంచి జూనియర్ కాలేజీలకు దసరా సెలవులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలకు ఈనెల 19 నుంచి దసరా సెలవులుంటాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూనియర్ కాలేజీలకు ఈ నెల 19 నుంచి 25 వరకు ఏడు రోజులపాటు దసరా సెలవులుంటాయని స్పష్టం చేశారు. ఈనెల 26న జూనియర్ కాలేజీల్లో తరగతులు పునఃప్రారంభమవుతాయని వివరించారు. జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈవో)లు ఇందుకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూనియర్ కాలేజీల యాజమాన్యాలు ఈ నిబంధనలను పాటించాలని కోరారు. రాష్ట్రంలోని పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనెల 13 నుంచి 25 వరకు 13 రోజుల పాటు ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ బడులకు సెలవులుంటాయని పేర్కొంది.



తిలక్ వర్మ మెరువగా..!

● ఆసియా గేమ్స్ ఫైనల్లో భారత్

హాంగ్జౌ : 2023 ఆసియా క్రీడల క్రికెట్ ఫైనల్లోకి టీమ్ ఇండియా అడుగుపెట్టింది. శుక్రవారం బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్లో టీమ్ ఇండియా ఏకపక్ష విజయం నమోదు చేసింది. తొలుత బంగ్లాదేశ్‌ను 20 ఓవర్లలో 96/9 పరుగులకే కట్టడి చేయగా.. స్వల్ప లక్ష్యాన్ని మనోళ్లు 9.2 ఓవర్లలోనే ఛేదించారు. 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. పసిడి పోరుకు చేరుకుంది. నేడు అఫ్గనిస్థాన్‌తో గోల్డ్ మెడల్ కోసం పోటీపడనుంది.

తెలుగు తేజం తిలక్ వర్మ (55 నాటౌట్, 26 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీతో మెరిశాడు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) డకౌట్‌గా నిష్క్రమించగా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (40 నాటౌట్, 26 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో జతకట్టిన తిలక్ వర్మ.. రెండో వికెట్‌కు అజేయంగా 97 పరుగులు జోడించాడు. రెండు ఫోర్లు, ఆరు సిక్సర్లతో చెలరేగిన తిలక్ వర్మ.. అర్థ సెంచరీతో సత్తా చాటాడు. ఇక అంతకుముందు సాయి కిశోర్ (3/12), వాషింగ్టన్ సుందర్ (2/15) మెరవటంతో బంగ్లాదేశ్ చతికిల పడింది. ఓపెనర్ ఎమాన్ (23), వికెట్ కీపర్ జాకర్ అలీ (24) మాత్రమే బంగ్లాదేశ్ తరపున ఆకట్టుకునే ప్రదర్శన చేశారు.

శుభ్‌మన్‌కు డెంగీ జ్వరం

● ఆసీస్‌తో పోరుకు అనుమానమే!



చెన్నై : 2023 ప్రపంచకప్ వేటలో ఆతిథ్య టీమ్ ఇండియాకు ఆరంభంలోనే అవాంతరం ఏర్పడింది. ఈ ఏడాది వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన, గత నాలుగు వన్డేల్లో ఏకంగా రెండు సెంచరీలు, ఓ అర్థ సెంచరీ సాధించిన యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ డెంగీ జ్వరం బారిన పడ్డాడు. తిరువనంతపురం నుంచి చెన్నైకి వచ్చిన టీమ్ ఇండియా రెండు రోజులుగా చెపాక్‌లో సాధన చేస్తుంది. కానీ శుభ్‌మన్ గిల్ మాత్రం ప్రాక్టీస్ సెషన్‌కు రాలేదు. సాధారణ జ్వరంతో బాధపడుతున్నాడని తొలుత భావించినా.. గిల్ డెంగీ ఫీవర్ బారిన పడ్డాడని బీసీసీఐ వైద్య బృందం నిర్ధారించింది. ప్రస్తుతం గిల్ బోర్డు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. భారత్, ఆస్ట్రేలియా ప్రపంచకప్ పోరు అక్టోబర్ 8న చెన్నైలో జరుగనుంది. గిల్ ఆరోగ్యం కుదుటపడకుంటే.. ఆసీస్‌తో మ్యాచ్‌కు అతడు అనుమానమేనని తెలుస్తోంది. ' గిల్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. రోజు రోజుకు అతడు మెరుగవుతున్నాడు. మ్యాచ్‌కు ఇంకా సమయం ఉంది. అప్పుడే గిల్‌పై ఏ నిర్ణయానికి రాలేదు. మ్యాచ్ రోజే గిల్ ఆడేది లేనిది తెలుస్తుంది. గిల్ ఆరోగ్యం మెరుగవుతుంది.. అదే అతిపెద్ద సానుకూలాంశం' అని భారత చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. శుభ్‌మన్ గిల్ అనారోగ్యంతో తొలి మ్యాచ్‌కు దూరమైతే.. ఇషాన్ కిషన్, కెఎల్ రాహుల్‌లలో ఒకరు ఓపెనింగ్ చేయనున్నారు. గిల్ ఈ ఏడాది వన్డేల్లో 72.35 సగటు, 105.03 స్ట్రయిక్‌రేట్‌తో 1230 పరుగులు పిండుకున్నాడు. ఇషాన్ కిసన్, కెఎల్ రాహుల్ ఇటీవల ఆసియా కప్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఆకట్టుకునే ప్రదర్శన చేశారు.

పసిడితో పారిస్‌కు!

హాకీ ఇండియా అదరగొట్టింది. ఆసియా క్రీడల్లో అత్యధిక పసిడి పతకాలు అందుకున్న రెండో జట్టుగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో జపాన్‌ను చిత్తు చేసిన మెన్స్ జట్టు.. పసిడి పతకంతో పాటు 2024 పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కైవసం చేసుకున్నారు. మల్లయోధులు కాంస్య పట్టుతో మెరువగా.. సెపక్‌తక్రాలో అమ్మాయిలు చారిత్రక పతక ప్రదర్శన చేశారు. షట్లర్ ప్రణయ్ కాంస్యంతో సరిపెట్టుకోగా.. సాత్విక్, చిరాగ్ జోడీ పసిడి వేటకు సిద్ధమైంది. 22 పసిడి, 34 రజతాలు, 39 కాంస్యాలతో ఓవరాల్‌గా 95 మెడల్స్ సాధించిన భారత్.. పతకాల పట్టికలో నాల్గో స్థానంలో నిలిచింది.

● హాకీ ఇండియాకు గోల్డ్ మెడల్ ● రెజ్లింగ్‌లో మూడు కాంస్యాలు
● సెపక్‌తక్రాలో చారిత్రక పతకం ● హాంగ్జౌ ఆసియా క్రీడలు 2023



నవతెలంగాణ-హాంగ్జౌ

ఆసియా క్రీడల్లో హర్మన్‌ప్రీత్‌సేన చాంపియన్‌గా అవతరించింది. పసిడి పోరులో జపాన్‌ను 5-1తో చిత్తుచేసి గోల్డ్ మెడల్‌తో పాటు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఆసియా క్రీడల్లో నాల్గో పసిడి పతకం సాధించిన టీమ్ ఇండియా.. అత్యధిక గోల్డ్ నెగ్గిన జట్ల జాబితాలో జపాన్‌తో సమానంగా నిలిచింది. స్వర్ణమే లక్ష్యంగా ఆసియా క్రీడలకు వచ్చిన హర్మన్‌ప్రీత్ సేన.. ఆరంభం నుంచీ దుమ్మురేపింది. గ్రూప్ దశలో అజేయంగా నిలిచి.. నాకౌట్‌లోనూ చెలరేగింది. శుక్రవారం నాటి ఫైనల్లో జపాన్‌ను 5-1తో ఓడించింది. తొలి క్వార్టర్‌లో 0-0తో గోల్ నమోదు కాలేదు. రెండో క్వార్టర్‌లో మన్‌ప్రీత్ సింగ్ 25వ నిమిషంలో గోల్ సాధించి బ్రేక్ సాధించాడు. మూడో క్వార్టర్‌లో మనోళ్లు మరింత రెచ్చిపోయారు. హర్మన్‌ప్రీత్ సింగ్ 32వ నిమిషంలో, రోహిదాస్ 36వ నిమిషంలో గోల్స్ నమోదు చేసి భారత్ ఆధిక్యాన్ని 3-0కు మెరుగుపర్చారు. చివరి క్వార్టర్‌లో భారత్ మరో రెండు గోల్స్ కొట్టగా.. జపాన్ ఓ ఊరట గోల్ నమోదు చేసింది. 48వ నిమిషంలో అభిషేక్ గోల్ కొట్టగా.. 59వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మరో గోల్ సాధించాడు. జపాన్ తరఫున 51వ నిమిషంలో తనక ఓ గోల్ కొట్టాడు. బలమైన జపాన్‌ను నాలుగు గోల్స్ తేడాతో చిత్తుగా ఓడించిన హాకీ ఇండియా.. పసిడి పతకం సొంతం చేసుకుంది. కాంటినెంటల్ ఈవెంట్ విజేతగా నిలిచి విశ్వ క్రీడలకు నేరుగా అర్హత సాధించింది.

సిల్వర్ షో : బ్రిడ్జ్ (కార్డ్స్ గేమ్)లో భారత మెన్స్ జట్టు రజత పతకం సాధించింది. సెమీఫైనల్లో చైనాను ఓడించి పసిడి ఫేవరేట్‌గా నిలిచిన భారత్.. బంగారు పతక వేటలో రజతంతో సరిపెట్టుకుంది. ఫైనల్లో హాంగ్‌కాంగ్ చేతిలో 238.1-152తో భారత్ పరాజయం పాలైంది. భారత జట్టులో రాజు తోరణి, అజయ్ ప్రభాకర్, రాజేశ్వర్ తివారి, సుమిత్ ముఖర్జీలు సిల్వర్‌తో మెరిశారు. 2018 జకర్తా ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన బ్రిడ్జ్ మెన్స్ జట్టు ఈసారి పతకం రంగు మెరుగుపర్చుకుంది. ఇక ఆర్చరీలో రికర్వ్ జట్టు సైతం పతకాల పంట పండించాయి. మెన్స్ రికర్వ్ జట్టు సిల్వర్ మెడల్ సాధించగా.. ఉమెన్స్ జట్టు కాంస్యం నెగ్గింది. దక్షిణ కొరియాతో పసిడి పోరులో మన ఆర్చర్లు అంచనాలను అందుకోలేదు. తొలి రౌండ్‌లో 55-60, చివరి రౌండ్‌లో 55-56తో వెనుకంజ వేసిన అటాను దాస్, బొమ్మదేవర ధీరజ్, ప్రభాకర్‌లు 1-5తో బంగారు పతకం దక్షిణ కొరియాకు కోల్పోయారు. మహిళల రికర్వ్ జట్టు అంకిత, భజన్, సిమ్రన్‌జిత్‌లు కాంస్య పతక వేటలో వియత్నాంపై 6-2తో గెలుపొందారు. 56-52, 55-56, 57-50తో మన ఆర్చర్లు పైచేయి సాధించి పతకం సొంతం చేసుకున్నారు.

రెజ్లర్ల కాంస్య పట్టు : రెజ్లింగ్‌లో భారత స్టార్ మల్లయోధుడు బజరంగ్ పూనియా పతకం లేకుండానే ఇంటిముఖం పట్టగా.. శుక్రవారం పోటీల్లో భారత్‌కు మూడు కాంస్య పతకాలు లభించాయి. మహిళల 62 కేజీల ఫ్రీస్టయిల్ విభాగం కాంస్య పతక పోరులో సోనమ్ 7-5తో చైనా రెజ్లర్‌పై విజయం సాధించింది. టెక్నికల్ ఆధిపత్యంతో సోనమ్ కాంస్య పతకం సొంతం చేసుకుంది. మహిళల 76 కేజీల విభాగంలో కిరణ్ మరో మెడల్ సొంతం చేసుకుంది. ఫ్రీస్టయిల్ బ్రాంజ్ మెడల్ బౌట్‌లో మంగోలియా రెజ్లర్‌పై గెలుపొంది మెడల్ సాధించింది. పురుషుల 57 కేజీల విభాగం కాంస్య పతక పోరులో అమన్ మెరిశాడు. 11-0తో చైనా రెజ్లర్ మిగు లిని చిత్తు చేశాడు. టెక్నికల్ సుపిరియారిటీతో అమన్ మెడల్ సొంతం చేసుకున్నాడు. మెన్స్ 65 కేజీల ఫ్రీస్టయిల్‌లో బజరంగ్ పూనియా 0-10తో జపాన్ రెజ్లర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

సెపక్‌తక్రాలో చారిత్రక మెడల్ : సెపక్‌తక్రాలో టీమ్ ఇండియా చారిత్రక పతకం సాధించింది. రెగు మహిళల విభాగంలో భారత్ కాంస్య పతకం సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలోనే సెపక్‌తక్రాలో భారత్‌కు ఓ మెడల్ రావటం ఇదే ప్రథమం. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో టీమ్ ఇండియా వరుస సెట్లలో 0-2తో ఓటమిపాలైంది. 30 నిమిషాల్లోనే ముగిసిన సెమీఫైనల్లో 10-21, 13-21తో టీమ్ ఇండియా అమ్మాయిలు పోరాడి ఓడారు. ఇక కబడ్డీలోనూ భారత జట్టు ఫైనల్లోకి ప్రవేశించాయి. మహిళల విభాగంలో సెమీస్‌లో నేపాల్‌పై 61-17తో భారత్ గెలుపొందగా.. మెన్స్ విభాగంలో 61-14తో ఏకపక్ష విజయంతో టీమ్ ఇండియా పసిడి పోరుకు చేరుకుంది. ఈ రెండు విభాగాల్లోనూ టీమ్ ఇండియా కనీసం రజత పతకాలు ఖాయం చేసుకుంది.



పసిడి వేటకు సాత్విక్, చిరాగ్ : భారత డబుల్స్ స్టార్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ పసిడి వేటకు సిద్ధమయ్యారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ ఫైనల్లోకి ప్రవేశించారు. మలేషియా జోడీ ఆరోన్, వూ యిక్‌లపై వరుస గేముల్లో మనోళ్లు గెలుపొందారు. 24 నిమిషాల్లోనే తొలి గేమ్‌ను 21-17తో.. రెండో గేమ్‌ను 21-12తో 23 నిమిషాల్లోనే ముగించారు. మెన్స్ డబుల్స్ ఫైనల్లోకి ప్రవేశించి కనీసం రజత పతకం ఖాయం చేసుకున్నారు. ఇదిలాఉండగా, భారత సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ చరిత్ర సృష్టించాడు. సయ్యద్ మోడీ (1992) బ్యాడ్మింటన్ మెన్స్ సింగిల్స్ ఆసియా క్రీడల మెడల్ సాధించిన తొలి భారత షట్లర్‌గా నిలిచాడు. చైనా షట్లర్‌తో జరిగిన సెమీఫైనల్లో నిరాశపరిచిన హెచ్.ఎస్ ప్రణయ్ కాంస్య పతకం సాధించాడు. లి సిఫెర్స్ 21-16, 21-19తో వరుస గేముల్లో ప్రణయ్‌పై విజయం సాధించాడు. తొలి గేమ్‌ను 27 నిమిషాల్లో, రెండో గేమ్‌ను 24 నిమిషాల్లో చేజార్చుకున్న ప్రణయ్ కాంస్య పతకంతో ఆసియా క్రీడలను ముగించాడు.



పాకిస్థాన్ బోణీ

● నెదర్లాండ్స్‌పై 81 పరుగులతో గెలుపు

నవతెలంగాణ-హైదరాబాద్

ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ బోణీ కొట్టింది. రెండు వార్మప్ మ్యాచుల్లో ఓటమి పాలైన పాకిస్థాన్.. అసలు సమరంలోనూ ఆ భయాందోళనలు కలిగించింది. మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు మెరవటంతో తొలుత మెరుగైన స్కోరు సాధించిన పాకిస్థాన్.. బౌలర్ల మెరుపులతో అలవోక విజయమే సాధించింది. తొలుత పాకిస్థాన్ 49 ఓవర్లలో 286 పరుగులకు కుప్పకూలగా.. ఛేదనలో నెదర్లాండ్స్ 41 ఓవర్లలో 205 పరుగులకు చేతులెత్తేసింది. పాకిస్థాన్ 81 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అక్టోబర్ 10న హైదరాబాద్‌లోనే శ్రీలంకతో పాకిస్థాన్ తన రెండో మ్యాచ్ ఆడనుంది.



ఆదుకున్న రిజ్వాన్, షకీల్ : టాస్ నెగ్గిన నెదర్లాండ్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అందుకు తగ్గట్టుగానే 38 పరుగులకే పాకిస్థాన్ టాప్-3 వికెట్లు పడగొట్టింది. జమాన్ (12), ఇమామ్ (15), బాబర్ (5)లు స్వల్ప స్కోరుకే నిష్క్రమించారు. ఈ పరిస్థితుల్లో మహ్మద్ రిజ్వాన్ (68, 75 బంతుల్లో 8 ఫోర్లు), సయీద్ షకీల్ (68, 52 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) ఆ జట్టును ఆదుకున్నారు. నెదర్లాండ్స్ ఫీల్డింగ్ తప్పిదాలు సైతం పాకిస్థాన్‌కు బాగా కలిసొచ్చాయి. మిడిల్ ఆర్డర్‌లో రిజ్వాన్, షకీల్ అర్థ సెంచరీలతో కోలుకున్న పాకిస్థాన్.. లోయర్ ఆర్డర్‌లో మహ్మద్ నవాజ్ (39), షాదాబ్ ఖాన్ (32) మెరుపులతో మెరుగైన స్కోరు సాధించింది. హరీశ్ రవూఫ్ (16), షహీన్ (13 నాటౌట్) రాణించారు. డచ్ బౌలర్లలో లీడె (4/62) నాలుగు వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. ఇక ఛేదనలో నెదర్లాండ్స్ ఆశించిన దూకుడు కనబరచలేదు. ఓపెనర్ విక్రమ్‌జిత్ సింగ్ (52, 67 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), లీడె (67, 68 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో మెరిసినా.. మిగతా బ్యాటర్లు రాణించలేదు. మాక్స్ (5), కొలిన్ (17), తేజ నిడమనూరు (5), స్కాట్ ఎడ్వర్డ్స్ (0), షకిబ్ (10), వాన్‌డర్ మెర్వ్ (4)లు తేలిపోయారు. చివర్లో వాన్ బీక్ (28 నాటౌట్, 28 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులతో నెదర్లాండ్స్ 200 పరుగుల మార్క్ దాటింది. పాకిస్థాన్ బౌలర్లలో ఇఫ్తికార్ అహ్మద్ (3/43), హసన్ అలీ (2/33) డచ్ బ్యాటర్లను కట్టడి చేశారు. పాకిస్థాన్ బ్యాటర్ సయీద్ షకిబ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

నవచిత్రం



రవితేజ

సైన్ లాంగ్వేజ్‌లోనూ రిలీజ్

రవితేజ తన తొలి పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'తో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. వంశీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని 'ది కాశ్మీర్ ఫైల్స్', 'కార్తికేయ 2'ని అందించిన అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అభిషేక్ అగర్వాల్ భారీ స్థాయిలో నిర్మించారు. ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోయేలా చేయడానికి అన్ని రకాల జాగ్రత్తలను మేకర్స్ తీసుకుంటున్నారు.

ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ఇటీవల ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో రవితేజ లాంచ్ చేశారు. ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (సంకేత భాష)లో కూడా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అందులో ఒక యాంకర్ క్లిప్‌లోని కంటెంట్‌ను వివరిస్తున్నారు. భారతదేశంలోనే సైన్ భాషలో విడుదలైన తొలి ట్రైలర్ ఇదే. మిగతా ట్రైలర్స్‌తో పాటు సైన్ లాంగ్వేజ్ ట్రైలర్‌కి కూడా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాని ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ చేయాలని ఈనెల 20న ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌లో కూడా సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత అభిషేక్ అగర్వాల్ అధికారికంగా ప్రకటించారు.

దీంతో ఈ సినిమా సైన్ లాంగ్వేజ్‌లో విడుదలయ్యే మొదటి భారతీయ చిత్రం నిలవడం ఓ విశేషమైతే, భారతీయ సినిమాల్లో ఇదొక స్వాగతించదగిన మార్పుకి దోహదపడటం మరో విశేషం. నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ కథానాయికలుగా నటిస్తున్న ఈచిత్రాన్ని దసరా కానుకగా ఈ నెల 19న అన్ని దక్షిణాది భాషలతోపాటు హిందీలోనూ విడుదల చేయనున్నారు.

నయా లవ్‌స్టోరీతో బబుల్ గమ్



రోషన్ కనకాల, మానస చౌదరి

నూతన నాయకా నాయికలు రోషన్ కనకాల, మానస చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'బబుల్‌గమ్'. 'క్షణం', 'కృష్ణ అండ్ హిజ్ లీల' చిత్రాల దర్శకుడు రవికాంత్ పేరెపు దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలసి మహేశ్వరి మూవీస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న దర్శకుడు రాజమౌళి శుక్రవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను లాంచ్ చేశారు. 'నటుడిగా అరంగేట్రం చేసినందుకు రోషన్‌కు అభినందనలు. రోషన్ తనకంటూ ఓ ప్రత్యేక ముద్ర వేయాలి. రాజీవ్, సుమ గర్వపడేలా చేయాలని కోరుకుంటున్నాను. అలాగే, బబుల్‌గమ్ టీమ్‌కి శుభాకాంక్షలు' అని ట్వీట్‌లో రాజమౌళి పేర్కొన్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ రొమాంటిక్ స్టోరీ గ్లింప్స్ ఈనెల 10న విడుదల కానుంది.

ప్రతి తండ్రిని హత్తుకునే పాట

నాని, మృణాల్ ఠాకూర్ తొలిసారి జంటగా నటిస్తున్న పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్నా'. వైర ఎంటర్‌టైన్ మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంతో శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నాని కూతురిగా బేబీ కియారా ఖన్నా నటించింది. 'ఇది సాధారణ ప్రేమకథ కాదు. ఈ సినిమా తండ్రీకూతుళ్ల అందమైన, భావోద్వేగ ప్రయాణాన్ని ప్రజెంట్ చేస్తుంది. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ 'గాజు బొమ్మ..' ని హీరో మహేష్ బాబు లాంచ్ చేసి, 'నన్ను కదిలించినట్లే ప్రతి తండ్రిని హత్తుకునే పాట ఇది' అని ఆయన పేర్కొన్నారు. అనంత శ్రీరామ్ చక్కని సాహిత్యాన్ని అందించిన ఈపాటకు హేషమ్ అబ్దుల్ వహాబ్ సరైన ట్యూన్‌తో పాటు తన సొంత వాయిస్‌లో పాటకు భావోద్వేగాలను కూడా జోడించాడు. డిసెంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది.



నాని, కియారా ఖన్నా

అత్యంత సహజంగా రాక్షస కావ్యం



- నిర్మాత శింగనమల కల్యాణ్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా విదేశాల్లో ఉంటూ నిర్మాతగా, ఫైనాన్షియర్‌గా సినిమాల మీద తనకున్న ప్యాషన్‌ని చాటుకుంటున్నారు శింగనమల కల్యాణ్. తన సినీ వ్యాలీ మూవీస్‌లో ఈ ఏడాది 'భాగ్ సాలే' సినిమాను నిర్మించిన ఆయన దాము రెడ్డితో కలసి గరుడ ప్రొడక్షన్స్, పింగో పిక్చర్స్ పార్టనర్ షిప్‌లో ప్రొడ్యూస్ చేస్తున్న కొత్త సినిమా 'రాక్షస కావ్యం'.

అభయ్ నవీన్, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకి దర్శకుడు శ్రీమాన్ కీర్తి. ఈనెల 13న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

ఈ సందర్భంగా ఈ సినిమా గురించి నిర్మాత శింగనమల కళ్యాణ్ మాట్లాడుతూ, 'తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఉండే రా అండ్ రస్టిక్ మూవీ ఇది. చాలా సహజంగా ఉంటుంది. ముఖ్యంగా దిగువ మధ్య తరగతికి చెందిన మనుషులు, బస్తీల్లో ఉండేవాళ్ల మైండ్ సెట్, జీవన విధానం మూవీలో కనిపిస్తుంది. కథను బాగా తెరకెక్కించాడు దర్శకుడు శ్రీమాన్. ప్రస్తుతం టాంగా ప్రొడక్షన్స్ అధినేత విజయ్ మట్టపల్లి భాగస్వామ్యంతో మా సంస్థ నిర్మిస్తున్న 'ప్రేమ కథ' అనే సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి దశలో ఉంది. మరో మూవీ కూడా క్రిస్మస్‌కు లేదా జనవరిలో రిలీజ్ చేస్తాం. మా సంస్థలో సంజీవ్ రెడ్డి డైరెక్షన్‌లో చైతన్య రావ్ హీరోగా ఓ కొత్త సినిమా ఉంటుంది. అలాగే భవిష్యత్‌లో స్టార్ హీరోలతోనూ సినిమాలను మా సంస్థ నిర్మించనుంది' అని తెలిపారు.

ఈ కథలో విలన్స్ గెలవాలి. ఎప్పుడూ హీరోలే ఎందుకు గెలవాలి అనే కామెడీ పాయింట్ కూడా కొత్తగా ఉంటుంది. ఇవాళ నెగటివ్ క్యారెక్టర్స్‌ను ప్రేక్షకులు బాగా ఇష్టపడుతున్నారు. అందుకు 'పుష్ప, కేజీఎఫ్' లాంటి సినిమాల సక్సెస్ నిదర్శనం. అలాంటి ట్రెండ్ ఇప్పుడు నడుస్తోంది. అందుకే మా ట్రైలర్ రిలీజ్‌లో దిల్ రాజు చెప్పింది వంద శాతం కరెక్ట్.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



నాగవంశీ, సంగీత్ శోభన్, కళ్యాణ్‌శంకర్

నిర్మాత సూర్యదేవర రాధా కృష్ణ (చినబాబు) కుమార్తె హారిక సూర్యదేవర నిర్మాతగా పరిచయమైన యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్'. సూర్యదేవర నాగ వంశీ సమర్పించిన ఈ చిత్రంతో కళ్యాణ్ శంకర్ దర్శకుడిగా పరిచయ య్యారు. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సనీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ నటించారు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా సక్సెస్ ప్రెస్ మీట్‌లో నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, "అందరూ కొత్త వాళ్ళు కలిసి చేసిన ప్రయత్నమిది. ఈ సినిమాకి ఇంత మంచి ఓపెనింగ్స్ రావడం సంతోషంగా ఉంది. ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని తెలిపారు.

పరిశ్రమకు అండగా ఉంటా..

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుక తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన ఈ వేడుకలో చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు దిల్‌రాజు, నిర్మాతలు దామోదర ప్రసాద్, చినబాబు, నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్నకుమార్, సి.కళ్యాణ్, రఘుబాబు, పృథ్వి, మాదాల రవి, చిత్రపురి కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్, దొరై, సినీ జర్నలిస్ట్ సంఘం తరపున సురేష్ కొండేటి, లక్ష్మీనారాయణతోపాటు 24 క్రాఫ్ట్‌కు చెందిన నాయకులు, కార్మికులు వేలాదిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తనయుడు తలసాని సాయి యాదవ్ తన తండ్రిపై ఓ రాయించిన ఓ ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి తలసాని మాట్లాడుతూ, 'చిత్ర పరిశ్రమకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా నేను ముందు ఉంటాను. ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశ్రమ సమస్యల పరిష్కారం పట్ల ఎప్పుడూ సానుకూలంగా ఉంటారు' అని తెలిపారు.

మరోసారి సందడికి రెడీ



శ్రీజిత్ విజయ్, శ్వేతామీనన్

వాస్తవ సంఘటనల ఆధారంగా రాసిన 'రతినిర్వేదం' నవల ఆధారంగా అదే పేరుతో 1978లో సినిమాగా విడుదలై విజయవంతమైంది. అదే టైటిల్‌తో 2011లో దర్శకుడు టి.కె.రాజీవ్ కుమార్ తెరకెక్కించారు. శ్వేతా మీనన్, శ్రీజిత్ విజయ్ కీలక పాత్రలు పోషించారు. మలయాళంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులోనూ విడుదలై సంచలన విజయం సాధించింది. తాజాగా ఈ చిత్రం మరోసారి ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమవుతోంది. ఈ నెల 11న ఈ చిత్రాన్ని రీ-రిలీజ్ చేయనున్నారు మేకర్స్. ఈ చిత్రానికి రచయిత: పి.పద్మరాజన్, సంగీతం: ఎం.జయచంద్రన్.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.